

'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 137

బుధవారం 7-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముర్ముకు ఫిజీ పౌర పురస్కారం

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఫిజీ ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'తో గౌరవించింది.

వివరాలు 6లో ▸



ఒక్క రోజు నా కుర్చీలో కూర్చోండి

వారం ముందే కేసును విచారించాలని అభ్యర్థిస్తున్న న్యాయవాదిపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸

'బంగారు' బాటలో..



భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పసిడి పతక వేటలో పడ్డారు. పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో చోప్రా ఒకే ఒక ప్రయత్నంతోనే ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మహిళల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 50 కేజీల సెమీఫైనల్లో వినేశ్ 5–0తో యుస్నెలిస్ లోపెజ్‌పై గెలిచి ఫైనల్ చేరుకుంది. హాకీ సెమీస్‌లో భారత్‌కు 2–3తో జర్మనీ చేతిలో ఓటమి ఎదురైంది.



13లో

న్యూస్‌రీల్

పాస్‌బుక్ ఆధారంగా ప్రతి రైతుకు రుణమాఫీ



రుణమాఫీపై రాజకీయం చేయాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలు చూస్తున్నారని మంత్రి తుమ్మల ధ్వజమెత్తారు. పాస్‌బుక్ ఆధారంగా ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని, రైతుకు రుణ విముక్తి కల్పించడమే లక్ష్యమని అన్నారు.

- వివరాలు 5లో▶

'స్థానిక' ఎన్నికలను సీరియస్‌గా తీసుకుందాం



స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్రపదాధికారులు, జిల్లా అధ్యక్షుల భేటీలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి.

- వివరాలు 11లో▶

స్కాన్ చేయండి.. ఓపీ చీటీ పొందండి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇకపై కేవలం ఒక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రోగులు క్షణాల్లో ఓపీ చీటీ అందుకొనే వెసులుబాటు లభించింది.

- వివరాలు 5లో▶

ఢాకాలో ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా భవనాన్ని చుట్టుముట్టిన ఆందోళనకారులు



..అదే కల్లోలం

సినీ హీరోను కొట్టి చంపిన అల్లరి మూకలు

హోటల్‌కు నిప్పు, 24 మంది సజీవ దహనం

ఇప్పటిదాకా 440 దాటిన మృతులు

బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస **దేశవ్యాప్తంగా లూటీలు, విధ్వంసం**

పార్లమెంటు రద్దు, త్వరలో ఎన్నికలు.. తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనుస్

బంగ్లాదేశ్‌లో ప్రధాని హసీనా రాజీనామాకు, పలాయనానికి దారితీసిన కార్చిచ్చు ఇంకా చల్లారలేదు. దేశవ్యాప్తంగా దమనకాండ నిర్నిరోధంగా కొనసాగింది. గత 24 గంటల్లో కనీసం 100 మంది ఘర్షణలకు బలయ్యారు. పార్లమెంటు రద్దుతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది.

- వివరాలు 6లో▶


బ్రిటన్ నిరాకరణ!

కొన్ని రోజులు భారత్‌లోనే హసీనా

చైనా, ఐఎస్ఐ హస్తం?

హసీనాను దించేందుకు పక్కాగా పావులు

- వివరాలు 6లో▶



జలకళ ఉన్నా హైడ్'డల్'

శ్రీశైలం
స్టేటర్ వైండింగ్ కాలిపోవడంతో పాటు రోటర్ పోల్‌లో ఫాల్ట్

నాగార్జునసాగర్
రెండో యూనిట్‌కు సంబంధించిన రోటర్ స్పైడర్ ఆర్మ్‌కు పగుళ్లు

నిజాంసాగర్
2022 నవంబర్ 9 నుంచి మొత్తం విద్యుత్ కేంద్రం నిరుపయోగంగా ఉంది.

ఎగువ జూరాల
మూడో యూనిట్‌లో కాలిపోయిన స్టేటర్ వైండింగ్

దిగువ జూరాల
అన్ని యూనిట్లలో సీల్ లీకేజీ

పులిచింతల
దాదాపు రెండేళ్లుగా నిరుపయోగంగా మూడో యూనిట్

పాలేరు
రన్నర్ హబ్‌కు కొరవడిన మరమ్మతులు

జలవిద్యుత్ కేంద్రాల్లో ఏడాదిగా నిలిచిన 330.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి

రోజుకు రూ. 4 కోట్లు విలువ చేసే 7.93 ఎంయూల విద్యుదుత్పత్తికి గండి

జలాశయాలకు వరద వస్తున్నా పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసుకోలేని దుస్థితి

మరమ్మతుల నిర్వహణలో జెన్‌కో యాజమాన్యం తీవ్ర తాత్సారం ఫలితం

పూర్తిస్థాయి సీఎండీ లేక విద్యుత్ కేంద్రాలపై పర్యవేక్షణ కరువు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో కృష్ణా పరీవాహకంలోని జలాశయాలన్నీ పూర్తిగా నిండటంతో రోజూ లక్షల క్యూసెక్కుల వరదను కిందకు విడుదల చేస్తున్నా పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు జలవిద్యుదుత్పత్తి చేసుకొనే అవకాశం లేకుండా పోయింది. ఎగువ జూరాల, దిగువ జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రాలకు మరమ్మతులు నిర్వహించకుండా ఏడాదిగా తాత్సారం చేయడంతో రోజుకు రూ. 4 కోట్ల విలువ చేసే 7.93 మిలియన్ యూనిట్ల జలవిద్యుదుత్పత్తికి గండిపడుతోంది. వర్షాకాలం ప్రారంభానికి ముందే మరమ్మతులు నిర్వహించాల్సి ఉండగా సత్వర నిర్ణయాలు తీసుకోకుండా తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) గత, ప్రస్తుత సీఎండీలు, డైరెక్టర్లు తీవ్ర తాత్సారం చేయడం, సకాలంలో టెండర్లు నిర్వహించకపోవడంతో సంస్థకు భారీ ఆదాయనష్టం కలుగుతోంది. సుమారు రూ. 30 కోట్లు ఖర్చు చేస్తే నాలుగు జలవిద్యుత్ కేంద్రాలకూ మరమ్మతులు పూర్తయ్యేవని జెన్‌కో అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కృష్ణా బేసిన్‌లోని జలాశయాలకు కనీసం నెల రోజులు వరద కొనసాగినా ఈ ఏడాది రూ. 120 కోట్ల విలువ చేసే విద్యుత్‌ను జెన్‌కో నష్టపోయే అవకాశం కనిపిస్తోంది. గరిష్టంగా మూడు నెలలు వరద

మిగతా 2వ పేజీలో ▶

రేపు ఆర్‌వోఆర్ చట్టంపై అఖిలపక్షం

సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2024 ముసాయిదా చట్టంపై ఈనెల 8న అఖిలపక్ష సమావేశం జరగనుంది. ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్, ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ భేటీకి బీఆర్ఎస్‌తో సహా అన్ని పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, రెవెన్యూ సంఘాలను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముందుంచిన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదాపై అన్ని రాజకీయ పక్షాలు, ఇతర సంఘాలు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించడంతో పాటు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోదండరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	75 kg	Dressed with Skin	141 kg
₹ 56	Retail Live Bird	97 kg	Skin Less	160 kg

Issued in the interest of consumers

హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ జలాలు!

- గోదావరి మంచినీటి సరఫరా పథకం ఫేజ్–2కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రూ.5,560 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు
- నగరానికి అదనంగా అందుబాటులోకి రానున్న 170 ఎంజీడీల నీళ్లు
- మూసీ ప్రక్షాళనతో పాటు, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ పునరుజ్జీవనం



సాక్షి, హైదరాబాద్: రాజధాని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మంచి 'నీటి'కబురు చెప్పింది. నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి మంచినీటి సరఫరా ఫేజ్–2కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.5,560 కోట్లు కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం ఉత్తర్వులు (జీవో నంబర్ 345) జారీ చేశారు. ఈ పథకం ద్వారా నగరానికి అదనపు జలాలను తరలించడంతో పాటు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలను పునరుజ్జీవింప చేయనుంది. హైబ్రిడ్ యాన్యుటీ (బీఓటీ + ఈపీసీ) మోడ్‌లో పనులు పూర్తి చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు వివిధ మార్గాల ద్వారా 580 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్స్ పర్ డే)ల నుంచి 600 ఎంజీడీల నీటి సరఫరా జరుగుతోంది. అయితే 2030వ సంవత్సరం వరకు

మిగతా 2వ పేజీలో ▶


మొత్తం 15 టీఎంసీల తరలింపు

గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై (జీడీడబ్ల్యూఎస్) పథకం ఫేజ్–1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీటిని తరలిస్తోంది. తాజాగా రెండో దశ పథకం ద్వారా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 15 టీఎంసీల నీటిని వాడుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ 15 టీఎంసీల్లో 10 టీఎంసీల నీటిని నగర ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. మిగతా ఐదు టీఎంసీల నీటిని మూసీ ప్రక్షాళనతో పాటు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాలను పునరుజ్జీవింప చేసేందుకు ఉపయోగించనున్నారు.

16 మంది పీఏసీఎస్‌ల కార్యదర్శులపై వేటు

- 'రుణమాఫీ అవకతవకలపై' సహకార శాఖ సీరియస్
- మరో 13 మంది కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు
- 92 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ లబ్ధిదారుల ఎంపిక విషయంలో అవకతవకలకు పాల్పడిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్‌లు) కార్యదర్శులపై.. రాష్ట్ర సహకార శాఖ చర్యలు చేపడుతోంది. పంట రుణాల మంజూరు, వాటి రెన్యువల్‌కు సంబంధించిన సమాచారాన్ని అసంబద్ధంగా పంపారనే కారణంతో 16 మంది పీఏసీఎస్‌ల కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇందులో 11 పీఏసీఎస్‌లు వాణిజ్య బ్యాంకుల ఆర్థిక సహకారంతో కొనసాగుతుండగా, మిగతా 5 పీఏసీఎస్‌లు డీసీసీబీ ఆర్థిక సాయంతో కొనసాగుతున్నాయి. మరో 13 పీఏసీఎస్‌ల కార్యదర్శులపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సహకార శాఖ డైరెక్టరేట్.. వారిపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసింది. అదేవిధంగా మరో 92 పీఏసీఎస్‌లకు సంబంధించి కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తక్షణమే స్పందించాలని ఆదేశించింది.



బకాయిలు, వడ్డీ లెక్కల్లో తప్పులు!

రాష్ట్ర వ్యాప్తంగా 105 పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులు దొర్లినట్లు అధికారులు గుర్తించారు. పంట రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం.. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ మధ్యలో రుణాలు పొందిన రైతులు మాత్రమే

మిగతా 5వ పేజీలో ▶



పారిశ్రామికవేత్తల భేటీలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, జయేశ్‌రంజన్

చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతాం

అమెరికాలో ఉన్న అవకాశాలన్నీ తెలంగాణలోనూ ఉన్నాయి

రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చేలా కొత్త పారిశ్రామిక పాలసీ

న్యూయార్క్‌లో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలోనూ ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణను వ్యాపారానికి, పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చేందుకు సులభతర విధానాలతో కూడిన కొత్త పారిశ్రామిక పాలసీని రూపొందిస్తున్నామన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను ఒడిసి పట్టేలా కొత్త పారిశ్రామిక విధానం ఉంటుందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ,

మిగతా 11వ పేజీలో ▶

హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నొవేషన్ సెంటర్!

- ఆరు నెలల్లో కార్యకలాపాలు షురూ
- ఆర్‌సీసీఎంతో తెలంగాణ సర్కారు ఒప్పందం

-11లో

ఇదండీ జోక్



'సర్వీసు' లేకుండానే ఆర్‌ఆర్‌ఆర్!

తొలుత డిజైన్ చేసినా తిరస్కరించిన ఎన్‌హెచ్ఏఐ ఈసీ

ఆర్‌ఆర్‌ఆర్ జాతీయ ఎక్స్‌ప్రెస్ వే అయినందున ఐఆర్‌సీ నియమావళి పరిధిలోకి..

పక్క నుంచి వాహనాలు ఎక్స్‌ప్రెస్ వే పైకి వచ్చే అవకాశం ఉండదు

కేవలం ఇంటర్‌చేంజ్ కూడళ్ల వద్ద స్లిప్ రోడ్ల మీదుగా ఎక్కేందుకే వీలు

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్ఆర్)ను సర్వీసు రోడ్లు లేకుండా నిర్మించబోతున్నారు. తద్వారా పూర్తిగా యాక్సెస్ కంట్రోల్డ్ పద్ధతిలో.. పక్కల నుంచి ఇతర వాహనాలు ఈ ఎక్స్‌ప్రెస్ వేపైకి రాకుండా నిరోధించనున్నారు. దీంతో ఉత్తర, దక్షిణ భాగాలు కలిపి దాదాపు 352 కి.మీ. నిడివితో రూపుదిద్దుకోనున్న ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు ఎలాంటి ఆటంకం లేకుండా దూసుకుపోయేందుకు అవకాశం ఉంటుంది. జాతీయ, రాష్ట్ర రహదారులను క్రాస్ చేసే చోట నిర్మించే ఇంటర్‌చేంజ్ కూడళ్లలోని స్లిప్ రోడ్ల మీదుగా మాత్రమే ఇతర వాహనాలు ట్రిపుల్ ఆర్ మీదకు చేరుకోవాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, ఆటో రిక్షాలు, నెమ్మదిగా కదిలే భారీ వాహనాలకు దీని మీదకు అనుమతి ఉండదు.



సర్వీసు రోడ్ల ప్రతిపాదనకు తిరస్కారం

హైదరాబాద్ నగరానికి మణిహారంగా మారిన నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు తరహాలో ట్రిపుల్ ఆర్‌కు కూడా తొలుత సర్వీసు రోడ్లను ప్రతిపాదించారు. ఆ మేరకు ఎన్‌హెచ్ఏఐ ప్రధాన కార్యాలయానికి డిజైన్లు పంపారు. అయితే ఎన్‌హెచ్ఏఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. జాతీయ రహదారులకు స్థానిక పరిస్థితుల ఆధారంగా సర్వీసు రోడ్లను నిర్మిస్తున్నారు. కొన్నిచోట్ల సర్వీసు రోడ్లను నిర్మించకుంటే స్థానికులు ఆందోళనలకు దిగుతున్న సంగతి తెలిసిందే. అయితే కొంతకాలంగా ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో ఎక్స్‌ప్రెస్ వేలకు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) ప్రత్యేక నియమావళిని రూపొందించింది. ఇందులో సర్వీసు రోడ్డు ప్రతిపాదనే లేదు. ట్రిపుల్ ఆర్‌ను కూడా ఎక్స్‌ప్రెస్‌వేగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నియమావళికి విరుద్ధమంటూ సర్వీస్ రోడ్ల ప్రతిపాదనకు కమిటీ తిరస్కరించింది.

సర్వీసు రోడ్లుంటే ఇబ్బందేంటి?

- సాధారణ జాతీయ రహదారులతో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వేలపై వేగ పరిమితి చాలా ఎక్కువ. వాహనాలు భారీ వేగంతో దూసుకుపోతున్న సమయంలో, సర్వీసు రోడ్ల నుంచి అకస్మాత్తుగా

మిగతా 2వ పేజీలో ▶



నేనెలా ఉన్నాను?

- వివరాలు 2లో



నేనెలా ఉన్నాను!

ఆర్టీసీ డిపోల్లో సిబ్బంది ప్రతిబింబం చూసుకునేలా అద్దాలు ఏర్పాటు

ఉద్యోగులు యూనిఫాంలో నీట్‌గా వచ్చేలా వరంగల్ రీజియన్‌లో వినూత్న కార్యక్రమం

హనుమకొండ: ఆర్టీసీ డిపోలు, బస్ స్టేషన్‌లో అద్దాలు ఏర్పాటు చేయడమేమిటని ఆశ్చర్యపోతున్నారా..? సంస్థ ఇమేజ్, ప్రతి ఉద్యోగి తన వృత్తి ధర్మం పాటించేలా సన్నద్ధులను చేసేందుకు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. నేను ఎలా ఉన్నాను..! అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగులను మేల్కొలుపుతోంది. ప్రతీ ఉద్యోగి డ్యూటీకి యూనిఫాం ధరించి వచ్చేలా చూడటమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. డ్యూటీకి వచ్చిన కండక్టర్, డ్రైవర్ తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకోగానే తానెలా ఉన్నాననేది అతనికి కన్పిస్తుంది. పెరిగిన జుట్టుతో, గడ్డంతో వస్తే ఎలా ఉంటుంది..షేవింగ్ చేసుకుని వస్తే ఎలా ఉంటుందో చూసుకోవడం ద్వారా తనకు తాను ఒక నిర్ణయానికి వస్తారని అధికారుల ఆలోచన. అధికారులు పదే పదే యూనిఫాం ధరించాలని ఆదేశాలిచ్చినా, గేట్ మీటింగ్‌లు పెట్టి చెప్పినా వైఖరిలో మార్పు రాకపోవడంతో వారికి వారే అవగాహన పెంచుకుని మార్పు తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ రీజియన్‌లోని అన్ని డిపోలతో పాటు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో అద్దం ఏర్పాటు చేశారు. దీనిని క్రమంగా రీజియన్‌లోని అన్ని బస్‌స్టేషన్‌లకు విస్తరించనున్నారు.

హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటున్న ఉద్యోగి

యూనిఫాం ఒక గుర్తింపు



యూనిఫాం ఉద్యోగికి ప్రత్యేక గుర్తింపునిస్తుంది. వృత్తి ధర్మాన్ని పాటించడంలో యూనిఫాం ధరించడం ఒక భాగం. ప్రయాణికులు గౌరవిస్తారు. ప్రయాణికులతో సత్సంబంధాలు పెరుగుతాయి. ఉద్యోగుల ఐక్యతను చాటుతుంది.

- ఆర్‌బీ. సింగ్,
ఆర్టీసీ ఉద్యోగి, మహబూబాబాద్

యూనిఫాంతోనే డ్యూటీకి వస్తా...



నేను యూనిఫాంతోనే విధులకు వస్తా. యూనిఫాం ధరిస్తే డ్యూటీలో ఉన్నాననే భావన కలుగుతుంది. బాధ్యతను గుర్తు చేస్తుంది. సంస్థ ఉద్యోగులనే గుర్తింపు ప్రయాణికుల్లో ఏర్పడుతుంది.

- ఎంఎస్. బాబు,
ఆర్టీసీ ఉద్యోగి, తొర్రూరు

ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు వస్తుంది..



యూనిఫాం ధరించడం ద్వారా ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు వస్తుంది. విధులకు చక్కగా రావాలని ఆలోచన కల్పించేందుకే నేను ఎలా ఉన్నాను... ట్యాగ్‌లైన్‌తో డిపోలో అద్దం ఏర్పాటు చేశాం. అన్ని బస్ స్టేషన్లలో ఏర్పాటు చేస్తాం.

- డి. విజయభాను,
ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం

క్లుప్తంగా...

బీఆర్ఎస్ అవినీతిపై దృష్టి పెట్టండి

కార్పొరేషన్ల చైర్మన్లతో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన పనులపై దృష్టి పెట్టి అవినీతిని వెలికితీయాలని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సూచించారు. ఇటీవల కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన 40 మంది కాంగ్రెస్ నేతలకు మంగళవారం హైదరాబాద్‌లోని దస్‌పల్లా హోటల్‌లో ఆయన విందు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించాలని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన వారంతా గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేశారని, అదే స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతం చేసేలా పనిచేయాలని, భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు తామెదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. కొందరు అధికారులు బీఆర్ఎస్‌కు అనుకూల వైఖరితో వ్యవహరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాంటి అధికారులను గుర్తిస్తున్నామని, త్వరలోనే వారిపై చర్యలుంటాయని, అదే విధంగా కార్పొరేషన్ చైర్మన్లందరికీ 1+1 గన్‌మన్ల సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా సీఎం రేవంత్‌తో చర్చిస్తానని నరేందర్‌రెడ్డి వెల్లడించినట్టు సమాచారం.

పౌరుషముంటే ఐటీఐఆర్ మంజూరు చేయండి

కేంద్ర మంత్రులనుద్దేశించి టీపీసీసీ నేత జగ్గారెడ్డి వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఊరికే కోతలు కోయడం కాదని, నిజంగా ఆ ఇద్దరికీ పౌరుషం ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి ఐటీఐఆర్ మంజూరు చేయించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన ఐటీఐఆర్‌కు శంకుస్థాపన చేయించాలని కోరారు. డబ్బుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మూసీని ప్రక్షాళన చేస్తోందంటూ బీజేపీ నేతలు ఆరోపించడాన్ని తప్పుపట్టారు. ''చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేదంటారు.. చేస్తే అవినీతి మకిలి అంటిస్తారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గంగానదీ ప్రక్షాళన ఎందుకు చేసిందని, గంగా ప్రక్షాళన కూడా డబ్బుల కోసమే మోదీ చేశారా...అని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పేవాళ్లు, కోతలరాయుళ్లు బీఆర్ఎస్, బీజేపీల్లో ఉంటారని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

ఈ కొట్లాటతో బీఆర్ఎస్ బతకలేదు

'ఎక్స్'లో కాంగ్రెస్ నేత విజయశాంతి



సాక్షి, హైదరాబాద్: పార్టీ నుంచి వెళ్లిపోతున్న ఎమ్మెల్యేలను నిలుపుకునేందుకు కొట్లాడితే బీఆర్ఎస్ పార్టీ బతకజాలదని కాంగ్రెస్ నేత విజయశాంతి అభిప్రాయపడ్డారు. అసలు టీఆర్ఎస్ ఎందుకు ప్రారంభమైందనే చరిత్ర వైపు తిరిగి ఆలోచిస్తే ఎమ్మెల్యేలను బతిమిలాడుకోవాల్సిన అవసరం ఉండదని 'ఎక్స్' వేదికగా మంగళవారం ఆమె పేర్కొన్నారు. ఇక బీజేపీ ప్రతిపక్ష పార్టీగా ఆచరణాత్మక ధోరణితో వెళ్లడం లేదని మీడియా అభిప్రాయపడుతోందన్నారు. తమ సమస్యలపై నిజాయితీతో ప్రయత్నిస్తే ఎప్పుడైనా విశ్వసిస్తామనేది ప్రజాభిప్రాయమని బీజేపీ, బీఆర్ఎస్‌లకు తెలియజేస్తూ పోస్ట్ చేశారు.

ఓపెన్ కేటగిరీ పేరిట రేవంత్ గూడుపుఠాణి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ గ్రూప్- 1 పరీక్షలో ఓపెన్ కేటగిరీ పేరిట గూడుపుఠాణి నడుస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. పార్టీ నేతలు ఆంజనేయగౌడ్, అభిలాష్ రంగినేని, తుంగ బాలు, రామ్మూర్తితో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలను ఓపెన్ కోటా కిందకు రానివ్వకుండా అగ్రవర్ణాలకు మాత్రమే ఉద్యోగాలివ్వాలని సీఎం రేవంత్ భావిస్తున్నారని ఆరోపించారు.

జలకళ ఉన్నా హై'డల్'

▶ మొదటి పేజీ తరువాయి


కొనసాగితే రూ. 300 కోట్ల నుంచి రూ. 420 కోట్ల విలువ చేసే విద్యుత్‌ను నష్టపోనుంది.

330.8 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తికి గండి..

రాష్ట్రంలో మొత్తం 2,441.76 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంగల జలవిద్యుత్ కేంద్రాలుండగా మరమ్మతులకు నోచుకోక ఏడాదికిపైగా 330.8 మెగావాట్ల సామర్థ్యంగల జలవిద్యుత్ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రధానంగా శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎగువ జూరాల, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో కనీసం ఒక్కో యూనిట్ పనిచేయడం లేదు. వర్షాలు, వరదలు మొదలవడంతో ఇప్పుడు టెండర్లు పిలిచినా ఇప్పట్లో మరమ్మతులు నిర్వహించే పరిస్థితి లేదు. వర్షాకాలం ముగిశాకే పనులు చేసేందుకు వీలు కలగనుంది. రాష్ట్రంలోని జలవిద్యుత్ కేంద్రాలు ఏటా కనీసం 3,000 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉండగా వాటికి మరమ్మతులు జరగక లక్ష్యం నెరవేరట్లేదు.

విద్యుత్ సంస్థలపై పర్యవేక్షణ లోపం

రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శినే జెన్‌కో, ట్రాన్స్‌కోకు ఇన్‌చార్జి సీఎండీగా అదనపు బాధ్యతల్లో నియమించడంతో విద్యుత్ సంస్థలపై పూర్తి పర్యవేక్షణ లేకుండాపోయింది. ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ 15 రోజులపాటు సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆయన సచివాలయం నుంచే పనిచేస్తుండటంతో విద్యుత్‌సౌధలో రోజువారీ పాలనా వ్యవహారాల పర్యవేక్షణ గాడి తప్పిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రం

మరమ్మతులకు నోచుకోని జలవిద్యుత్ కేంద్రాల యూనిట్లు ఇవే..

- శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 900 (6150) మెగావాట్లు కాగా అందులో 150 మెగావాట్ల సామర్థ్యంగల 4వ యూనిట్ గతేడాది ఆగస్టు 17 నుంచి పనిచేయట్లేదు. స్టేటర్ వైండింగ్ కాలిపోవడంతోపాటు రోటర్ పోల్‌లో ఫాల్ట్ రాగా ఏడాదిగా మరమ్మతులు చేయలేదు.
- నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 815.6 (1110 + 7100.8) మెగావాట్లు కాగా అందులో 100.8 మెగావాట్ల సామర్థ్యంగల రెండో యూనిట్‌కు సంబంధించిన రోటర్ స్పైడర్ ఆర్మ్‌కు పగుళ్లు వచ్చాయి. దీంతో గతేడాది నవంబర్ 10 నుంచి అది వినియోగంలో లేదు. జపాన్ నుంచి ఇంజనీర్లు వస్తేనే దానికి మరమ్మతులు జరుగుతాయని 9 నెలలుగా కాలయాపన చేస్తున్నారు.
- ఎగువ జూరాల జలవిద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 234 (639) మెగావాట్లు కాగా అందులో 39 మెగావాట్ల సామర్థ్యంగల మూడో యూనిట్‌లో స్టేటర్ వైండింగ్ కాలిపోవడంతో గతేడాది ఆగస్టు 7 నుంచి వినియోగంలో లేదు.
- దిగువ జూరాల విద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 240 (640) మెగావాట్లు కాగా అందులోని అన్ని యూనిట్లలో సీల్ లీకవుతోంది. అన్ని యూనిట్లలో నిరంతర విద్యుదుత్పత్తి కొనసాగించే పరిస్థితి లేదు.
- పులిచింతల జలవిద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 120 (430) మెగావాట్లు కాగా 2022 అక్టోబర్ 1 నుంచి 30 మెగావాట్ల సామర్థ్యంగల మూడో యూనిట్ నిరుపయోగంగా మారింది. దాదాపుగా రెండేళ్లు గడుస్తున్నా చెడిపోయిన రన్నర్ బ్లేడ్‌ను మార్చలేదు.
- నిజాంసాగర్ జలవిద్యుత్ కేంద్రం 10 (25) మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉండగా మరమ్మతులు చేయకపోవడంతో 2022 నవంబర్ 9 నుంచి మొత్తం విద్యుత్ కేంద్రం నిరుపయోగంగా ఉంది.
- పాలేరు మినీ హైడ్రో పవర్ స్టేషన్ సామర్థ్యం 2 (12) మెగావాట్లు కాగా మెగావాట్ల సామర్థ్యంగల ఒకటో యూనిట్ గత మార్చి 6 నుంచి నిరుపయోగంగా ఉంది. రన్నర్ హబ్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది.

తుమ్మిళ్ల లిఫ్టు వద్ద ఉద్రిక్తత

మోటార్లు ఆన్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు

- నీళ్లు రాకపోవడంతో కాంగ్రెస్ నేత సంపత్‌కుమార్ ఆఫ్ చేశారంటూ నిరసన
- ప్రతిగా ఆర్డీఎస్ కెనాల్ వద్ద సంపత్‌కుమార్ ధర్నా
- ఎమ్మెల్యేని అరెస్టు చేసి.. మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు



ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే విజయుడు



ధర్నా చేస్తున్న సంపత్ కుమార్

రాజోళి/ శాంతినగర్: జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసే క్రమంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్‌కి చెందిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఏఐసీసీ నేత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మధ్య వివాదం ఏర్పడి పోటాపోటీగా ఆందోళనకు దిగారు. జిల్లాలోని ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందించేందుకు తుంగభద్ర నదిపై నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా ప్రస్తుతం నీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఉదయం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తుమ్మిళ్లకు వెళ్లి మోటార్లు ఆన్ చేసి, పూజలు చేసేందుకు డీ–23 కెనాల్ వద్దకు వెళ్లారు. అనంతరం ఏఐసీసీ నేత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తుమ్మిళ్ల వద్దకు వచ్చారు. అయితే తాను మోటార్ ఆన్ చేసినప్పటికీ కెనాల్‌లో నీరు విడుదల కాలేదని, దీనికి సంపత్‌కుమారే కారణమని ఎమ్మెల్యే విజయుడు ఆరోపించి, ఆందోళన చేస్తూ బైఠాయించారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఎమ్మెల్యేగా తాను ప్రోటోకాల్ ప్రకారమే నీటిని విడుదల చేసేందుకు వచ్చానని, తాను ఆన్ చేసిన తర్వాత మళ్లీ ఆయన ఏ హోదాలో ఆఫ్ చేస్తారని, వెంటనే సంపత్ కుమార్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేసేదాకా అక్కడి నుంచి వెళ్లనని తేల్చిచెప్పారు. పోలీసులు ఎంతసర్ది చెప్పినా వినలేదు. మరోవైపు తుమ్మిళ్ల నుంచి డీ–23కి కాంగ్రెస్ కార్యకర్తలతో బయలుదేరిన సంపత్ కుమార్‌ను పోలీసులు పచ్చర్లలోనే నిలిపేశారు. దీంతో ఆయన పోలీసులపై మండిపడ్డారు. కాగా.. పరిస్థితి చేయి దాటిపోతుందని భావించిన పోలీసులు ఎమ్మెల్యే విజయుడిని అరెస్టు చేశారు. కాగా.. తనపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిలో వాస్తవం లేదని నిరూపించుకునేందుకు నీటి విడుదల తన ఆధ్వర్యంలోనే చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆర్డీఎస్ కెనాల్ వద్ద సంపత్‌కుమార్ నిరసనకు దిగారు. చివరికి నాటకీయ పరిణామాల మధ్య ఉదయం విడుదల కావాల్సిన నీరు సాయంత్రం 4.15 గంటలకు అధికారులే విడుదల చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఐటీ రంగాన్ని ప్రభుత్వం విస్మరించింది

- అందుకే గతేడాదితో పోలిస్తే ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల్లో క్షీణత
- ఐటీని విస్మరిస్తే ఉద్యోగాల కల్పన, ఆర్థిక రంగంపై పెనుభారం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: గతేడాదితో పోలిస్తే తెలంగాణలో ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో క్షీణత కనిపిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రం ఆర్థికంగా, ఉపాధి కల్పనలోనూ నష్టపోతుందని మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ. 57,706 కోట్ల ఐటీ ఎగుమతులు జరగ్గా 2023–24లో ఐటీ ఎగుమతులు రూ. 26,948 కోట్లకు పడిపోయాయన్నారు. ఉపాధి కల్పన పరంగా చూస్తే 2022–23లో 1,27,594 కొత్త ఉద్యోగాలు రాగా 2023–24లో 40,285 ఉద్యోగాల కల్పన మాత్రమే జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలతో హైదరాబాద్‌లో ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందిందని.. ఐటీ రంగం పుంజుకొనేలా ప్రభుత్వం దృష్టిపెట్టాలని సూచించారు. ఐటీతో పాటు అనుబంధ సేవల రంగాలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ కంపెనీలకు మద్దతు ఇవ్వడంతోపాటు ఐటీ రంగం కోసం ప్రత్యేక విధానాలు తీసుకురావాలన్నారు. ఐటీ రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతోపాటు శాంతిభద్రతలపైనా దృష్టి కేంద్రీకరించాలని కేటీఆర్ సూచించారు.

వైద్య సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం

స్థానికత విషయంలో ప్రభుత్వ తీరు అనుమానాస్పదంగా కనిపిస్తోందని, దీంతో వైద్యవిద్య కోర్సుల సీట్లలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 33 నిబంధనల ప్రకారం 9 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెబుతోందన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల విద్యార్థులు స్థానికులుగా మారి పొరుగు రాష్ట్రాల్లో చదువుతున్న తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారే అవకాశముందన్నారు. 2023–24 ఏడాది వరకు 6 నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లు గరిష్ఠంగా ఎక్కడ చదివితే దానినే స్థానికతగా గుర్తించామన్నారు. తద్వారా ఇంటర్ విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన తెలంగాణ విద్యార్థులను స్థానికులుగా పరిగణించామన్నారు. జీవో 33 నిబంధనల ప్రకారం తెలంగాణ విద్యార్థులు వైద్యవిద్యలో సీట్లు కోల్పోయే అవకాశముందన్నారు. అందువల్ల గతంలో అనుసరించిన విధానాన్నే కొనసాగించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అవమానాలేనా?

కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రోజూ అవమానాలు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. తాజాగా అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు పట్ల అధికారులు వ్యవహరించిన తీరే అందుకు నిదర్శనమన్నారు.

'సర్వీసు' లేకుండానే ఆర్ఆర్ఆర్!

▶ మొదటి పేజీ తరువాయి

వాహనాలు ప్రధాన క్యారేజ్ వే మీదకు వచ్చినప్పుడు ప్రమాదాలు చోటు చేసుకునే వీలుంటుంది.

- ఎక్స్‌ప్రెస్ వేపై సర్వీసు రోడ్డుతో అనుసంధానమైన ప్రతీచోటా టోల్ బూత్ ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఇది వాహనాలు ఎక్స్‌ప్రెస్‌వే స్థాయి వేగంలో ప్రయాణించే వెసులుబాటును అడ్డుకుంటుంది.
- యాక్సెస్ కంట్రోల్డ్ పద్ధతిలో నిర్మిస్తున్నందున అది 25 అడుగుల ఎత్తుతో ఉంటుంది. ఇరువైపులా బారికేడింగ్ ఉంటుంది. దీంతో పశువులు కానీ, జంతువులు కానీ దాని మీదకు రాలేవు.
- ఎక్స్‌ప్రెస్ వేల మీద సాధారణ ప్రయాణ వాహనాల కంటే అంతర్రాష్ట్ర సరుకు రవాణా వాహనాలు ఎక్కువగా దూసుకుపోతాయి. గతంలో గుజరాత్‌లో స్థానికులు సర్వీసు రోడ్ల మీదుగా ఎక్స్‌ప్రెస్ వే మీదకు చేరుకుని వారి డిమాండ్ల సాధన కోసం రోజుల తరబడి నిరసనలు నిర్వహించారు. దీంతో అంతర్రాష్ట్ర సరుకు రవాణా వాహనాలకు అంతరాయం ఏర్పడింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎక్స్‌ప్రెస్ వేలకు సర్వీసు రోడ్డు ఆప్షన్ తొలగించారు.

గ్రీన్‌ఫీల్డ్ రహదారి అయినందున..

ఊళ్లకు దగ్గరగా ఉండే జాతీయ రహదారుల మీదకు స్థానిక వాహనాలు చేరుకునేందుకు వీలుగా సర్వీసు రోడ్లు నిర్మిస్తారు. కానీ ట్రిపుల్ ఆర్ పూర్తి గ్రీన్‌ఫీల్డ్ రహదారి అయినందున దీన్ని ఊళ్లకు దూరంగా నిర్మిస్తున్నారు. కాబట్టి సర్వీసు రోడ్ల అవసరం ఉండదని ఎన్‌హెచ్ఏఐ చెబుతోంది. నెహ్రూ ఔటర్ రింగురోడ్డు కూడా ఎక్స్‌ప్రెస్ వే నే అయినా.. అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టు. కాబట్టి దీనికి జాతీయ ఎక్స్‌ప్రెస్ వే నియమావళి వర్తించదు. ఖమ్మం–దేవరపల్లి మధ్య కొత్త హైవేకి అనుసంధానంగా సర్వీసు రోడ్లు నిర్మించాలని కొన్ని ప్రాంతాల్లో ఆందోళన చేస్తూ పనులను సాగనీయటం లేదు. దీంతో పనులు కొనసాగాలంటే పోలీసు భద్రత కల్పించాలని ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరటం విశేషం.

హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ జలాలు!

▶ మొదటి పేజీ తరువాయి

నీటి అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని అదనంగా 170 ఎంజీడీల జలాల్ని అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నది నుంచి మొత్తం 30 టీఎంసీల నీరు వాడుకునే వెసులుబాటు ఉండటంతో ఈ అదనపు జలాల కోసం గోదావరి ప్రాజెక్టు ఫేజ్–2ను చేపట్టాలని నిర్ణయించింది. 2030వ సంవత్సరం నాటికి హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీలకు పెరుగుతుందనే అంచనా ఉండగా, 2050 నాటికి ఇది 1,014 ఎంజీడీలకు పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది.

డీపీఆర్ సిద్ధం చేసిన వాప్కోస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వాప్కోస్ కంపెనీ సిద్ధం చేసింది. ప్రాజెక్టులో భాగంగా పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3,600 ఎంఎం డయా భారీ పైప్‌లైన్ నిర్మించనున్నారు. ఘన్‌పూర్ వద్ద 780 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపడతారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.3849.10 కోట్లు కేటాయించింది. తాజాగా రూ.5,560 కోట్లు కేటాయించడంతో మొత్తంగా నగరానికి రూ.9410 కోట్లు కేటాయించినట్లయింది.

జీవో114ను కొనసాగించలేం

ఏపీ విద్యార్థుల సౌలభ్యం కోసం ఇచ్చిన జీవోపై మంత్రి రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు గాను రాష్ట్రపతి ఉత్తర్వుల నిబంధనల ప్రకారం గత ప్రభుత్వం జీవో114ను జారీ చేసిందని, ఈ ఉత్తర్వుల ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్ల విద్యార్హతను స్థానికతగా పరిగణించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ నిబంధనను కొనసాగించిందని, ఈ క్రమంలో జీవో33 జారీతో ఇతర రాష్ట్ర విద్యార్థులు స్థానికులవుతారనే వాదన సరైంది కాదన్నారు. జీవో114 ప్రకారం పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివిన విద్యార్థులు కనీసం నాలుగేళ్లు చదివిన ప్రాంతాన్ని అతని స్థానిక ప్రాంతంగా పరిగణిస్తారని, కాబట్టి ఒక విద్యార్థి తెలంగాణలో నాలుగేళ్లు, మిగిలిన మూడేళ్లు ఏపీలో చదివితే అతడిని తెలంగాణ స్థానికుడిగానే పరిగణించారన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గత పదేళ్లుగా ఈ నిబంధన కొనసాగిందని, ఈ ఏడాది జూన్ 2 తర్వాత ఈ నిబంధనను కొనసాగించలేమని మంత్రి రాజనర్సింహ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



హుజూర్‌నగర్‌లోని కాలనీలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు

హుజూర్‌నగర్: ఈ ఏడాదిలో రాష్ట్రంలోని నిరుపేదలకు రూ.22 వేల కోట్ల బడ్జెట్‌తో 4.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఫణిగిరి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న 2,160 ఇళ్ల కాలనీని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలసి మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమది చేతల ప్రభుత్వమని రూ.22వేల కోట్లతో పనులు మొదలు పెడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో ప్రతీ పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు ఇస్తుందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో తాను గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉండగా జీవో ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా అడిగిన ప్రతీ ఒక్కరికీ ఇల్లు ఇచ్చామని, సుమారు 14 లక్షల ఇళ్లు కట్టించామని ఆయన గుర్తు చేశారు. ప్రతీ గ్రామంలో, మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు అని కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఎలా మోసం చేశారో రాష్ట్ర ప్రజలు గమనించారని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి వర్గ సమావేశంలో చేసిన తీర్మానం ప్రకారం అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి త్వరలోనే అర్హులైన వారికి అందజేస్తామన్నారు.

కవితమ్మా.. జాగ్రత్త!

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌ల పరామర్శ.. ధైర్యంగా ఉండాలంటూ భరోసా

సాక్షి, న్యూఢిల్లీ: ''కవితమ్మా.. టేక్ కేర్.. దేవుడి దీవెనలు, ప్రజల మన్ననలు నీతోనే ఉన్నాయి' అంటూ సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, బావ మాజీ మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్సీ కవితకు భరోసా చెప్పారు. లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలను ఎదుర్కొంటూ తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితను మంగళవారం వారిరివురూ కలిశారు. కవితను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తీహార్ జైలులో దాదాపు 20 మందికి డెంగ్యూ వ్యాపించడం, చాలా మందికి జ్వరాలు రావడం, అదే సమయంలో కవిత కూడా అస్వస్థతకు గురికావటం ఆందోళనకు దారి తీసింది. ఈ విషయంపై జైలులో కవిత ఉంటున్న గది పరిస్థితి, లోపల వాతావరణంపై ఆరా తీశారు. బుధవారం రౌజ్ అవెన్యూ కోర్టులో సీబీఐ బెయిలు పిటిషన్‌పై వాదనలు ఉన్న నేపథ్యంలో.. ఈ విషయంపై కూడా కవితతో చర్చించారు. న్యాయమే గెలుస్తుందని, కడిగిన ముత్యం వలే బయటకు వస్తావని కవితకు కేటీఆర్, హరీశ్ భరోసా కల్పించారు.

ప్రతీరోజూ రెండు బీపీ ట్యాబ్లెట్లు

కవిత ఆరోగ్యంపై స్పందించిన రౌజ్ అవెన్యూ కోర్టు ఎయిమ్స్‌లో టెస్టులు చేయించాలని తీహార్ జైలు అధికారులను ఆదేశించింది. దీంతో గత నెల 19న ఐదుగురు వైద్యుల బృందం కవితకు వైద్య పరీక్షలు నిర్వహించింది. రెండు రోజుల తర్వాత ఆ రిపోర్టును రౌజ్ అవెన్యూకోర్టుకు జైలు అధికారులు అందజేశారు. ''కవిత చాలా బలహీనంగా ఉన్నారని, గైనిక్ సమస్యలతో చాలా బాధ పడుతున్నారని, ఆమెకు సంరక్షణ చాలా అవసరమని, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ ఎయిమ్స్ వైద్యులు రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. కాగా, కవితకు బీపీ ఎక్కువ అవ్వడం వల్ల ప్రతీరోజూ ఉదయం, రాత్రి రెండు పూటలా బీపీ ట్యాబ్లెట్లు ఇస్తున్నట్లుగా తెలిసింది.

చిరస్మరణీయుడు జయశంకర్: కేటీఆర్



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, గంగుల, ప్రభాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి, వద్దిరాజు, దాసోజు, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వివేకానంద

సాక్షి, న్యూఢిల్లీ, సాక్షి, హైదరాబాద్: జీవితాంతం తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. రాష్ట్రం కోసం ఢిల్లీలో కేసీఆర్‌తో కలిసి అన్ని పార్టీలను ఒప్పించేందుకు ఆయన ఎంతో కష్టపడ్డారని గుర్తు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని సందర్భంగా ఢిల్లీలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయా కర్, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, కె.పి.వివేకానంద్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ దాసోజు శ్రవణ్‌తో కలిసి మంగళవారం కేటీఆర్ నివాళులర్పించారు.

తెలంగాణపై ఢిల్లీ నుంచి కుట్ర: తెలంగాణ మళ్లీ ప్రమాదం అంచుకు చేరుకుందని, రాష్ట్రంపై ఢిల్లీ నుంచే కుట్ర జరిగే అవకాశముందని, బీఆర్ఎస్ పక్షనేత ఎస్.మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రులు, నిరంజన్‌రెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, పార్టీ ముఖ్య నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. దొడ్డిదారిన రాష్ట్ర వనరులను దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జయశంకర్ జయంతి వేడుకలు జరిగాయి.

కేటీఆర్‌పై కేసు నమోదు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ(లక్ష్మీ) బరాజ్‌పై ఎలాంటి అనుమతి లేకుండా డ్రోన్ ఎగరవేయడంపై కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌లపై మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గత నెల 26న కేటీఆర్‌తో పాటు పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు బరాజ్, పంపుహౌస్‌లను సందర్శించిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బరాజ్‌పై అనుమతి లేకుండా డ్రోన్‌తో చిత్రీకరించిన వీడియో విజువల్స్ సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీనిపై ఏఈఈ వలీ ఫిర్యాదుతో మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్‌తో సహా మాజీ ఎమ్మెల్యేలపై 223 (బీ) కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఏఈఈ గత నెల 29న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన విషయం పోలీసులు బయటికి రాకుండా గోప్యంగా ఉంచారు.

అఫ్సర్‌కు ‘ఇంద్రగంటి’ పురస్కారం

14న రవీంద్రభారతిలో ప్రదానం



సాక్షి, హైదరాబాద్: ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం- 2024 ఏడాదికి గాను ప్రముఖ కవి అఫ్సర్ ఎంపికైనట్లు పురస్కార కమిటీ సభ్యులు ఇంద్రగంటి జానకీబాల, శీలా సుభద్రాదేవి, ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ఈ నెల 14న రవీంద్రభారతిలో సాయంత్రం ఆరు గంటలకు జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారంతోపాటు రూ.25వేల నగదు, జ్ఞాపిక బహూకరిస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు.

రేపు అంబేడ్కర్ వర్సిటీలో మహిళా ఉద్యోగ మేళా

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈనెల 8న డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ తెలంగాణ (డీట్), వీ-హబ్ సంయుక్తంగా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు డీట్ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గురువా రం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ జాబ్ మేళా కొనసాగుతుందని, ఇది కేవలం మహిళల కోసమే నిర్వహిస్తు న్నట్లు డీట్ స్పష్టం చేసింది. వివరాలకు 7337020111 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

‘రేషన్‌కార్డుల’వే ఎక్కువ

ప్రజావాణికి వెల్లువెత్తుతున్న దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పునఃప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్న విజ్ఞప్తుల్లో అధికశాతం రేషన్‌కార్డులకు సంబంధించినవే. ఆ తరువాత ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల కోసం వస్తున్న అర్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో ఇప్పటి వరకు నమోదైన అర్జీల సంఖ్య 5,23,940 కాగా, ఇందులో ప్రజాభవన్‌లో నమోదైన అర్జీలు 60వేలు. అందులో పరిష్కరించిన దరఖాస్తులు 4,31,348 కాగా ఇంకా పరిష్కరించాల్సినవి 92,592 అని ప్రజాభవన్ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు, కోర్టుల పరిధిలో ఉన్న అంశాలు మినహా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత విభాగాలు అక్కడికక్కడే పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, సీఎం ఎ.రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రెండో రోజు నుంచే మొదలైన ప్రజావాణి ఆగస్టు 6వ తేదీ నాటికి 50 వారాలు పూర్తయింది.






నాడు వెలవెల నేడు కళకళ

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి, హరిద్ర, మంజీర నదులు కలిసే త్రివేణి సంగమ ప్రాంతం ఇటీవల వరకు నీరు లేక వెలవెల బోయింది. వర్షాలు కురవడంతో ప్రస్తుతం నీరు చేరి నిండుగా ప్రవహిస్తోంది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్-నిజామాబాద్

సాగర్ నుంచి 3.54 లక్షల క్యూసెక్కులు దిగువకు..

22 గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి విడుదల చేస్తున్న అధికారులు



సాగర్ స్పిల్‌వే మీదుగా 22 గేట్ల నుంచి దుముకుతున్న కృష్ణమ్మ

నాగార్జునసాగర్/దోమలపెంట/సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం నుంచి భారీగా వరద నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రి 20 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదిలిన అధికారులు మంగళవారం ఉదయం మరో రెండు గేట్లు తెరిచి మొత్తం 22 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు సాగర్ నీటిమట్టం 585.40 అడుగుల వద్ద నిల్వ సామర్థ్యం 298.5890కు చేరడంతో ఆరు గేట్లను ఐదు అడుగుల మేర, 16 గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి దిగువకు 2,70,920 క్యూసెక్కుల నీరు వదిలారు. మధ్యాహ్నం 2 గంటలకు వరద మరింత పెరగడంతో 22 గేట్లను పది అడుగుల పైకెత్తి 3,09276 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ఇన్‌ఫ్లో 3,14,594 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 3,54,663కు పెంచారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులుకాగా ప్రస్తుతం 585.10 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలుగా కాగా ప్రస్తుతం జలాశయంలో 297.7235 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 3,11,790 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

కుడి, ఎడమ కాల్వలకు నీటి పెంపు

సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటిని పెంచారు. కుడి కాల్వకు 8,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏఎమ్మార్పీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. చెరువులు నింపేందుకు వరద కాల్వకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా అనుముల మండలం మారేపల్లి వద్ద కాల్వకు గండి పడటంతో మంగళవారం ఉదయం వరద కాల్వకు నీటిని నిలిపేశారు. మరోవైపు ఏఎమ్మార్పీతో పరిధితోపాటు ఆయకట్టు ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు, కుంటలు వాగులు ఎండిన నేపథ్యంలో ఏఎమ్మార్పీ కాల్వలకు నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని రైతులు కోరుతున్నారు.

పులిచింతల నుంచి 1.08 లక్షల క్యూసెక్కులు విడుదల

పులిచింతల ప్రాజెక్టు సగం నిండిపోవడం.. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు పులిచింతలలోకి 3,71,605 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. ప్రాజెక్టులో 157.48 అడుగుల్లో 22.75 టీఎంసీలను నిల్వ చేస్తూ గేట్లు ఎత్తి దిగువకు 1,08,895 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. పులిచింతల నుంచి భారీ ఎత్తున వరదను దిగువకు విడుదల చేస్తుండటంతో.. బుధవారం ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా డెల్టాకు విడుదల చేయగా మిగులుగా ఉన్న జలాలను గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలేయనున్నారు.

ఖైదీల వివరాలు అందించండి


జైళ్ల శాఖకు హైకోర్టు పీపీ కార్యాలయం లేఖ



సాక్షి, హైదరాబాద్: జైళ్లలోని ఖైదీలు, విచారణ ఖైదీల వివరాలు అందజేయాలని జైళ్ల శాఖకు హైకోర్టు పీపీ కార్యాలయం లేఖ రాసింది. వారి ఆరోగ్య పరిస్థితి, బెయిల్ పిటిషన్ల వివరాలు, కేసులకు సంబంధించిన అన్ని వివరాలు వీలైనంత త్వరగా అందజేయాలని కోరింది. తల్లిని హత్య చేసిన కేసులో 2013లో మెదక్ జిల్లా పెద్దగుండెల్లికి చెందిన పోచయ్యకు ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించగా..మూడు రోజుల క్రితం హైకోర్టు నిర్దోషిగా తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ తీర్పునకు ఆరేళ్ల ముందే జైలులో పోచయ్య మృతిచెందడం...ఆ వివరాలు కోర్టుకు తెలియకపోవడం చర్చనీయాంశంగా మారింది. న్యాయస్థానాలపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉండటంతో ఈ అంశంపై హైకోర్టు దృష్టి సారించింది. దీంతో అప్రమత్తమైన పీపీ కార్యాలయం హైకోర్టులో పిటిషన్లు ఉన్న వారి వివరాలన్నీ పంపాలని జైళ్ల శాఖకు లేఖ రాసింది.

రండి.. ‘మత్తు’ వదిలిద్దాం

యాంటీ నార్కోటిక్స్ బ్యూరోతో కలిసి పనిచేద్దాం



సందీప్ శాండిల్య

మీతో సాక్షి

డ్రగ్ మహమ్మారి అంతటా విస్తరిస్తోంది. ఓ పక్క గంజాయి.. మరో పక్క సింథటిక్ డ్రగ్స్.. ఇవి చాలవన్నట్లు దుర్వినియోగం అవుతున్న ఔషధాలు పేద, ధనిక తేడా లేకుండా యువతను బలి కోరుతున్నాయి. ముప్పేట ముంచుకొస్తున్న ముప్పు నుండి రేపటి తరాన్ని కాపాడుకుందాం. ‘నిషా ముక్త్ తెలంగాణ’ సాకారం దిశగా అడుగేద్దాం. వీటి కట్టడికి ఇప్పటికే పోలీస్, ప్రత్యేక విభాగాలు తమవంతు పనిని వేగిరం చేశాయి. ఇప్పటికే మన నగరం, పట్టణం, మన ఊరికి వచ్చిన డ్రగ్స్.. మన ఇంటికి, స్కూలు, కాలేజీకి రాకుండా అప్రమత్తమవుదాం. ఆ దిశగా ‘సాక్షి’ మీకు.. నార్కోటిక్స్ బ్యూరోకు మధ్య వారధిగా నిలుస్తుంది. మీకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా, మాదకద్రవ్యాలపై సమాచారం తెలిసినా, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులు.. వీరిలో ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలుగా మారారనో, ఇతర సందేహాలు ఉన్నా.. వెంటనే 89777 94588 నంబర్‌కు వాట్సాప్ చేయండి. సందేశం, వాయిస్ మెసేజ్, ఫొటోల రూపంలో పంపండి. వీటిని ‘సాక్షి’ టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య దృష్టికి తీసుకువెళ్తుంది. ఆయన స్పందన మీకు చేరేలా చేస్తుంది. రండి.. అందరం కలిసి కమ్ముకుంటోన్న మత్తును వదిలిద్దాం..

నోట్: పేరు, వివరాలను గోప్యంగా ఉంచాలని ఎవరైనా కోరితే... వారి అభిప్రాయాన్ని 'సాక్షి' కచ్చితంగా గౌరవిస్తుంది.

పదోన్నతులివ్వకుంటే ఆందోళనలు తప్పవు

విద్యుత్ సంస్థలకు 1104, 327 యూనియన్ల అల్టిమేటం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకుండా బదిలీలు నిర్వహించాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణ యం తీసుకుంటే తీవ్ర ఆందోళనలు తప్ప వని.. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసి టీ ఎంప్లాయిస్ 327 యూనియన్లు అల్టిమేటం జారీ చేశాయి. తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల యాజమా న్యాలకు మంగళవారం రెండు యూనియన్లు వేర్వేరుగా నోటీసులు అందజేశాయి. విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు పదోన్నతి కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీలను విస్మరించి బదిలీ లు నిర్వహిస్తే విద్యుత్ సంస్థల ప్రధాన కార్యా లయాల ఎదుట పెద్దఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశా యి. అయినా, పదోన్నతులు కల్పించకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తూ నోటీసులు జారీ చేస్తామని, తర్వాత జరిగే పరిణామాలకు యాజమాన్యాలే బాధ్యత వహించాలని పేర్కొన్నాయి. 1104 యూనియన్ తరపున అదనపు ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, 327 యూనియన్ తరపున ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీధర్ ఈ నోటీసులను అందజేశారు.







విశ్వమంతా ఒక సహజీవనమనీ,
పరస్పర ఆధారితమనీ మనం గ్రహించినప్పుడు
ఒక గొప్ప ప్రపంచాన్ని మనం నిర్మించగలం.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 7 ఆగస్టు 2024

విషప్రచారపు కోరల్లో...

చేతిలోని కత్తిని మంచికి వాడవచ్చు, చేయాలనుకుంటే చెడు కూడా చేయవచ్చు. మరి, ప్రపంచాన్ని చేతిలోకి తీసుకొచ్చిన స్మార్ట్‌ఫోన్‌నీ, అందులోని సోషల్ మీడియా వేదికల్నీ ఇప్పుడు మనం దేనికి వాడుతున్నట్టు? దాని దుర్వినియోగం, విషప్రచారం తాలూకు విపరిణామాల ఫలితం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ప్రత్యక్షంగా అనుభవిస్తోంది. అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థ, విభిన్న వర్గాల మధ్య అనుమానాలు సహా ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్ సోషల్ మీడియా సాక్షిగా తీవ్రతర మితవాద బృందాల అసత్య ప్రచారం వల్ల అల్లర్లు, దహనాలతో అట్టుడుకుతోంది. మనసును కదిలించే ముగ్గురు పసిపిల్లల పాశవిక హత్య కారణంగా వారం క్రితం మొదలైన ఈ హింసాత్మక నిరసనల్ని అదుపు చేయడానికి పాలనా యంత్రాంగం కిందా మీదా అవుతోంది. చివరకు యూకేలో 'అంతర్యుద్ధం అనివార్యం' అంటూ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ లాంటి వాళ్ళు దుందుడుకు వ్యాఖ్యలు చేస్తుంటే, బ్రిటన్ కొత్త ప్రధాని కీర్ స్టార్మర్ ఖండించాల్సిన పరిస్థితి. ఇటీవలే పగ్గాలు పట్టిన లేబర్ పార్టీ ప్రభుత్వానికి తాజా పరిణామాలు సవాలుగా మారాయి.

ఇంగ్లండ్ వాయవ్య ప్రాంతంలోని సౌత్‌పోర్ట్‌లో జూలై 29న ఓ డ్యాన్స్ క్లాస్‌లో ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులపై ఓ ఆగంతకుడు కత్తితో దాడి చేసి చంపిన దారుణ సంఘటన చివరకు దేశమంతటా కార్చిచ్చుకు దారి తీయడం నమ్మశక్యం కాని నిజం. దాడి చేసిన వ్యక్తి వలసదారు, మైనారిటీ మతస్థుడు, గత ఏడాదే ఒక చిన్న పడవలో బ్రిటన్‌లో ప్రవేశించాడు అంటూ అంతర్జాలంలో అసత్యాలు ప్రచారమయ్యాయి. అదే అదనుగా వలసదారులకూ, ముస్లిమ్‌లకూ వ్యతిరేకంగా నిరసనలు చేయాలంటూ తీవ్రతర మితవాద బృందాలు సామాజిక మాధ్యమ వేదికలైన 'ఎక్స్' వగైరాల్లో పిలుపునిచ్చాయి. నిజానికి, పిల్లలపై కత్తి దాడికి పాల్పడింది ముస్లిమ్ వలసదారు కాదనీ, రువాండాకు చెందిన తల్లితండ్రులకు జన్మించిన ఓ 17 ఏళ్ళ క్రైస్తవ టీనేజర్ అనీ అధికారులు గుర్తించారు. ఆ పసిపాపల్ని చంపడమే కాక, గతంలోనూ కనీసం పదిసార్లు ఆ కుర్రాడు హత్యాయత్నాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. అరెస్టు కూడా చేశారు.


అయితే, నిజం ఇంటి గడప దాటే లోపల అబద్ధం ఊరంతా షికారు చేసింది. హంతకుడి గురించి పుకార్లు, విద్వేష నిరసనల పిలుపులు విస్తృతంగా విషాన్ని విరజిమ్మాయి. సోషల్‌మీడియాలోని వివాదాస్పద ఇన్‌ఫ్లుయెన్సర్ల తప్పుడు కథనాలతో మసీదులు, శరణార్థులకు నీడనిచ్చిన హోటళ్ళే లక్ష్యంగా దాడులు సాగాయి. చివరకు గడచిన దశాబ్ద కాలం పైచిలుకుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఎన్నడెరుగని స్థాయిలో అల్లర్లు, దహనకాండ, లూటీలకు ఆజ్యం పోశాయి. జూలై 30 నుంచి దేశవ్యాప్తంగా సాగుతున్న ఘర్షణల్లో ఇప్పటికి కనీసం 400 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయినా పరిస్థితులు చక్కబడలేదు. చివరకు లండన్‌లోని భారత హైకమిషన్ సైతం బ్రిటన్‌కు వచ్చే భారత జాతీయులు జాగ్రత్తగా ఉండాలని మంగళవారం సూచనలు జారీ చేయాల్సి వచ్చింది. నైజీరియా, మలేసియా, ఇండొనేషియా సహా పలు దేశాలు అదే పని చేశాయి.

ప్రపంచమంతటా సత్వర సమాచార, వ్యాఖ్యా ప్రసారానికి ఉపయోగపడాల్సిన వాట్సప్ మొదలు 'ఎక్స్' దాకా సోషల్ మీడియా వేదికలన్నీ తుంటరుల చేతిలో అదుపు లేని ఆయుధాలుగా మారడం విషాదం. వాటిలోని విద్వేషపూరిత అసత్యాలు, రెచ్చగొట్టే మాటలకు ఎవరు, ఎక్కడ, ఎలా అడ్డుకట్ట వేయగలరో అర్థం కాని పరిస్థితి. బ్రిటన్‌లో సాంకేతిక శాఖ మంత్రి సైతం గూగుల్, ఎక్స్, టిక్‌టాక్, మెటా సంస్థల ప్రతినిధులతో సమావేశమై, అసత్య సమాచారం వ్యాపించకుండా ఆపడంలో ఆ సంస్థల బాధ్యతను మరోసారి నొక్కిచెప్పాల్సి వచ్చింది. అసలు అలాంటి అంశాలను తొలగించే బాధ్యత, భారం ఆ యా సోషల్ మీడియా సంస్థలదేనని బ్రిటన్ సర్కార్ కొంత కాలంగా ఒత్తిడి పెట్టాలని చూస్తోంది. తాజా ఘర్షణలతో ప్రభుత్వం ఆగి, తన వంతుగా తానూ బాధ్యత తీసుకోక తప్పదు. నిజానికి, 'బ్రెగ్జిట్' తర్వాత నుంచి బ్రిటీషు సమాజం నిలువునా చీలిపోయింది. ఈ చీలికలకు మునుపటి కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వాలు హ్రస్వ దృష్టితో అనుసరించిన విధానాలు తోడయ్యే సరికి పెను ప్రభావం పడింది. అన్నీ కలసి తాజా దాడులుగా విస్ఫోటించాయి.

ఈ హింసను అదుపు చేసి, శాంతిభద్రతల్ని పునరుద్ధరించడం స్టార్మర్ సర్కారుకు సవాలే. కానీ, తీవ్రతర మితవాదులు రేపుతున్న విద్వేషం, విదేశీయుల పట్ల వైముఖ్యానికి కళ్ళెం వేయడం అసలుసిసలు ఛాలెంజ్. మొత్తం వచ్చిన ఓట్ల రీత్యా బ్రిటన్ తాజా ఎన్నికల్లో తీవ్రతర మితవాద రాజకీయ పార్టీ 'రిఫార్మ్ యూకే' మూడోస్థానంలో నిలిచింది. అంటే, దేశంలోని రాజకీయ, ఆర్థిక అనిశ్చితుల మధ్య దానికి ఆ మేరకు మద్దతుందన్న మాట. అదే సమయంలో పాలనలో మార్పు కోరిన జనం బ్రిటన్ పునర్నిర్మాణ వాగ్దానం చూసి స్టార్మర్‌కు ఓటేశారు. పాత పాలన సమస్యలకు తోడు ప్రస్తుత పరిస్థితుల్లో వలసలు, మితవాద జనాకర్షక విధానాల లాంటి సంక్లిష్ట అంశాలపై ఆయన ఆచితూచి అడుగేయక తప్పదు. చరిత్రలో వలసరాజ్య పాలనకు పేరొందిన బ్రిటన్‌లో ఇప్పుడు వలసదారులపై రచ్చ రేగడమే వైచిత్రి. పొట్ట చేతబట్టుకొని శరణు కోరి వచ్చినవారినే అన్నిటికీ కారణమని నిందించడం, అకారణ శత్రుత్వం వహించడం బ్రిటన్‌కు శోభనివ్వదు. అసత్య కథనాల పట్ల జనచైతన్యంతో పాటు జనజీవన స్రవంతిలో వలసజీవులు కలిసిపోయే విధానాలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం ముఖ్యం. వాటివల్లే అపోహలు, ప్రతికూలభావాలు పోతాయి. విధ్వంసకారులపై కఠిన చర్యలు తీసుకుంటూనే సరైన నాయకత్వం, సహానుభూతితో వ్యవహరించాలి. మతవైరాలకు తావివ్వక న్యాయం, సమానత్వానికి నిలబడడమే ఇప్పుడు బ్రిటన్ మరింత పటిష్ఠంగా ముందుకు నడవడానికి మార్గం.

బంగ్లాదేశ్ అంటే భయపడాల్సిందేనా?

విశ్లేషణ



జయంత రాయ్ చౌధురీ

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఒక ప్రదర్శన, పాలనా వ్యవస్థ మార్పు అనే సింగిల్ పాయింట్ పిలుపుగా బంగ్లాదేశ్‌లో రంగులు మారింది. దాంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని వీడాల్సి వచ్చింది. నిరసనల్లో కొందరు పాకిస్తానీయులను జోడించారని ఇప్పటికే అనుమానాలు ఉన్నాయి. భారత ఈశాన్య ప్రాంతాల నుండి ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామాలను సృష్టించడానికి, బంగ్లాదేశ్ అనుకూల వాతావరణాన్ని పాక్ మళ్లీ ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఏమైనప్పటికీ, బంగ్లాదేశ్‌లో పెరుగుతున్న చైనా కోరల గురించి భారత్ జాగ్రత్త పడాలి. ఈ పరిస్థితులలో భారత్ చేయవలసింది... బంగ్లాదేశ్ మిలిటరీకి మద్దతు ఇవ్వడం! ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో చైనా అనుకూలురు నిండిపోకుండా చూసుకోవడం!!

ముజిబుర్ రెహ్మాన్ కుటుంబానికి ఆగస్టు ఎప్పుడూ క్రూరమైన నెలగానే ఉంటోంది. బంగ్లాదేశ్ వ్యవస్థాపక నిర్మాత షేక్ ముజిబుర్ రెహ్మాన్ తన మొత్తం కుటుంబంతో సహా 1975 ఆగస్టు 15 తెల్లవారుజామున సైనిక తిరుగుబాటులో మరణించారు. ఆయన ఇద్దరు కుమార్తెలు షేక్ హసీనా, షేక్ రెహానా భారతదేశానికి వలస రావలసి వచ్చింది.

తన తండ్రి వారసురాలిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన షేక్ హసీనా, 2004 ఆగస్టు 21న తాను ప్రసంగిస్తున్న ర్యాలీపై గ్రెనేడ్ దాడిలో గాయపడి దాదాపు మరణం అంచులను తాకి వచ్చారు. బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో హర్కత్–ఉల్–జిహాద్ అనే ఉగ్రవాద సంస్థ చేసిన ఆ దాడిలో అవామీ లీగ్ కార్యకర్తలు చాలామంది మరణించారు. ఇప్పుడు 20 సంవత్సరాల తరువాత ఆగస్టు మధ్యాహ్నం, హసీనాను ప్రధాని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఆమె నివాసంపై దాడి చేస్తామని బెదిరించిన నిరసనకారులను కాల్చి చంపడానికి ఇష్టపడని బంగ్లాదేశ్ సైన్యం, ఆమెను పదవి వీడి ఢాకా నుండి పారిపోవాలని కోరింది.

బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న కుటుంబాల పిల్లలకు ఉద్యోగాల్లో 30 శాతం మేరకు కోటా కల్పిస్తున్నట్లు హసీనా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కోటాకు వ్యతిరేకంగా నెల రోజుల పాటు సాగిన విద్యార్థి ప్రదర్శనల పట్ల షేక్ హసీనా ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించలేదు. ఆ ఘటన... బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాత్–ఎ–ఇస్లామీ పార్టీల్లోని ఆమె ప్రత్యర్థుల మద్దతుతో పాలన మార్పు కోసం డిమాండ్‌గా మారిందని ఇక్కడ తిరిగి చెప్పాల్సిన పనిలేదు.

బంగ్లాదేశ్ బాగుండాలని కోరుకునే వారికి ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, విద్యార్థుల ప్రతిఘటనా ఉద్యమం పాలనా మార్పు కోసం డిమాండ్‌గా మాత్రమే కాకుండా, భావజాల మార్పు కోసం ప్రతీకార యుద్ధంగా మారింది. హసీనా దేశం విడిచి పారి పోవడంతో, బంగ్లాదేశ్ జాతిపిత ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ఇస్లాం విరుద్ధమని పేర్కొంటూ ఆందోళనాకారులు పగలగొట్టారు. అవామీ లీగ్ నాయకుల కార్యాలయాలను, ఇళ్లను కూడా తగలబెట్టారు. అంతకు ముందు రోజు రాత్రి రంగ్‌పూర్‌లో, ఇతర ప్రాంతాల్లో మైనారిటీల ఇళ్లపై, గ్రామాలపై దాడులు జరిగాయి. ఇది బంగ్లాదేశ్‌కు, మరీ ముఖ్యంగా పొరుగు దేశాలకు ఏ సంకేతాలను ఇస్తోంది?

గత రెండు ఎన్నికలలో రిగ్గింగ్ చేసిన ఆరోపణలతో సహా, ఎన్ని తప్పులు చేసినప్పటికీ, అవామీ లీగ్ దేశంలో లౌకిక పాలనను అందించింది. బంగ్లాదేశ్‌లో నివసించే మైనారిటీల భూములు కబ్జాకు గురై, అప్పుడప్పుడు దాడులు జరిగినప్పటికీ, ఏ సైనిక నియంతృత్వం లేదా దేశాన్ని పాలించిన మునుపటి పాలనా వ్యవస్థల కంటే చాలా ఎక్కువ స్థాయిలో వాళ్ల సమాన అవకాశాలను పొందారన్నది వాస్తవం.

చిట్టగాంగ్ కొండ ప్రాంతాలలో బౌద్ధ గిరిజనులపై దాడులు,



బరిషల్, ఫరీద్‌పూర్‌లలో హిందూ గ్రామాలను తగులబెట్టడం తరచుగా జరుగుతూ వచ్చిన బంగ్లా నేషనలిస్టు పార్టీ పాలించిన రోజుల్లోకి ప్రస్తుతం బంగ్లాదేశ్ దిగజారిపోవడం భారత్‌కు నిజంగానే ఆందోళన కలిగించే విషయం. ఈ పరిణామం ఇప్పటికే జనాభాపరంగా విస్తరించి ఉన్న పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాల్లోకి వేలాదిమంది శరణార్థులను నెట్టివేస్తుంది.

బంగ్లా నేషనలిస్టు పార్టీ పాలనలో, జిహాదీలను అఫ్గానిస్తాన్‌కు ఎగుమతి చేసి బంగ్లాదేశ్ అపఖ్యాతి పాలైంది. 2001లో తాలిబన్లను తరిమికొట్టిన తర్వాత, వారు బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చి, ఢాకాలోనే కాకుండా భారత గడ్డపై దాడులకు పాల్పడి బీభత్సం సృష్టించారు. ఇప్పుడూ అలా జరిగే అవకాశం గురించి భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల 'తిరుగుబాటు'లో కొందరు పాకిస్తానీయులను జోడించారని ఇప్పటికే అనుమానాలు ఉన్నాయి. భారతదేశ ఈశాన్య ప్రాంతాల నుండి ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామాలను సృష్టించడానికి, బంగ్లాదేశ్‌లోని అనుకూల వాతావరణాన్ని పాకిస్తాన్ మళ్లీ ఉపయోగించుకునే అవకాశం ఉంది.

భారతదేశం వంటి పొరుగు దేశాలతో వాణిజ్యం, ప్రయాణ కనెక్టివిటీకి ప్రాధాన్యతనిస్తూనే స్వతంత్ర అలీన విదేశాంగ విధానాన్ని కోరుకునే వారికీ... చైనాతో సన్నిహిత సంబంధాలను నెరపడానికి అవసరమైతే భారతదేశ భద్రతా ప్రయోజనాలతో రాజీ పడటానికైనా సిద్ధపడేవారికీ మధ్య అవామీ లీగ్ పాలన విభజితమై ఉండింది. ఏదేమైనప్పటికీ, షేక్ హసీనా ఎల్లప్పుడూ ఇతరులకు ప్రాధాన్యతనిస్తూనే భారతదేశంతో మెరుగైన సంబంధాలను నిర్మించుకునే వైఖరిని తీసుకుంటూ వచ్చారు. తీస్తా నదిని దిగువకు అభివృద్ధి చేసే విషయంలో, చైనా ప్రతిపాదనను పక్కనబెట్టి బంగ్లాదేశ్‌తో భాగస్వామి కావాలనే భారత ప్రతిపాదనకు సూటిగా అంగీకరించారు. ఆ మేరకు బీజింగ్ ఆమె పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు కొట్టివేసిన కోటాలకు (బంగ్లా స్వాతంత్ర్యోద్యమం కోసం పోరాడిన కుటుంబాల పిల్లలకు ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు) వ్యతిరేకంగా జరిగిన ఒక ప్రదర్శన నుండి, పాలనా వ్యవస్థ మార్పు అనే సింగిల్ పాయింట్ పిలుపుగా విద్యార్థుల నిరసనలు రంగు మారుతున్న క్రమంలో ఇలా జరగటం అనేది మరొక విషయం. కానీ, చరిత్రకారులు, అంతర్జాతీయ సంబంధాల పరిశీలకులు ఏదో ఒక రోజు దీనిపై పరిశోధన చేయాల్సి ఉంటుంది.

ఏమైనప్పటికీ, బంగ్లాదేశ్‌లో పెరుగుతున్న చైనా కోరల గురించి భారతదేశమూ, గతంలో షేక్ హసీనా ప్రభుత్వాన్ని అనేక అంశాలలో వ్యతిరేకించిన పాశ్చాత్య దేశాలూ జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. చైనాకు బంగ్లాదేశ్ దాదాపు 7 బిలియన్ డాలర్ల రుణాలను చెల్లించాల్సి ఉంది. దాని రుణ చెల్లింపులు ఇప్పటికే దాని విదేశీ మారక నిల్వలకు సంబంధించి సంక్షోభం సృష్టించాయి. ఇవి 2021 ఆగస్టు, 2024 జూన్ మధ్య కాలంలో 60 శాతం మేరకు పడిపోయాయి. శ్రీలంకను అనుసరించి బంగ్లాదేశ్ కూడా చైనా రుణ ఉచ్చులో మునిగిపోవచ్చు. రుణమాఫీకి బదులుగా రుణదాతకు వ్యూహాత్మక ఓడరేవులు, ఆర్థిక మండలాలను ఇవ్వవలసి వస్తుంది కూడా. చైనా ఓడలు నెలల పర్యంతం హిందూ మహాసముద్ర ప్రాంతాలను సర్వే చేస్తున్నాయి. బంగాళాఖాతం, అరేబియా సముద్ర ప్రాంత దేశాలలో విస్తరించిన చైనా నావికాదళ ఉనికితో ఇవి సంబంధం కలిగి ఉంటాయి. ఢాకాలో కొత్తగా రానున్న ప్రభుత్వంతో వ్యవహరించేటప్పుడు ఈ అంశాలన్నింటినీ భారతీయ ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ పరిస్థితులలో, భారతదేశం, ప్రజాస్వామ్య ప్రపంచం కాయవలసిన ఉత్తమమైన పందెం ఏమిటంటే బంగ్లాదేశ్ మిలిటరీకి మద్దతు ఇవ్వడం, ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం చైనా అనుకూల మంత్రులు లేదా కరడుగట్టిన ఛాందసవాదులతో నింపబడకుండా చూసుకోవడం. అవామీ లీగ్ పని ముగియలేదు. అది ఇప్పటికీ దేశంలో లోతైన మూలాలను కలిగి ఉంది. పెద్ద సంఖ్యలో మద్దతుదారులను కలిగి ఉంది. సైన్యం ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసిన తాత్కాలిక ప్రభుత్వంలో అవామీ లీగ్ తన స్థానాన్ని కోల్పోకూడదు.

చివరగా, ప్రపంచం శరవేగంతో మారుతుంది. కమ్యూనిజం రాత్రికి రాత్రే మరణించినట్లే, షేక్ హసీనా ప్రభుత్వం కూడా కుప్పకూలిపోయింది. ఏదేమైనప్పటికీ, భావజాలాలు పాలనా వ్యవస్థల కంటే ఎక్కువ కాలం కొనసాగుతాయి. ఇవి సరైన 'వాతావరణ పరిస్థితుల'లో పునరాగమనం చేయగలవు. బంగ్లాదేశ్‌లో పెట్టుబడులు పెట్టిన భారతదేశం, ఇతర దేశాలన్నీ ఆ పాఠాన్ని గుర్తుంచుకోవడం మంచిది.

వ్యాసకర్త పీటీఐ తూర్పు రీజియన్ మాజీ హెడ్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రానున్న కాలం



బంగ్లాదేశ్ ప్రజలు ఏమి వదిలించుకున్నారన్నది ఇకపై ప్రశ్న కాదు. దీని వల్ల ఏమి జరుగుతుందనేదే ప్రశ్న. సైనిక పాలనా? పాక్షిక సైనిక పాలనా? ఎన్నికవని ప్రభుత్వమా? ఎన్నికల్లో అక్రమాలతో గెలిచిన ప్రభుత్వమా? లేక నిజమైన ప్రజాస్వామ్యమా? అసలు సవాలు ఇప్పుడు మొదలవుతుంది.

– సుశాంత్ సింగ్, యేల్ యూనివర్సిటీ లెక్చరర్

కనిపించని మనిషి



వయనాడ్ నుంచి తిరిగి వస్తూ, కోళిక్కోడ్‌లోని డ్రైవర్ అర్జున్ ఇంటికి వెళ్లాను. రెండు వారాల క్రితం కర్ణాటకలో కొండ చరియలు విరిగిపడి ఆచూకీ తెలియకుండా పోయిన అర్జున్‌ను వెతికే ప్రయత్నాలను ఆపబోమని ఆయన కుటుంబ సభ్యులకు ఎంత భరోసా ఇచ్చినా వారి దుఃఖాన్ని ఆపలేకపోయాను.

– శశి థరూర్, లోక్‌సభ ఎంపీ

ఎందుకీ మౌనం?



ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్లలో 183 మందికి పైగా మరణించారు. నేను స్వయంగా 6 హత్యలను పరిశోధించాను. అన్ని శాస్త్రీయ ఆధారాలూ అవి ముందస్తుగా వేసిన పథకం ప్రకారం జరిగిన హత్యలేనని తేల్చాయి. అయినప్పటికీ కోర్టులు, జాతీయ మానవ హక్కుల సంఘం సంకోచంలోనే ఉండిపోయాయి!

– సౌరవ్ దాస్, ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్

రాసి పెట్టుకోండి



వీలైతే నేను నా చేతిపై 'మనుమల్ని, విషయాలను, పరిస్థితులను తేలిగ్గా తీసుకోవద్దు' అని పచ్చబొట్టు వేయించుకుంటా! ఎందుకంటే ఈ మాట గుర్తుంచుకోవటం చాలా కష్టంగా ఉంటుంది. ఇవాళ పైన ఉంటాం. రేపు కింద. ఆ తర్వాతి రోజు బహుశా మళ్లీ పైన. జీవితం అంటే ఇదే కదా!

– నిఖిల్ కామత్, ఆంత్రప్రెన్యూర్

చివరికి జరిగేది



మూకలు దానిని విప్లవం అంటాయి. పాలకులు దానిని కుట్ర అంటారు. చరిత్ర పుస్తకాలు వాస్తవాలను బట్టి కాకుండా కథనాల ఆధారంగా ఘటనలను లిఖిస్తాయి.

– రాజీవ్ తల్రేజా, రాజకీయ వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

పాడుబడ్డ 'బంగ్లా'తో జాగ్రత్త!

భారత్ పొరుగుదేశం, మిత్రదేశం అయిన బంగ్లాదేశ్‌లో తీవ్ర అస్థిరత్వం నెలకొంది. కొన్ని నెలలుగా పౌరుల ఆందోళనలు కొనసాగి, ప్రభుత్వపు నిర్వాకంతో తీవ్రరూపం దాల్చి, చివరకు ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పారిపోయేంతగా గాడి తప్పాయి. ప్రస్తుతం అధ్యక్షుడి కోరిక మేరకు సైన్యం తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు దిశగా వివిధ పక్షాలతో, విద్యార్థి నాయకులతో సంప్రతింపులు జరుపుతోంది. పొరుగుదేశం రాజకీయ, పాలనా అస్థిరత్వంలో ఉండడం భారత్‌కు చేటు. పాకిస్తాన్, చైనాలు, స్థానిక భారత్ వ్యతిరేక సమూహాల్ని మచ్చిక చేసుకుని ఆ దేశంలో పరపతి పెంచుకొనే అవకాశాల్ని మెరుగు పర్చుకుంటాయి. ఆ స్థితి కలుగకుండా మంచి స్నేహ సంబంధాల్ని కొనసాగించడానికి మన దేశం చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంది.

ఎందుకంటే ఇప్పుడు గద్దె దిగిన షేక్ హసీనా ప్రభుత్వం మన దేశంతో మిత్రత్వం నెరిపింది. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడ్డాయి. వాణిజ్యం, దౌత్యం బలపడ్డాయి. అయితే ఆమె అక్కడ నియంతలా వ్యవహరించి చెడ్డ పేరు తెచ్చుకున్నారు. ప్రజాబలాన్ని దూరం చేసుకుని, రాజకీయ వ్యతిరేకుల్ని అణిచివేసి, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి, చివరకు తానే దేశం విడిచి పారిపోయే స్థితి తెచ్చుకున్నారు. కాబట్టి ఆమె (అవామీ లీగ్ పార్టీ) వ్యతిరేకులకు మన దేశం కూడా వ్యతిరేకంగానే కనబడుతుంది. వచ్చేది ఏ ప్రభుత్వమైనా, సైనిక పాలన అయినా మన దేశంతో వారి సంబంధాలు సానుకూలంగా ఉండేటట్లు చూసుకోవాలి. సరిహద్దుల నుండి అధిక సంఖ్యలో శరణార్థులు చొరబడే అవకాశం ఉంది. భారత్‌కు వ్యతిరేకంగా ఆ దేశాన్ని వాడుకోవడానికి పొంచి ఉన్న అంతర్జాతీయ శక్తులను కూడా ఓ కంట కనిపెట్టుకుని ఉండాలి. ఎలాంటి సందేహం లేకుండా భారత్‌ను నమ్మదగిన మిత్రునిగా బంగ్లాదేశ్ ప్రజలు, రాజకీయ పక్షాలు మున్ముందు కూడా భావించాలంటే అది సరైన దౌత్యనీతి తోనే సాధ్యం.

– డా. డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

వ్యవస్థల పాపమే చేనేతల దురవస్థ

సందర్భం



డా॥ మీసాల అప్పలయ్య

చేనేత పరిశ్రమ వ్యవస్థాగత ఉచ్చులో ఇరుక్కుపోయింది. ఈ పరిశ్రమ క్షీణతకు ప్రధాన కారణాలలో ఒకటి సరైన నియంత్రణ లేని వ్యవస్థల పనితీరు. 1996లో జరిగిన జాతీయ చేనేత జనాభా లెక్కల ప్రకారం 65.5 లక్షలు ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2010 నాటికి 43.32 లక్షలకు, 2019–20 నాటికి 35.22 లక్షలకు తగ్గిపోయింది. చేనేత పరిశ్రమలో ఒక కుటుంబానికి లభించిన సగటు పనిదినాలు 2010లో 234 ఉంటే, అవి 2019లో 207కు పడిపోయాయి. 2022లో తెలుగు రాష్ట్రాలలోని 496 మంది చేనేత కార్మికులను సర్వే చేస్తే, అందులో 74.4 శాతం మంది భవిష్యత్ కోసం ఏమీ మిగిలించుకోలేదని చెప్పారు. 77 శాతం మంది ఈ వృత్తిని వదిలిపెడతామని చెప్పారు. 76.2 శాతం మంది ఈ వృత్తిలోకి తమ పిల్లలను ఆహ్వానించడం లేదని చెప్పారు. కాబట్టి యువకులు ఈ వృత్తిలోకి రారు. యువకులు లేని చేనేత పరిశ్రమలో అధునాతన మగ్గాల వాడుక, కొత్త డిజైన్ల ఉత్పత్తి చాలా కష్టం. పైన చెప్పిన అనేక కారణాల వల్ల మాస్టర్ వీవర్లకు, సహకార సంఘాలకు తమ ఉత్పత్తి కార్యకలాపాలను నడిపించడానికి తగినంత మంది చేనేత కార్మికులు దొరకడం లేదు.

వ్యవస్థ అంటే అనేక సంస్థలు, వ్యక్తులు కలిసి చేసే కృషి యొక్క రూపం. ఒకరు లేదా కొద్దిమంది వ్యక్తులు చేసే పని వ్యవస్థ కాదు. చేనేత పరిశ్రమ ఒకప్పుడు వైభవంగా నడవడానికీ, నేడు దీనంగా క్షీణించడానికీ కొన్ని వ్యవస్థలు ఎలా కారణమయ్యాయో మనం అర్థం చేసుకోవాలి.

1. మొదటిది ముడిసరుకుల సరఫరా వ్యవస్థ. చేనేత కార్మికుడు వాడే ముడిసరుకుల ధరలు పెరుగుతూనే ఉంటాయి. కారణం నూలు, రంగులు, రసాయనాల తయారీ పెద్ద కార్పొరేషన్ల చేతిలో ఉంది. అవి తమ లాభ లక్ష్యాలను బట్టి, ఉత్పత్తిని, వాటి ధరలను నిర్ణయిస్తాయి. వీటిని చేనేత పరిశ్రమ శాసించలేదు. నిరంతరమూ పెరుగుతున్న ధరల వలన చేనేతల ఉత్పత్తి ధర పెరిగి అమ్ముకోవడం కష్టమవుతోంది. తక్షణం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటే, చేనేత కార్మికుని కూలీ కోతకు గురవుతుంది.

2. రెండోది ప్రభుత్వ సహాయ వ్యవస్థ. ఆర్థికంగా బలహీనులైన కార్మికులు ఆధారపడ్డ ఈ పరిశ్రమకు ప్రభుత్వం ఎక్కువ సహాయం చెయ్యాలి. కానీ, ప్రభుత్వం చేనేత ఉత్పత్తుల మీద 5 శాతం, వాటి ముడి సరుకుల మీద 18 శాతం వరకు జీఎస్టీ విధిస్తున్నది. దీనితో ఆ ఉత్పత్తుల అమ్మకపు శక్తి తగ్గింది. పైగా, రకరకాల పథకాల కింద చేసే ఆర్థిక సహాయాన్ని ప్రతి ఏటా బడ్జెట్‌లో తగ్గించుకుంటూ వస్తున్నది. ఒకప్పుడు రూ. 2,000 కోట్ల సహాయం ఇప్పుడు రూ. 200 కోట్లకు తగ్గింది. ప్రభుత్వం ఒకప్పుడు దీన్ని కార్మికులకు పని కల్పించే సాధనంగా చూసేది. నేడు ఒక కళగా, సంస్కృతిగా మాత్రమే చూస్తున్నట్టు సహాయ పరిమాణాన్ని బట్టి అర్థమవుతున్నది. పైగా చేనేతలకు గట్టి పోటీనిచ్చే పవర్ లూములను సరిగ్గా నియంత్రించలేక పోతున్నది. పవర్ లూములను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం, అవి చేనేత ఉత్పత్తులను కాపీ కొట్టి, చేనేతల గిరాకీకి గండి కొడుతున్న వైనాన్ని అడ్డుకోలేకపోతున్నది. కొన్ని వస్త్రాలు చేనేత మగ్గాలు మాత్రమే చెయ్యాలని చెప్పిన 1985 నాటి చట్టం అమలు తీరు శక్తిహీనంగా ఉంది.



నేడు జాతీయ చేనేత దినోత్సవం

3. మూడోది ఉత్పత్తి అమ్మకాల వ్యవస్థ. ఇది పేలవంగా నడుస్తూ, చేనేత కార్మికులకు ప్రతికూలంగా పని చేస్తున్నది. రాష్ట్ర స్థాయీ తల్లి సంఘాలలో అమ్మకపు శక్తి బొత్తిగా తక్కువ. గ్రామ స్థాయీ సహకార సంఘాలు చాలా వరకు బోగస్. కృష్ణా, తూర్పు గోదావరి వంటి జిల్లాలలో తప్ప, సహకార సంఘాలన్నీ నిర్వీర్యమైనాయి. మాస్టర్ వీవర్ కింద గానీ, స్వతంత్రంగా నేసుకొనే కార్మికులకు గానీ, వారు పరిశ్రమలో సింహ భాగస్థులైనప్పటికీ, ప్రభుత్వ మార్కెటింగ్ సహాయక పథకాలు అందవు.

4. నాలుగవది నూతన వస్త్ర ఉత్పత్తి వ్యవస్థ. చేనేత పరిశ్రమను దీర్ఘకాలం నడిపించే శక్తినిచ్చే నూతన వస్త్ర ఉత్పత్తి చెయ్యడానికి చేనేత కార్మికునికి అనేకమైన ఇబ్బందులున్నాయి. కొత్త నమూనాల ఉత్పత్తిలో రిస్క్, శ్రమ, ఖర్చు అధికం. ఈ విషయంలో ప్రభుత్వం ఇస్తున్న సహాయం చాలా తక్కువ. కొత్త నమూనాలు నెయ్యడానికి వీలుగా ప్రభుత్వం పుష్కలంగా నమూనాలను అందిస్తూ, వాటిని తయారు చెయ్యడంలోనూ శిక్షణను ఇవ్వడానికి ప్రభుత్వం సహాయం చెయ్యాలి. అవసరాన్ని బట్టి మగ్గాలను అధునాతన పరచుకోడానికి సహాయం చెయ్యాలి. పోచంపల్లి, ఉప్పాడ, గద్వాల్, ధర్మవరం వంటి ప్రాంతాలలో చేనేత పరిశ్రమ వృద్ధి చెందడానికీ, ఎక్కువ మందికి పని కల్పించగలగడానికీ ప్రధాన కారణం అక్కడ ఎక్కువ విలువగల వస్త్రాలు తయారు కావడమే. చేనేత పరిశ్రమ ఎక్కువ కాలం మనగలగాలి అంటే ఎక్కువ విలువైన వస్త్రాలను తయారుచేసే స్థితికి ఎదగాలి. ఇందుకు నూతన నమూనాల తయారీ చాలా ముఖ్యం. దీని విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దేశ సంస్కృతికి దన్నుగా ఉంటూ, అనేక లక్షల మందికి ఉపాధిని ఇచ్చే ఈ పరిశ్రమను ఉద్ధరించగలిగే శక్తి ప్రభుత్వాలకే ఉంది.

వ్యాసకర్త డా॥ బీ.ఆర్. అంబేడ్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్
మొబైల్: 79939 09371

పవిత్రత ముఖ్యం

విద్యయొసగును వినయంబు అంటారు కానీ సాధారణంగా పాండిత్యం అహంకారాన్నే పెంచుతుంది. ఒకసారి అలాంటి పండితుడు శాస్త్రాలను ఉదాహరిస్తూ రామకృష్ణ పరమహంసతో వాదానికి దిగాడు. అప్పుడు రామకృష్ణులు 'నేను స్నానపు గదికి వెళ్ళివస్తాను' అంటూ బయటికి వెళ్ళారు. అప్పుడా పండితులు తమతో వాదించలేక ఆయన పారిపోయాడనుకొన్నారు. కొంతసేపటి తర్వాత రామకృష్ణులు భావ పారవశ్య స్థితిలో తిరిగి వచ్చి ఆ పండితులను ముట్టుకొని 'మీరు ఏమంటున్నారు?' అని అడిగారు. అంతే! ఆ పండితుడికి ఆ దివ్య స్పర్శ పాండిత్యాతీత ఆనందాన్ని రుచి చూపించింది. వారి పాండిత్యం, వాదనా పటిమ అణగిపోయాయి. చేతులు జోడించి ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం ఆయన్ని ప్రార్థించారు.



ఇంకోసారి మరో సుప్రసిద్ధ పండితుడు రామకృష్ణుని దర్శించటానికి దక్షిణేశ్వరానికి వచ్చాడు. అప్పుడు రామకృష్ణులు తమ పరుపు మీద కూర్చొని ఉన్నారు. ఆ పండితుడు వ్యంగ్యంగా రామకృష్ణులతో 'మీరొక పరమహంసా? మంచిది! అద్భుతం! ఆనుకోవడానికి చక్కని స్థూపాకారపు తలగడ, దోమతెర మీకు ఉన్నాయి' అన్నాడు. వెంటనే రామకృష్ణులు తన చక్కని పాదరక్షలను, ఇతర ఆకర్షణీయ వస్తువులను కూడా చూపించారు. ఆ పండితుడు అందరినీ ఉద్దేశించి, 'ఈయన నిజమైన పరమహంస కారు' అంటూ శాస్త్రాలలోని విషయాలను ఉట్టంకించాడు. అసలైన పరమహంసకు ఉండవలసిన లక్షణాలేవో విప్పి చెప్పాడు. ఆయన అలా మాట్లాడుతుంటే రామకృష్ణులు చిరునవ్వు చిందిస్తూ కూర్చొన్నారు. సాయంత్రమైంది. ఆ పండితుడు సంధ్యావందనం చేసుకోవటానికి గంగానదీ తీరానికి వెళ్ళాడు. కళ్ళు మూసుకొని తన ఇష్టదైవాన్ని ధ్యానించాడు. హఠాత్తుగా కళ్ళు తెరచి రామకృష్ణుల గదికి పరుగెత్తి వచ్చాడు. రామకృష్ణులప్పుడు సమాధి స్థితిలో ఉండటం చూసి ఆ పండితుడు చేతులు జోడించి ఆయన్ని సాక్షాత్తూ భగవంతునిగా సంబోధిస్తూ స్తుతించనారంభించాడు. (శ్రీరామకృష్ణ లీలామృతం: పుటలు 154–155)

దివ్యత్వం ముందు పాండిత్యం ప్రకాశిస్తుందా? పండితునిలో గ్రంథ పాండిత్యం ఉంది, అహంకారముంది, వాదనా పటిమ ఉంది. రామకృష్ణులలో అణకువ ఉంది, పవిత్రత ఉంది, దివ్యత్వముంది.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.తదియ రా.7.50 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పుబ్బ రా.7.35 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.3.32 నుండి 5.18 వరకు (తెల్లవారితే గురువారం).
దుర్ముహూర్తం: ఉ.11.40 నుండి 12.31 వరకు, **అమృత ఘడియలు:** ప.12.35 నుండి 2.21 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.28.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

స్కాన్ చేయండి.. ఓపీ చీటీ పొందండి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల సుదీర్ఘ నిరీక్షణకు చెక్
- 'ఆయుష్మాన్ భారత్'లో భాగంగా రాష్ట్రంలో అమలు
- 'అభా' యాప్‌లో వ్యక్తిగత వివరాల నమోదుతో 14 అంకెల డిజిటల్ హెల్త్ ఐడీ
- దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క క్లిక్‌తో రోగి వైద్య రికార్డులు ప్రత్యక్షం
- మరింత మెరుగైన వైద్యసేవలు పొందే అవకాశం



గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

గాంధీ ఆస్పత్రి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ చీటీల కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన అగత్యం తప్పింది. కేవలం ఒక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రోగులు క్షణాల్లో ఓపీ చీటీ అందుకొనే వెసులుబాటు లభించింది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 102 ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు హైదరాబాద్ లోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఈ విధానం అమలవుతోంది.

పౌరులకు డిజిటల్ హెల్త్ ఐడీ...

దేశ ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించి మెరుగైన వైద్య సేవలను త్వరితగతిన అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రజలకు డిజిటల్ హెల్త్ ఐడీని అందించాలని కేంద్రం 2021లో నిర్ణయించింది. ప్రతిఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్‌ఏ-అభా) ద్వారా ఆధార్ నంబర్‌ను అనుసంధానిస్తూ 14 అంకెల యూనిక్ నంబర్ కేటాయిస్తుంది.

అభా నంబర్‌తో సులువుగా ఓపీ చీటీ

గూగుల్ ప్లేస్టోర్ నుంచి అభా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే వన్‌టైమ్



పాస్‌వర్డ్ వస్తుంది. పేరు, చిరునామా, ఆధార్, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ తదితర వివరాలను అందులో పొందుపరచాలి. ఆ తర్వాత సొంత ఐడీ, పాస్‌వర్డ్‌ని తయారు చేసుకొని అభా యాప్ ద్వారా లాగిన్ కావాలి. https://abdm.gov.in/ ద్వారా కూడా అభా నంబర్ పొందొచ్చు. ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే టోకెన్ నంబర్ వస్తుంది. ఆపై కౌంటర్ వద్దకు వెళ్లి టోకెన్ నంబర్ చూపిస్తే అనారోగ్య కారణాలు తెలుసుకొని సంబంధిత విభాగానికి రిఫర్ చేస్తూ ఓపీ చిటీ అందిస్తారు. క్యూఆర్ కోడ్ ఎలా స్కాన్ చేయాలో రోగులకు వివరించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా సహాయకులను అందుబాటులో ఉంచారు.

14 అంకెల నంబర్‌తో లాభాలెన్నో...

అభా నంబర్‌తో వైద్య చీటీలన్నీ డిజిటైజేషన్ అవుతాయి. దీంతో దేశంలోని ఏ ప్రాంతంలో ఉన్నా ఒక్క క్లిక్‌తో వైద్యులు వాటి వివరాలు పొందవచ్చు. దీనివల్ల రోగికి ఇప్పటివరకు అందించిన వైద్య చికిత్సల వివరాలను మరో వైద్యుడు చూసి మెరుగైన వైద్యం అందించే వెసులుబాటు కలుగుతుంది. డిజిటల్ రికార్డుల ద్వారా కచ్చితమైన బిల్లింగ్, బిల్లుల రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య పాలసీ క్లెయిమ్‌లు సులభతరం అవుతాయి.

హైదరాబాద్‌లో ఈ ప్రభుత్వ ఆస్పత్రుల్లో...

భాగ్యనగరంలోని 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో అభా క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, సరోజినీదేవి, ఫీవర్, ఎర్రగడ్డ చెస్ట్, మెంటల్ ఆస్పత్రులు, పేట్లబురుజు, సుల్తాన్ బజార్ మెటర్నిటీ హాస్పిటల్స్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కింగ్‌కోఠి, ఎంసీహెచ్ కింగ్‌కోఠి, ఈఎన్‌టీ, నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట ఏరియా ఆస్పత్రులు, ఎంసీహెచ్ షాలిబండ, బార్కాస్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, సీహెచ్‌సీ ఖైరతాబాద్‌లలో ఈ సేవలు వినియోగించుకోవచ్చు.

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం

ప్రతి ఆస్పత్రికీ ఒక్కో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశాం. ప్రజలంతా ఈ సేవలు పొందడంలో భాగస్వాములు కావాలి. క్షేత్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించాం. దీనిపై ప్రజల్లో మరింత చైతన్యం కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- మంజునాథ్ నాయక్, ఏబీడీఎం, స్టేట్ నోడల్ ఆఫీసర్

హక్కుల కోసం పోరాటాలు ఉధృతం

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను కేంద్రంలో అధికారంలోకి వస్తున్న పార్టీలన్నీ తీవ్రంగా మోసం చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని తదితర డిమాండ్లతో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేంద్ర పెద్దలకు ఎన్నో అభ్యర్థనలు చేసి విసిగిపోయామని, ఇకపై ఉధృతమైన పోరాటాలను చూస్తారంటూ హెచ్చరించారు. ఏపీలో గత ఐదేళ్లలో అప్పటి సీఎం వైఎస్ జగన్ అన్ని విషయాల్లోనూ బీసీలకు పెద్దపీట వేశారని కితాబిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బీద మస్తాన్‌రావు, గొల్ల బాబురావు తదితరులు ధర్నాకు మద్దతు పలికారు.

నేడు నల్లగొండకు రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం

సాక్షి, హైదరాబాద్: ధరణి సమస్యల అధ్యయనంలో భాగంగా పైలట్ మండలంగా ఎంపిక చేసిన నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరికి బుధవారం రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం వెళ్లనుంది. ఇందులో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, భూ చట్టాల నిపుణుడు సునీల్‌కుమార్, సీఎంఆర్‌ఓపీడీ వి.లచ్చిరెడ్డి ఉన్నారు. అక్కడ గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి ధరణి సమస్యలను పరిశీలించనున్నారు. అనంతరం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొననున్నారు.

పాస్‌బుక్ ఆధారంగా | ప్రతి రైతుకు రుణమాఫీ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల స్పష్టీకరణ
- 30 వేల మందికి రుణమాఫీ కానట్లుగా లెక్కలు చెబుతున్నాయి
- సాంకేతిక సమస్యలు, డేటా తప్పుడు నమోదే కారణం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీపై రాజకీయం చేయాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలు చూస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాకముందే దానిపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్‌బుక్ ఆధారంగా ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని, రైతుకు రుణ విముక్తి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 30 వేల మంది రైతులకు రుణమాఫీ కానట్లుగా లెక్కలు చెబుతున్నాయని మంత్రి చెప్పారు. ఎక్కడో ఒక దగ్గర సాంకేతిక సమస్య, పేర్లు, ఆధార్, ఇతర డేటా తప్పుడు నమోదుతో రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతుల పేర్ల నమోదుకు అధికారులను నియమిస్తామని, ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని అన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వారు గతంలో ఏం చేశారో ఒక్కసారి ఆలోచన చేయాలని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

15న వైరా సభలో రూ.2 లక్షల రుణమాఫీ!

ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని చెప్పి చేతులెత్తేసిన వాళ్లు ఈ రోజు రుణమాఫీపై మాట్లాడడం ఏమిటని తుమ్మల ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తాము రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఖమ్మం జిల్లాలోని వైరాలో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేసేలా వ్యవసాయ శాఖ ఆలోచిస్తోందని తెలిపారు. రైతు భరోసా, పంటల బీమా పథకాలు కూడా అమలు చేస్తామన్నారు.

సకాలంలో ప్రాజెక్టులు ఫుల్

ఈ ఏడాది సకాలంలో అన్ని ప్రాజెక్టులు పూర్తిగా నిండాయంటూ మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. రైతాంగానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందిస్తామని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువులు కేంద్రం సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాలికపై కౌన్సిలర్ అఘాయిత్యం

పోక్సో చట్టం కింద కేసు నమోదు... రిమాండ్‌కు తరలింపు

బోధన్ /ఎడపల్లి(బోధన్): నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ 3వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి రాధాకృష్ణ అదే వార్డుకు చెందిన ఓ మైనర్ బాలిక (16)పై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ ఎడపల్లిలో స్థానిక యువకులు దాడి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలిలా.. బాలిక తన తల్లికి అనారోగ్యంగా ఉండడంతో మందులు తీసుకురావడానికి సోమవారం సాయంత్రం బోధన్ నుంచి ఆటోలో నిజామాబాద్‌కు వెళుతుండగా గమనించిన కౌన్సిలర్ కారులో వెంబడించాడు. ఎడపల్లి మండలం మంగల్ పాడ్ రోడ్డు వద్ద ఆటోను ఆపి కారులో వెళ్దామని చెప్పడంతో తెలిసిన వ్యక్తి కావడంతో ఆ బాలిక కౌన్సిలర్ వెంట వెళ్లింది. కారును నిజామాబాద్‌కు కాకుండా ఎడపల్లి నుంచి కుర్నపల్లి వెళ్లే దారిలోకి మళ్లించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్కడి నుంచి బాలికను తీసుకొచ్చిన నిందితుడు ఓ వైన్స్ వద్ద కారు ఆపి మద్యం సేవిస్తుండగా.. కారులో ఉన్న బాలిక కేకలు వేసింది. గమనించిన స్థానికులు అనుమానంతో కౌన్సిలర్‌ను ఏమైందని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పక పోవడంతో యువకులు బాలికను అడగడంతో విషయం చెప్పింది. యువకులు ఆగ్రహంతో నిందితుడిని చితకబాదారు. అనంతరం ఎడపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని బోధన్‌లోని సీఐ కార్యాలయానికి తరలించారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నిందితుడిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

అర్ధరాత్రి ఉద్రిక్తత..: బాలికపై అఘాయిత్యం ఘటన తెలియడంతో స్థానిక మైనారిటీ నాయకులు, యువకులు అర్ధరాత్రి పెద్ద ఎత్తున బోధన్‌లోని సీఐ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో సుమారు గంట అనంతరం యువకులు ఆందోళన విరమించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నిందితుడి తమ్ముడు సైతం అదే వార్డుకు చెందిన మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడి పోక్సో చట్టం కింద రిమాండ్‌కు వెళ్లాడు. ఆ ఘటనలో తమ్ముడిని రక్షించే ఉద్దేశంతో బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలియడంతో రాధాకృష్ణ పై పోలీసులు పోక్సో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. టీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న రాధాకృష్ణను అప్పటి ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

షాద్‌నగర్ బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- డిప్యూటీ సీఎం భట్టి హామీ
- ఘటనకు బాధ్యులైన సీఐ, ఆరుగురు సిబ్బంది సస్పెన్షన్



సాక్షి, హైదరాబాద్: ప్రజా ప్రభుత్వంలో దళితులపై దాడులను సహించేది లేదని..షాద్‌నగర్ ఘటనలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. షాద్‌నగర్ ఘటనకు కారకులైన పోలీసు సిబ్బంది, అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు భట్టి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దొంగతనం కేసులో షాద్‌నగర్ పట్టణ పోలీసులు దళిత మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి శిక్షించిన అంశంపై అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి డిప్యూటీ సీఎంతో మాట్లాడారు. అనంతరం భట్టి ఆదేశాలతో ఒక సీఐ, ఆరుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి నిర్ణయం తీసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని పోలీసులకు భట్టి ఆదేశాలిచ్చారు.

ఉద్యోగం రావడం లేదని యువతి ఆత్మహత్య

నల్లగొండ క్రైం: ఎన్ని పరీక్షలు రాసినా ఒక్క ఉద్యోగం కూడా రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ పట్టణంలోని పానగల్‌కు చెందిన నాగవల్లి మౌనిక (29) బీఈడీ పూర్తి చేసింది. ఇటీవల పోటీపరీక్షలకు కోచింగ్ తీసుకుని వివిధ పరీక్షలు రాసింది. అయితే, ఆమె ఏ ఉద్యోగానికి కూడా ఎంపిక కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందింది. మంగళవారం తమ ఇంటికి సమీపంలో ఉన్న మేనమామ నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై నాగరాజుగౌడ్ తెలిపారు.

16 మంది పీఏసీఎస్‌ల కార్యదర్శులపై వేటు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ పథకానికి అర్హులు. అయితే 16 పీఏసీఎస్‌లు నిర్ణీత వ్యవధి మధ్యలో లేని వారిని కూడా పంట రుణమాఫీకి అర్హులుగా గుర్తించి పంపినట్లు వెల్లడైంది. పలు పీఏసీఎస్‌ల్లో రైతుల రుణ బకాయిలు, వడ్డీ లెక్కించడంలో పెద్ద ఎత్తున పొరపాట్లు దొర్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే సహకార శాఖ ఉన్నతాధికారులు ఆయా పీఏసీఎస్‌ల కార్యదర్శుల సంజాయిషీ కోరారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా సహకార అధికారులను సహకార శాఖ డైరెక్టరేట్ ఆదేశించింది. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా భవిష్యత్తులో అప్రమత్తంగా ఉండాలని, పీఏసీఎస్‌ల కార్యదర్శులను సహకార శాఖ రిజిస్ట్రార్ ఆదేశించారు.

శభాష్ పోలీస్

- రాత్రివేళ ఇద్దరు పిల్లలతో ఎటువెళ్లాలో తెలియని నిండు గర్భిణికి గస్తీ పోలీసుల ఆపన్నహస్తం



ఆస్పత్రిలో మహిళ యోగక్షేమాలు తెలుసుకుంటున్న సీఐ నాగరాజు గౌడ్

మాడ్గుల: రాత్రివేళ.. రాష్ట్రం కాని రాష్ట్రం.. ఇద్దరు పిల్లలతో ఎటువెళ్లాలో తెలియని స్థితి.. ఆపై మొదలైన పురిటినొప్పులు... ఇలా దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న ఆమెకు రంగారెడ్డి జిల్లా మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గస్తీ పోలీసులు మేమున్నామంటూ ఆపన్నహస్తం అందించారు. 'డయల్ 100' కంట్రోల్ రూం నుంచి అందిన సమాచారంతో వెంటనే అక్కడకు చేరుకొని స్థానిక మహిళల చేత దగ్గరుండి పురుడు పోయించి మానవత్వం చాటుకున్నారు. అనంతరం ఆమె సంబంధీకుల సహకారంతో తల్లీబిడ్డలను హైదరాబాద్‌లోని కోఠి మెటర్నిటీ ఆస్పత్రికి పంపించారు.

ఓ వ్యక్తి ఫోన్ చేయడంతో...: సోమవారం రాత్రి గ్రామంలో గస్తీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి డయల్ 100కు కాల్ చేసి ఈ విషయం చెప్పగా కంట్రోల్ రూం సిబ్బంది ఆ సమాచారాన్ని గస్తీ పోలీసులకు చేరవేశారు. దీంతో వారు తక్షణమే అక్కడికి చేరుకొని మహిళ వివరాలు కనుక్కున్నారు. తన పేరు కుమీభాయ్ అని, కర్ణాటకలోని చెంచోలు మండలం పోలేపల్లి తమ గ్రామమని తెలిపింది. కుటుంబ సభ్యులతో మనస్పర్థలతో వారం క్రితం ఇల్లు వదిలి వచ్చానని పేర్కొంది. భర్త పేరు, ఫోన్ నంబర్ చెప్పగా పోలీసులు ఆ నంబర్‌కు కాల్ చేశారు. అతను ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. హైదరాబాద్‌లో ఉన్న భార్య తమ్ముడిని పిలిపించి అతని వెంట పంపాలని ఫోన్ నంబర్ ఇచ్చాడు. అనంతరం పోలీసులు తల్లీబిడ్డలకు ఆహారం అందించి స్థానిక ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఆ మహిళకు పెట్రో కార్ అడ్డంపెట్టి స్థానిక మహిళల చేత అక్కడే పురుడు పోయించారు. తర్వాత ఆమె సోదరుడిని పిలిపించారు. తల్లీపిల్లలను మాల్ వరకు తీసుకెళ్లి అక్కడి నుంచి కోఠి మెటర్నిటీ హాస్పిటల్‌కి పంపించారు. ఆస్పత్రిలో మాడ్గుల సీఐ నాగరాజు గౌడ్ ఆమెను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మానవత్వం చాటుకున్న పెట్రో కార్ సిబ్బంది రాజేందర్, సురేశ్, సీఐ నాగరాజు గౌడ్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి అభినందించారు.

స్పీకర్‌కు గడువు నిర్దేశించొచ్చు కదా

- 'అనర్హత' పిటిషన్లపై హైకోర్టు వ్యాఖ్య
- అలా ఆదేశించే పరిధి కోర్టుకు లేదన్న ఏజీ
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల 'అనర్హత' ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు తాము నిర్దిష్ట గడువు నిర్దేశించొచ్చు కదా అని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డిని హైకోర్టు ప్రశ్నించింది. అయితే కోర్టుకు ఆ పరిధి లేదని.. స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు ఇవ్వజాలవని ఆయన బదులిచ్చారు. కైశమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది కదా అని హైకోర్టు గుర్తుచేయగా అనర్హత పిటిషన్లలో గడువు నిర్ణయిస్తూ స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఉత్తర్వులేవీ జారీ చేయలేదని సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ చెప్పారు. మరోవైపు స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని పిటిషనర్ల తరఫున మరో సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన తమ పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, దానం నాగేందర్‌లను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డితోపాటు బీజేపీ ఎల్పీ మహేశ్వర్‌రెడ్డి మూడు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం కూడా విచారణ చేపట్టారు. మోహన్‌రావు వాదిస్తూ 'మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో ఐదుగురు జడ్జీల ధర్మాసనం.. 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. పిటిషన్లు వేసి 3 నెలలు దాటినా ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులివ్వలేదు. స్పీకర్ రాజకీయ ఒత్తిళ్లతో నిర్ణయం తీసుకోవట్లేదని భావించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు స్పీకర్‌ను ఆదేశించే అధికారం రాజ్యాంగ ధర్మాసనాలకు ఉంటుంది' అని పేర్కొన్నారు. అనంతరం తమకు సమయం ఇవ్వాలని సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, శ్రీరఘురాం కోరడంతో విచారణను జడ్జి బుధవారానికి వాయిదా వేశారు.

విచారణ వీడియో వైరల్... మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మంథని: నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా ఓ వ్యక్తి నుంచి డబ్బు తీసుకున్న తీరుపై పోలీసులు చేపట్టిన విచారణ వీడియో యూట్యూబ్ చానల్‌లో వైరల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుమ్మనూరు గ్రామంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఉషన్నపల్లి గ్రామానికి చెందిన బండారి రాజ్‌కుమార్(23) రెండురోజుల క్రితం గుమ్మనూరులోని ఓ దుకాణంలోకి వచ్చాడు. నకిలీ ఫోన్ పే ద్వారా దుకాణదారుకు రూ.300 పంపించి అతడి నుంచి నగదు తీసుకున్నాడు. సోమవారం కూడా అదే దుకాణానికి వెళ్లి నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా మరో రూ.500 పంపించాడు. తనకు రూ.500 నగదు ఇవ్వాలని మళ్లీ దుకాణదారును అడిగాడు. ఆ సొమ్ము తన ఫోన్ పే ఖాతాలో జమకాలేదని గుర్తించిన దుకాణదారు..పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణ వీడియో యూట్యూబ్ చానల్‌లో వైరల్‌గా మారింది. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన రాజ్‌కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయంపై మృతుడి తల్లి తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI A PANDURANGAIAH CHETHY	SHRI AMURU SUDHAKAR S/o LATE AMURU PANDURANGAIAH CHETHY	PNO 139 SARASWATHI NAGAR VENT III LOTHUKUNTA	DEATH CERTIFICATE OF AMURU PANDURANGAIAH CHETHY, WILL DEED DT 06/07/2019 (LINK DOCUMENTS)
2	SHRI SHIREESH KATE	SHRI VELURI BALASUBRAHMANYAM S/o LATE VELURI ANJANEYULU	PNO 36 INDRAPURI RAILWAY COLONY WEST MARREDPALLY	SALE DEED NO 989/2023 DT 31/05/2023(LINK DOCUMENTS)
3	SHRI SARWAR HUSSAIN	SMT VIDYA BHANDARKER W/o LATE SARWAT HUSAIN	PNO 9/2/GF RUKMINI DEVI COLONY MARREDPALLY	DEATH CERTIFICATE OF SARWAR HUSSAIN DECREE IN ORIGINAL SUIT NO 3309/2023 (LINK DOCUMENTS)
4	SHRI SUNIL KUMAR	1.SHRI AMIT KUMAR AGARWAL S/o LATE OM PRAKASH AGARWAL 2.SMT PRIYANKA AGARWAL W/o SRI AMIT KUMAR AGARWAL	FNO S-4/SF(204) GANESH RESIDENCY CHINNA THOKATTA BOWENPALLY	SALE DEED NO 735/2024 DT 25/04/2024 (LINK DOCUMENTS)
5	Mrs SHAKUNTALA CHANDRA SHEKAR	1.SHRI BAJJURI SANDEEP S/o LATE BAJJURI KESHAVULU 2.SMT THANDA SUPRIYA W/o BAJJURI SANDEEP	FNO 202/FF, PNO 29 SREE SAIBABA ENCLAVE KAKAGUDA	SALE DEED NO 469/2024 DT 13/03/2024(LINK DOCUMENTS)
6	SHRI M R RAJU	SMT MUDDALURU KALAVATHI W/o MUDDALURU RAMARAJU	PNO E-6/GF VIKRAMPURI COLONY KARKHANA	DEATH CERTIFICATE OF M RAMARAJU FAMILY MEMBER CERTIFICATE FROM GOVT OF ANDHRA PRADESH, REVENUE DEPT. (LINK DOCUMENTS)
7	SHRI M R RAJU	SMT MUDDALURU KALAVATHI W/o MUDDALURU RAMARAJU	PNO E-6/FF VIKRAMPURI COLONY KARKHANA	
8	SMT ARURU LAXMI	ARURU SUDHAKAR S/o LATE ARURU SUBBA RAYULU	PNO 12/B/GF/FF DHANALAKSHAMI CHS BOWENPALLY	DEATH CERTIFICATE OF ARURU LAKSHMI, NO OBJECTION AFFIDAVITSALE DEEDNO 2728/1992 DT 25.11.1992 (LINK DOCUMENTS)
9	SMT SWAROOPA	SHRI CH NAVEEN KUMAR S/o SRI RAJARAM	FNO 105/GF(1-12-216) SAI SRI APARTMENTS CHINNA THOKATTA FLATS (1-12-216 &1-12-216/1) BOWENPALLY	SALE DEED NO 572/2009 DT 11/05/2009 (LINK DOCUMENTS)
10	SHRI B D SINGH	1.SHRI SURESH MOHAN GUNTUKA S/o MOHAN CHANDRAIAH GUNTUKA 2.SMT SWATHI SURESH GUNTUKA W/o SURESH MOHAN GUNTUKA	FNO 202/SF, PNO 14 PADMAVATHI APARTMENTS SANJEEVAIAH CHS BOWENPALLY	SALE DEED NO 949/2018 DT 07/05/2018 (LINK DOCUMENTS)
11	SHRI UTLA SAMPATH KUMAR	SMT KATHI REKHA W/o KATHI MAHESHWAR D/o LATE UTLA LAXMAN	FNO 111/GF DAYAKAMAL TOWERS KAKAGUDA VILLAGE	SETTLEMENT DEED NO 1150/2024 DT 02/07/2024 (LINK DOCUMENTS)
12	SHRI E MOHAN RAJ	SHRI MOHAN PRADEEP RAJ S/o LATE E MOHAN RAJ	PNO 51/GF SRI MALANI C H S LOTHKUNTA	SETTLEMENT DEED NO 2123/2023 DT 04/12/2023 DEATH CERTIFICATE OF MOHAN RAJ AND FAMILY MEMBERS CERTIFICATE (LINK DOCUMENTS)
13	SHRI E MOHAN RAJ	SHRI MOHAN PRADEEP RAJ S/o LATE E MOHAN RAJ	PNO 51/FF SRI MALANI C H S LOTHKUNTA	
14	SHRI KIRAN KUMAR POLURU MRANKRINDA	1. SHRI D SAMBASIVA RAO S/o D VENKATESWARLU 2.SMT ADINA ANASUYA D/o SURI BABU	FNO 402/4TH FLOOR SRI SAI PLAZA APARTMENT VIJAYNAGAR COLONY PICKET	SALE DEED NO 1037/2023 DT 05/06/2023(LINK DOCUMENTS)
15	1.SHRI SHARAT DEVULAPALY 2.SMT DEVULAPALY INDIRA RANI 3.SHRI DEVULAPALY VENKA RAVINDER RAO	GOUDA SANKSHEMA SANGHAM NEW BOWENPALLY REP BY ITS PRESIDENT SHRI MADASU KALYAN CHAKRAVARTHI GOUD S/o M GANGADHAR GOUD	OPEN PLOT PORTION OF HNO 2-24-7 & 2-24-5 SYNO 87 SRI LAKSHMI NAGAR BOWENPALLY	SALE DEED NO 618/2023 DT 31/03/2023 (LINK DOCUMENTS)
16	1.SHRI C V UNNIKRISHNAN 2.SHRI C V PRABHAKARAN	SHRI C V PRABHAKARAN S/o C V RAMAN EZHUTHACHAN	PNO 142/GF SARASWATHI NAGAR VENT III LOTHUKUNTA	DEATH CERTIFICATE OF C V UNNI KRISHNAN RELEASE DEED NO 2006/1999 DT 13.12.1999 (LINK DOCUMENTS)
17	1.SHRI C V UNNIKRISHNAN 2.SHRI C V PRABHAKARAN	SHRI C V PRABHAKARAN S/o C V RAMAN EZHUTHACHAN	PNO 142/FF SARASWATHI NAGAR VENT III LOTHUKUNTA	
18	Mr MARTIN J MICHAEL	Mrs MARIA LEWIS W/o A JAMES	PNO 48,49,54 & 55,FNO 2/SF SRI SAI MARUTHI APARTMENTS	SALE DEED NO 410/2023, DT 04/03/2023 (LINK DOCUMENT)
19	MAJOR GENERAL M RAJENDRAN	SMT KATTULA SULOCHANA W/o B SRINIVASA RAO	FNO 3/SF SRI SAI SADAN LOKAYATH CHS DOVETON	SALE DEED NO 2405/2019 DT 19/12/2019(LINK DOCUMENTS)
20	SMT MOKKAPATI SASHIKALA	SHRI MOHD ALEEMUDDIN GHORI S/o MOHD RIAZUDDIN GHORI	FNO A-1/GF, PNO 13/B PUBLIC SECTOR EMPLOYEES CHS BOWENPALLY	SALE DEED NO 849/2024 DT 15/04/2024 (LINK DOCUMENTS)
21	SHRI JAYANT SARKAR	MR MOLUGU SAI PRASAD S/o LATE M SRINIVAS RAO	PNO 28/FNO 405/TF PRITHVI REBA SIKH VILLAGE	SALE DEED NO 696/2023 DT 21/04/2023(LINK DOCUMENTS)
22	1.SHRI C PARAMESHWARAN RAJKUMAR 2.SMT VIDYA RAJKUMAR	SMT GURRAM PURNA USHA KIRAN W/o Dr KONDREDDY SUDHAKAR REDDY	PNO 77/GF TEACHERS COLONY TRIMULGHERRY	SALE DEED NO 1245/2024 DT 15/07/2024(LINK DOCUMENTS)
23	SHRI D BALAKRISHNA MURTHY	SMT SURAMPALLI LALITHA W/o SURAMPALLI PANDU	FNO 42/GF JANAPRIYA SHELTERS, PH-I,B-3 DOVETON BAZAR	SALE DEED NO 985/2021 DT 05/05/2021 (LINK DOCUMENTS)
24	SHRI K SRIHARI	SHRI SANDEEP BASHA S/o BASA SAI BABA	FNO 202/FF VAISHNAVI RESIDENCY CHANDULALBOWLI	SALE DEED NO 1168/2024 DT 03/07/2024 (LINK DOCUMENTS)
25	1.SMT KIRAN AGARWAL 2.KIRAN KUMARI	Mr MOHAMMED IRFAN S/o SHEKH BABULAL	PNO 16/ SHOP NO 4/GF SHIV SHYAM KUTEER CANTONMENT CHS THOKATTA VILLAGE	SALE DEED NO 779/2024 DT 04/05/2024 (LINK DOCUMENTS)
26	SMT C H VIJAYALAXMI	1.Mr MOHAMMED MOIN OMER AIBANI S/o LATE MOHAMMED OMER AIBANI 2.Mrs ASIYA MOIN AIBANI W/o MOHAMMED MOIN OMER AIBANI	SYNO 12/A CHANDULALBOWLI	RELEASE DEED NO 1860/2017 DT 15/11/2017 SALE DEED NO 1401/1997 DT 03/10/1997 DEATH CERTIFICATES (LINK DOCUMENTS)
27	SMT M SWAROOPA	SHRI AVULLA SHANTHI KUMAR YADAV S/o AVULLA DAYANAND YADAV	HNO 1-9-64 TO 66/GF/FF/SF/TF PEDDA THOKATTA BOWENPALLY	SALE DEED NO 1372/2017 DT 10/10/2017(LINK DOCUMENTS)
28	SHRI MOHD AZEEMUDDIN GHORI	SHRI MOHD FAYAZUDDIN GHORI S/o LATE MOHD RIYAZUDDIN GHORI	PNO 12/PART/GF PUBLIC SECTOR EMPOLYEES COLONY BOWENPALLY	GIFT SETTLEMENT DEED NO 692/2001 CANCELLED VIDE DOCUMENT NO 2240/2006, DT 09/11/2006
29	SMT S SHAKUNTALA	1.SHRI S ANJAIAH GOUD S/o LATE S SUDARSHAN GOUD 2.SHRI S THIRMAL GOUD S/o LATE S SUDHARSHAN GOUD	PNO 5 PAIGAH HOUSE RASOOLPURA BALAMRAI	WILL DEED DT 18/07/2009 PARTITION DEED NO 781/2008 31/05/2008 DEATH CERTIFICATE OF SMT S SHAKUNTALAMMA
30	SMT SARBATHIBAI	SHRI SRIKISHAN AGARWAL S/o SOHANLAL AGARWAL	PNO 5/GF/FF HANURAM COLONY TRIMULGHERRY	GIFT SETTLEMENT DEED NO 200/2000 DT 08/03/2000 (LINK DOCUMENTS)

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

Sd/-
D. Madhukar Naik
Chief Executive Officer, Secunderabad Cantonment Board.

No. SCB/Tax branch, Office of the Cantonment Board, Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 06-08-2024

జహీరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండరు ప్రకటన నం. E1/57/MCZ/2024-25 తేది: 06-08-2024

పనుల వివరణ: మున్సిపాలిటీలకు స్కీమ్ సహాయం క్రింద 1 నం. పని (1వ పిలుపు) - రూ.14.42 లక్షలు. 15వ FCG క్రింద 1 నం. పని (1వ పిలుపు) - రూ.25.00 లక్షలు. మున్సిపాలిటీలకు స్కీమ్ సహాయం క్రింద 1 నం. పని (2వ పిలుపు) - రూ.5.00 లక్షలు. బిడ్లు ఆన్‌లైన్ దాఖలుకు ప్రారంభ తేదీ/ సమయం: 07-08-2024న ఉ.09.00 గం. నుండి, బిడ్లు ఆన్‌లైన్ దాఖలుకు ముగింపు తేదీ/ సమయం: 14-08-2024న సా.4.30 గం. వరకు. బిడ్లు తెరుచు తేది: 14-08-2024న సా.05.00 గం. కు. **సంప్రదించు వివరాలు:** మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్ మున్సిపాలిటీ, సెల్ నం.: 9849905919, ఇ-మెయిల్: maezaheerabad@gmail.com. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చును. పనుల డౌన్‌లోడింగ్ 07-08-2024న ఉ.09.00 గం. నుండి ప్రారంభమగును.

సం/- కమిషనర్, జహీరాబాద్ మున్సిపాలిటీ

DIPR RO No.2562-PP/CL/ADVT/1/2024-25, Dt.: 06.08.2024

CSIR - INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
(Council of Scientific & Industrial Research)
HYDERABAD - 500007.

WALK-IN-INTERVIEW NOTIFICATION NO. 09/2024

CSIR-IICT, Hyderabad is conducting Walk-in-Interviews on 20th Aug. 2024 for the positions of Project Staff having qualifications of Ph.D in Chemistry / MSc in (Chemistry / Microbiology / Biotechnology) / B.Tech in Chemical Engineering / B.Pharmacy in Pharmaceutical Analysis etc.

For full details visit our website **www.iictindia.org**

Sd/-
Controller of Administration

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్

HMDA చట్టం, 2008లోని సెక్షన్ 15(3) క్రింద బహిరంగ ప్రకటన
(గవర్నమెంట్ మెమో నం. 2910/Plg.I(1)/2020, తేది : 07.10.2023)

HMDA చట్టం 2008 (చట్టం నం. 8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని, G.O.Ms.No. 288, MA&UD, తేది: 03.04.2008 ప్రకారం ఆమోదించబడిన ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2021లో ఉద్దేశించిన భూమి వినియోగానికి దిగువ డ్రాఫ్ట్ మార్పు చేసేందుకు ప్రతిపాదించబడినది. G.O.Ms.No.288, MA&UD, తేది: 03.04.2008 ప్రకారం ఆమోదించబడిన ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2021 ప్రకారం ప్రస్తుతం అగ్రికల్చరల్/కన్జర్వేషన్ వినియోగం, బఫర్ జోన్, కొంతభాగం వాటర్ బాడీ వినియోగం కొరకు కేటాయించబడిన మేడ్చల్ (జిల్లా), దుండిగల్ (మం), బౌరంపేట్ (గ్రా)లో గల సర్వే నం. 36p, 106p, 112p, 113p, 115p, 116p, 117p, 124p, 125p, 126p, 127p, 128p, 129, 131, 132p, 133, 134p, 136p, 143p లోని ఎ.22-14.5 గుంటల విస్తీర్ణం (పెద్ద చెరువు ఎ.1-06.5 గుంటల FTL ఏరియా & ఎ.03-26 గుంటల బఫర్ జోన్ ఏరియా మినహా) గల స్థలం ఇప్పుడు ఇరిగేషన్ & రెవెన్యూ శాఖ జారీ చేసిన NOC ఆధారంగా నివాస వినియోగంగా నిర్దిష్టపరచుటకు ప్రతిపాదించబడినది. పై వాటి యొక్క వివరాలు వెబ్‌సైట్లు http://gazette.telangana.gov.in// & http://hmda.gov.in//లో లభిస్తాయి. సదరు ప్రతిపాదనలకు ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ నుండి అభ్యంతరాలు / సూచనలు పరిశీలించబడతాయి. వారు అభ్యంతరాలను / సూచనలను వ్రాతపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి పదిహేను (15) రోజులలోగా M.C., HMDA గారికి గానీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, MA&UD డిపార్ట్‌మెంట్, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ గారికి గానీ సమర్పించవచ్చును.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA తరఫున

DIPR RO No. 2539-PP/CL/ADVT/1/2024-25, Dt.: 06.08.2024

भारत सरकार
अंतरिक्ष विभाग
राष्ट्रीय सुदूर संवेदन केंद्र
हैदराबाद -500 037, तेलंगाना भारत
टेलीफोन : +040-23884173 / 74
फैक्स: +040-23884179

Government of India
Department of Space
National Remote Sensing Centre
Balanagar, Hyderabad – 500 037, Telangana, India
Telephone: +040-23884173 / 74
Fax: +040-23884179

निर्माण एवं अनुरक्षण समूह / CONSTRUCTION & MAINTENANCE GROUP
ई-निविदा नोटिस / e-TENDER NOTICE

समूह निदेशक, सीएमजी, एनआरएससी, हैदराबाद द्वारा निम्नलिखित कार्यों के लिए ऑन-लाइन निविदा आमंत्रित की जाती है।
Online tenders are invited by the Group Director CMG, NRSC, Hyderabad for the following works:

एनआईटी सं. NIT No.	कार्य का नाम / Name of work	अनुमानित प्राक्कलित लागत Approximate Estimated Cost (Rs.)	निविदा दस्तावेज डाउनलोड करने की अवधि Period during which the tender document can be downloaded	बोली अपलोड करने की अंतिम तिथि Last date for Bid uploading
NRSC/CMG/ NIT/ET/24/24 033/2024-25	एनआरएससी शादनगर परिसर में प्रवेश कैनोपी के लिए संरचनात्मक स्टील फ्रेम कार्य के साथ उच्च तन्यता शीट छत की डिजाइन आपूर्ति, स्थापना और फिक्सिंग का कार्य। Design, Supply, Installation and Fixing of High Tensile Sheet Roofing with structural steel frame work for Entrance Canopies at NRSC Shadnagar Campus.	₹ 6.05 लाख / Lakhs	From : 07.08.2024 से To : 19.08.2024 तक	Up to 23.08.2024 16:00 बजे / Hrs
NRSC/CMG/ NIT/ET/26/24 034/2024-25	एनआरएससी बालानगर परिसर में भवन सं. 17 में एचआरडी सम्मेलन कक्ष में क्षतिग्रस्त लकड़ी की दीवार पैनलिंग बदलने का कार्य। Replacement of damaged Wooden Wall Panelling in HRD Class Room and Conference Hall with New Wall Panelling in building no.17 at NRSC Balanagar Campus.	₹ 9.85 लाख / Lakhs	From : 07.08.2024 से To : 19.08.2024 तक	Up to 23.08.2024 16:00 बजे / Hrs
NRSC/CMG/ NIT/ET/27/24 036/2024-25	एनआरएससी बालानगर परिसर में बिल्डिंग संख्या 5, 7, 16 में विभिन्न सीढ़ी के शीर्ष कक्षों में क्षतिग्रस्त पॉलीकार्बोनेट शीट की छत बदलने का कार्य। Replacement of damaged ploycarbonate sheet roofing at various stair case head rooms in Building no. 6,7,16 at NRSC Balanagar campus	₹ 4.90 लाख / Lakhs	From : 07.08.2024 से To : 19.08.2024 तक	Up to 23.08.2024 16:00 बजे / Hrs

विस्तृत एनआईटी एवं पात्रता मानदंड ईएमडी बोली संबंधित प्रलेख आदि www.tenderwizard.com/ISRO पोर्टल से देखा/डाउनलोड किया जा सकता है। किसी प्रकार के संशोधन, समय विस्तार, स्पष्टीकरण आदि वेबसाइट पर अपलोड किया जाएगा और किसी समाचार पत्र में प्रकाशित नहीं किया जाएगा। बोलीकर्ता अद्यतन जानकारी हेतु नियमित रूप से वेबसाइट देखें।

Detailed NIT and eligibility criteria, EMD bidding document, etc. can be viewed /download from www.tenderwizard.com/ISRO portal. All amendments, time extension, clarifications, etc. will be uploaded on website and will not be published in newspapers. Bidders should regularly visit website to keep themselves updated.

समूह निदेशक / Group Director
निर्माण एवं अनुरक्षण समूह / Construction & Maint. Group

..అదే కల్లోలం

బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస



- దేశవ్యాప్తంగా లూటీలు, విధ్వంసం
- సినీ హీరోను కొట్టి చంపిన మూకలు
- హోటల్‌కు నిప్పు, 24 మంది సజీవ దహనం
- ఇప్పటిదాకా 440 దాటిన మృతులు
- పార్లమెంటు రద్దు, త్వరలో ఎన్నికలు
- అప్పటిదాకా తాత్కాలిక ప్రభుత్వం

ఢాకా: బంగ్లాదేశ్‌లో అరాచకం రాజ్యమేలుతోంది. షేక్ హసీనా ప్రధానిగా తప్పుకోవాలంటూ వెల్లువెత్తిన నిరసనలు ఆమె రాజీనామా చేసినా ఆగడం లేదు. సోమవారం సాయంత్రానికే హసీనా దేశం వీడినా రాత్రి పొడవునా దేశవ్యాప్తంగా దమనకాండ కొనసాగింది. అల్లరి మూకలు యథేచ్ఛగా విధ్వంసానికి దిగాయి. ఇళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చలవిడిగా నిప్పు పెట్టారు. చివరికి పోలీస్ స్టేషన్లను కూడా వదల్లేదు. ఒకచోట ఎస్సైని కొట్టి చంపారు. మరోచోట ప్రముఖ సినీ హీరో ఇంటిపై నిరసనకారులు దాడికి దిగారు. హీరో, ఆయన తండ్రి తుపాకీతో బెదిరించడంతో మరింతగా రెచ్చిపోయారు. ఇద్దరినీ కర్రలతో చితకబాది చంపేశారు. జోషోర్ జిల్లాలో హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నాయకుని హోటల్‌ను తగలబెట్టడంతో 24 మంది సజీవ దహనమయ్యారు! సోమవారం ఢాకాలో పాక్షికంగా ధ్వంసం చేసిన హసీనా తండ్రి, బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని బుల్‌డోజర్లతో కూల్చేశారు.

మైనారిటీలైన హిందువులను దేశవ్యాప్తంగా అల్లరి మూకలు లక్ష్యం చేసుకున్నాయి. దేవాలయాలను ధ్వంసం చేశారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడ్డారు. హసీనా పలాయనం అనంతరం దేశవ్యాప్తంగా కనీసం 100 మందికి పైగా అల్లర్లకు బలైనట్టు స్థానిక మీడియా పేర్కొంది. గత నెల రోజుల్లో మరణించిన వారి సంఖ్య 440 దాటింది. పోలీసులు, సైన్యం రంగంలోకి దిగడంతో మంగళవారం సాయంత్రానికి పరిస్థితి కాస్త అదుపులోకి వచ్చినట్టు చెబుతున్నారు. మరోవైపు న్యూయార్క్‌లోని బంగ్లాదేశ్ కాన్సులేట్‌పై దాడి జరిగింది. నిరసనకారులు కార్యాలయంలోకి జొరబడి ముజిబుర్ రెహ్మాన్ ఫొటోను, వస్తువులను ధ్వంసం చేశారు. సంబంధిత వీడియో వైరల్‌గా మారింది.

తాత్కాలిక ప్రభుత్వ సారథిగా యూనుస్



నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారథిగా సైన్యం కనుసన్నల్లో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అధ్యక్ష కార్యాలయం మంగళవారం అర్ధరాత్రి ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కేసులు, జైలుశిక్ష నేపథ్యంలో యూనుస్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. హసీనా సర్కారు పతనాన్ని ఆయన స్వాగతించారు. ఈ పరిణామాన్ని దేశానికి రెండో విముక్తిగా అభివర్ణించారు. అంతకుముందు, విద్యార్థి సంఘాల అల్టిమేటం నేపథ్యంలో పార్లమెంటును రద్దు చేస్తూ అధ్యక్షుడు మొహమ్మద్ షాబుద్దీన్ నిర్ణయం తీసుకున్నారు. దాంతో మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు, సాధారణ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులతో అధ్యక్షుడు భేటీ అయ్యారు. తాత్కాలిక సర్కారు కూర్పుపై వారితో చర్చించారు. విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) సారథి బేగం ఖలీదా జియా (79)ను గృహనిర్బంధం నుంచి విడుదల చేశారు.

చైనా, ఐఎస్ఐ హస్తం?

హసీనాను దించేందుకు పక్కాగా పావులు

- భారత వ్యతిరేక జియాను ఎలాగైనా గద్దెనెక్కించే లక్ష్యం
- బంగ్లాను ఉగ్రవాద అడ్డాగా మార్చే యత్నం
- విద్యార్థి ఆందోళనల్లోకి ఐఎస్ఐ జేబు సంస్థ జమాత్
- ఘర్షణలను ఎగదోసిన ఐసీఎస్

బంగ్లాదేశ్ కల్లోలం వెనక విదేశీ హస్తముందా? చైనా, పాక్ ఐఎస్ఐ కలిసి పక్కా ప్రణాళికతోనే సంక్షోభాన్ని సృష్టించాయా? భారత్‌పట్ల అనుకూలంగా ఉన్నందుకే షేక్ హసీనా పట్ల అక్కసు పెంచుకున్నాయా? తమ జేబు సంస్థల ద్వారా అరాచకం సృష్టించి ఆమెను గద్దె దించడంలో సఫలమయ్యాయా? రిజర్వేషన్ల ఆందోళన వాటికి అందివచ్చిన ఆయుధంగా మారిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. యువత, విద్యార్థుల ఆందోళనలో ఐఎస్ఐ శక్తులు చేరి పరిస్థితి చేయి దాటేలా చూడటంలో సఫలీకృతమైనట్టు పలు దేశాల నిఘా వర్గాలు నిర్ధారిస్తున్నాయి. వాటి కథనం ప్రకారం... బంగ్లాదేశ్‌లో ఎలాగైనా భారత వ్యతిరేక, చైనా-పాక్ అనుకూల సర్కారు కొలువుదీరేలా చూడటమే లక్ష్యంగా ఐఎస్ఐ పావులు కదిపింది. ఇందుకోసం బంగ్లాలోని ఐఎస్ఐ స్లీపర్‌సెల్స్ రాత్రింబవళ్లూ పని చేశాయి. ముఖ్యంగా ఢాకాలో పరిస్థితులు పూర్తిగా చేయి దాటిపోవడం వెనక ఐఎస్ఐ ముసుగు సంస్థ జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్, దాని విద్యార్థి విభాగం ఇస్లామీ ఛాత్ర శివిర్ (ఐసీఎస్) కీలక పాత్ర పోషించాయి. యువత, విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను వీలైనంతగా ఎగదోశాయి. ఇందుకోసం జమాత్, ఐసీఎస్ సభ్యులు విద్యార్థుల ముసుగులో పని చేశారు. జమాత్‌కు నిత్యం పాక్, ఐఎస్ఐ నుంచే నిధులందుతాయి. ఎప్పుడు, ఎక్కడ, ఏం చేయాలో ఢాకాలోని పాక్ హై కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు నిర్దేశాలు వస్తుంటాయి. ఆ మేరకు జమాత్ సభ్యులు సైలెంటుగా పని చక్కబెడతారని పాక్‌లోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు మీడియా సంస్థలు కథనాలు వెలువరిస్తున్నాయి.

లండన్‌లో వ్యూహరచన!

హసీనాను వీలైనంత త్వరగా గద్దె దింపి భారత వ్యతిరేకి అయిన మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా సారథ్యంలోని విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధికారంలోకి వచ్చేలా చూడటమే టాస్క్‌గా ఐఎస్ఐ పావులు కదిపింది. తద్వారా నానాటికీ సుదృఢంగా మారుతున్న భారత్-బంగ్లా సంబంధాలకు బ్రేక్ వేయడంతో పాటు కశ్మీర్ నుంచే గాక బంగ్లా వైపు నుంచి కూడా భారత్‌లోకి ఉగ్రవాదులను చొప్పించే వ్యూహం దీని వెనక దాగుంది. లండన్‌లో ఇందుకు పక్కగా స్కెచ్ తయారైనట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఇటీవల ఐఎస్ఐ వర్గాలతో సౌదీ అరేబియాలో భేటీ అయినట్టు సమాచారం. అనంతరం ప్రణాళికను పక్కాగా అమల్లో పెట్టారు. అందులో భాగంగా అల్లర్ల వ్యాప్తికి జూన్‌లోనే ఐసీఎస్ వ్యూహాలు సిద్ధం చేసుకుంది. వీలైనంత అరాచకం సృష్టించడమే లక్ష్యంగా జమాతే, ఐసీఎస్‌లకు ఐఎస్ఐ భారీగా నిధులిచ్చినట్టు వెలుగులోకి వచ్చింది. వాటిలో అత్యధిక మొత్తాలను ఫండింగ్ చేసింది పాక్‌లోని చైనా సంస్థలేనని తేలింది. అంతిమంగా బంగ్లాలోనూ తాలిబన్ తరహా పాలన తేవాలన్నది వాటికి ఐఎస్ఐ, చైనా అప్పగించిన టాస్క్ అని నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. ఈ మేరకు కొద్ది నెలల క్రితమే ఐసీఎస్ రంగంలోకి దిగింది. ఢాకాతో పాటు పలు నగరాల్లో విద్యార్థులను నయానా భయానా భారీ సంఖ్యలో తమ సానుభూతిపరులుగా మార్చుకుంది. బంగ్లాదేశ్ అంతటా ఘర్షణలు తీవ్ర రూపు దాల్చేలా, పరిస్థితి చేయి దాటిపోయేలా చేయడం వెనక ఈ సంస్థే ప్రధాన పాత్ర పోషించిందని తేలింది. దానికి ఢాకాలోని పాక్ ఎంబసీ అన్నివిధాలా దన్నుగా నిలిచింది. ఈ క్రమంలో, అవసరమైతే తమ కార్యాలయంలో తలదాచుకోవాల్సిందిగా విద్యార్థులకు చెప్పేదాకా వెళ్లిందని దౌత్య వర్గాలంటున్నాయి!

చైనా హస్తం సుస్పష్టం

బంగ్లా కల్లోలం వెనక చైనా విదేశాంగ, భద్రతా వ్యవహారాల శాఖ హస్తం కూడా ఉందని నిఘా వర్గాలు వెల్లడించాయి. తమకంటే భారత్‌కు హసీనా ఎక్కువ ప్రాధాన్యమివ్వడం చైనాకు రుచించని అంశాల్లో ఒకటి. పాక్ అనుకూల సర్కారైతే తన చెప్పుచేతల్లో ఉంటుందన్నది చైనా వ్యూహం. హసీనాను గద్దె దింపడం వెనక కచ్చితంగా విదేశీ హస్తముందని ఆ దేశంలో భారత హైకమిషనర్‌గా చేసిన వీణా సిక్రీ అన్నారు. ''ఇటీవలి చైనా పర్యటన సందర్భంగా హసీనాను ఘోరంగా అవమానించిన తీరే ఇందుకు నిదర్శనం. ఆమెకు కనీస ప్రొటోకాల్ మర్యాద కూడా ఇవ్వలేదు. అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హసీనాతో వ్యక్తిగతంగా భేటీ కాలేదు. ఆమె సర్కారును కూలదోయడం వెనక పాక్-చైనా ఉమ్మడి వ్యూహం ఉందన్నది స్పష్టమే'' అని వివరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఐఐటీ-మద్రాసుకు కృష్ణ చివుకుల రూ.228 కోట్ల విరాళం


సాక్షి, చెన్నై: ఐఐటీ–మద్రాసుకు పూర్వ విద్యార్థి, ఇండో-ఎంఐఎం వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చివుకుల రూ.228 కోట్లు విరాళంగా అందజేశారు. మంగళవారం చెన్నైలోని సంస్థ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని అందించారు. ఈ నిధులతో ఐదు పథకాలను అమలు చేయనున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద విరాళమని ఐఐటీ–మద్రాసు డైరెక్టర్ వి.కామకోటి అన్నారు. ఆయన గౌరవార్థం అకడమిక్ బ్లాక్‌కు కృష్ణ చివుకుల బ్లాక్‌గా పేరు పెట్టినట్టు ప్రకటించారు. ఏపీలోని బాపట్లలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కృష్ణ ఐఐటీ-బాంబే, ఐఐటీ-మద్రాసులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేశారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అమెరికాలో శివ టెక్నాలజీస్, బెంగళూరులో ఇండో-మెటల్ ఇంజక్షన్ మోల్డింగ్ ప్రారంభించారు. ఎందరికో ఉద్యోగాలిచ్చారు.

బంగ్లా పరిణామాలు ఆందోళనకరం

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం

పార్లమెంట్‌లో ఎస్.జైశంకర్ ప్రకటన

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హింసాకాండ నేపథ్యంలో అక్కడి మైనార్టీల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. బంగ్లా పరిణామాలపై ఆయన మంగళవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రకటన చేశారు. ''అక్కడ శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతున్నాం. సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని భద్రతా దళాలను ఆదేశించాం. సోమవారం ఢాకాలో ఆందోళనలు అదుపు తప్పాక షేక్ హసీనా భద్రతాధికారులతో సమావేశమై, రాజీనామాకు నిర్ణయించుకున్నారు. ఆ వెంటనే ఇండియాకు వస్తానంటూ విన్నవించారు. దాంతో ఆమె విజ్ఞప్తిపై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకొని అనుమతించాం'' అని తెలిపారు. అదేసమయంలో షేక్ హసీనా ప్రయాణించే విమానాన్ని అనుమతించాలంటూ బంగ్లాదేశ్ అధికార వర్గాలు విజ్ఞప్తి చేశాయన్నారు. ఆమె సోమవారం సాయంత్రం ఇండియా చేరారని, బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగా ఉందని జైశంకర్ వివరించారు. అక్కడ 19 వేల మంది భారతీయులు ఉండగా, వీరిలో 9 వేల మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల్లో చాలామంది గత నెలలోనే స్వదేశానికి తిరిగి వచ్చారని వెల్లడించారు. భారత్-బంగ్లాదేశ్ మధ్య దశాబ్దాలుగా బలమైన సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. బంగ్లాదేశ్ పరిణామాల విషయంలో భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలకు మద్దతు ఇవ్వాలని విపక్షాలను కోరారు.



జైశంకర్

హసీనాకు సాయం అందిస్తాం

అఖిలపక్ష సమావేశంలో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి, మన దేశానికి చేరుకున్న షేక్ హసీనాకు భారత ప్రభుత్వం తరఫున అన్ని విధాలా తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. వివిధ అంశాలపై తమతో మాట్లాడేందుకు, భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకొనేందుకు ఆమెకు తగినంత సమయం ఇస్తామన్నారు. దిగ్భ్రాంతి నుంచి హసీనా ఇంకా కోలుకోలేదని వివరించారు. బంగ్లాదేశ్ పరిణామాలపై చర్చించేందుకు మంగళవారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో నిర్వహించారు.అఖిలపక్ష భేటీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సహా వివిధ పార్టీల నేతలు అడిగిన ప్రశ్నలకు జైశంకర్ సమాధానమిచ్చారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అశాంతి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందా? అని పలువురు నాయకులు అడిగారు. విదేశీ శక్తుల ప్రమేయాన్ని కొట్టిపారేయలేమని జైశంకర్ బదులిచ్చారు పొరుగుదేశంలో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందని, అక్కడ రోజురోజుకీ మారిపోతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మైనార్టీలను, మైనార్టీల ఆస్తులు, వ్యాపారాలను నిరసనకారులు లక్ష్యంగా చేసుకుంటున్నారని వెల్లడించారు. అఖిలపక్ష భేటీలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ అంశంపై భారత ప్రభుత్వానికి తమపూర్తి మద్దతు ఇస్తున్నామని స్పష్టంచేశారు.



మంగళవారం పార్లమెంటు మకరద్వారం వద్ద రాహుల్, శరద్‌పవార్ తదితర విపక్ష సభ్యుల నిరసన

ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీని ఎత్తివేయండి

పార్లమెంట్ మకర ద్వారం వద్ద 'ఇండియా' పక్షాల నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీ రద్దు డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి నేతలు మంగళవారం పార్లమెంట్ మకర ద్వారం నిరసన చేపట్టారు. 'పన్ను ఉగ్రవాదం' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఎన్సీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన(ఉద్ధవ్), తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం ఎంపీలు పాల్గొన్నారు. ఆరోగ్య రంగంపై జీఎస్టీ ప్రజలపై పెను భారమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు నష్టపోతున్నారన్నారు. జీఎస్టీతో బాధితుల కష్టాలు రెట్టింపవుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ చెప్పారు. ఇండియా కూటమి ఎంపీల నిరసనపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ హౌస్ ప్రవేశ ద్వారం వద్ద నిరసనలు, నినాదాలు నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ప్రవేశ ద్వారం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదన్న నిర్ణయానికి కట్టుబడతామని సభ్యులంతా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ కింద రూ.8,263 కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించింది.

బ్రిటన్ నిరాకరణ!

మరికొద్ది రోజులు భారత్‌లోనే హసీనా • పరిశీలనలో గల్ఫ్ దేశాలు, ఫిన్లండ్

న్యూఢిల్లీ/లండన్: బంగ్లాదేశ్ తాజా మాజీ ప్రధాని షేక్ హసీనాకు రాజకీయ ఆశ్రయం కల్పించేందుకు బ్రిటన్ వెనకాడుతున్నట్టు తెలుస్తోంది. దాంతో ఆమె ఇతర అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరికొంతకాలం ఆమె భారత్‌లోనే ఉండనున్నారు. రిజర్వేషన్ల రగడ శ్రుతి మించి పరిస్థితి చేయి దాటిపోవడంతో సోమవారం మధ్యాహ్నం ఆమె రాజీనామా చేసి సోదరి షేక్ రెహానాతో కలిసి ఢిల్లీ చేరుకోవడం తెలిసిందే. తాత్కాలిక ఆశ్రయం నిమిత్తం వీలైనంత త్వరగా లండన్ వెళ్లాలని భావించారు. కానీ బంగ్లాతో తాజాగా చెలరేగిన హింసాకాండకు బాధ్యురాలిగా హసీనాపై విచారణ జరిగే పక్షంలో ఆమెను స్వదేశానికి అప్పగించకుండా చట్టపరమైన రక్షణ కల్పించలేమని బ్రిటన్ సంకేతాలిచ్చింది. తాజా హింసాకాండపై ఐరాస సారథ్యంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని బ్రిటన్ ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో యూఏఈ, ఖతర్, సౌదీ అరేబియాతో పాటు బెలారస్ వంటి దేశాలకు వెళ్లే అవకాశాలను హసీనా పరిశీలిస్తున్నట్టు సమాచారం. తన కుటుంబ సభ్యులున్న ఫిన్లండ్ వెళ్లే ఆలోచన కూడా ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం హసీనా, రెహానా ఢిల్లీలోనే రహస్య ప్రాంతంలో ఉన్నారు. రెహానాకు బ్రిటన్ పౌరసత్వముంది. ఆమె కూతురు తులిప్ సిద్దిఖ్ బ్రిటన్‌లో అధికార లేబర్ పార్టీ ఎంపీ కూడా.

దేశం వీడే ముందు...

హసీనా రాజీనామా చేసి బంగ్లాదేశ్‌ను వీడేముందు జరిగిన నాటకీయ పరిణామాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆమె సోమవారం ఉదయం ఢాకాలో తన అధికారిక నివాసంలో త్రివిధ దళాధిపతులు, ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఆందోళనలను అదుపు చేయలేకపోతున్నారంటూ ఆగ్రహించారు. పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. ఆ దశ ఎప్పుడో దాటిపోయిందని వారు బదులిచ్చారు. అధికారం వీడేలా హసీనాను ఒప్పించేందుకు నాలుగు గంటల పాటు ప్రయత్నించారు. రాజీనామా చేసి దేశం వీడటమే మార్గమని చెల్లెలు రెహానాతో కూడా చెప్పించారు. అదే సమయంలో విద్యార్థులు, యువకులు కర్ఫ్యూను ధిక్కరించి మరీ ప్రధాని అధికార నివాసాన్ని ముట్టడించేందుకు దేశ చరిత్రలోనే కనీవినీ ఎరగని సంఖ్యలో ఢాకా వీధుల గుండా పోటెత్తసాగారు. దాంతో, ''పరిస్థితి చేయి దాటుతోంది. గంటలోపే జనప్రవాహం వచ్చిపడొచ్చు, 45 నిమిషాల్లో సర్వం సర్దుకుని దేశం వీడా'లంటూ హసీనాకు సైనిక ఉన్నతాధికారులు స్పష్టం చేశారు! విదేశాల్లో ఉన్న కుమారుడు కూడా ఫోన్లో అదే మాట చెప్పిన మీదట ఆమె అంగీకరించారు. ప్రజలనుద్దేశించి చివరగా సందేశమివ్వాలని భావించినా, అంత సమయం లేదని అధికారులు చెప్పడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. సోదరితో కలిసి ఇంటి ఆవరణలో సిద్ధంగా ఉన్న హెలికాప్టర్ ఎక్కారు. అధ్యక్ష నివాసం చేరుకుని ఆయనకు లాంఛనంగా రాజీనామా సమర్పించారు. హుటాహుటిన విమానాశ్రయం చేరుకుని, సిద్ధంగా ఉన్న సైనిక రవాణా విమానమెక్కి దేశం వీడారు.



హమాస్ కొత్త చీఫ్‌గా యాహ్యా సిన్వర్



బీరుట్: గాజా స్ట్రిప్‌లో పాలస్తీ నియన్ల హక్కుల కోసం పోరాడుతున్న తమకు నూతన సారథిగా యాహ్యా సిన్వర్ వ్యవహరిస్తారని హమాస్ మంగళవారం ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై హమాస్ మెరుపుదాడికి సిన్వరే సూత్రధారి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నాటి మెరుపుదాడిలో 1,200 మందిని చంపేసిన హమాస్ మిలిటెంట్లు.. 250 మంది ఇజ్రాయెల్ పౌరులను కిడ్నాప్‌చేసి బందీలుగా గాజా స్ట్రిప్‌కు తీసుకెళ్లడం తెల్సిందే. గత వారం ఇరాన్‌లోని టెహ్రాన్ నగరంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొని అతిథి గృహానికి విచ్చేసిన హమాస్ రాజకీయ విభాగ చీఫ్ ఇస్మాయెల్ హనియాను గదిలో బాంబు పెట్టి ఇజ్రాయెల్ నిఘా దళాలు హతమార్చిన విషయం విదితమే. దీంతో హమాస్ తమ మరో సీనియర్ నేత అయిన యాహ్యా సిన్వర్‌ను చీఫ్‌గా ఎంపిక చేసింది. గతేడాది అక్టోబర్ 7 మెరుపుదాడి తర్వాత సిన్వర్ ఇంతవరకు బాహ్య ప్రపంచానికి కనిపించలేదు.

రాష్ట్రపతి ముర్ముకు ఫిజీ పౌర పురస్కారం

సువా: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఫిజీ ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'తో గౌరవించింది. రెండు రోజుల పర్యటనకుగాను ఫిజీ వెళ్లిన రాష్ట్రపతి ముర్ము మంగళవారం ఆ దేశ పార్లమెంట్‌నుద్దేశించి ప్రసంగించారు. భారత్, ఫిజీల మధ్య కొనసాగుతున్న సన్నిహిత సంబంధాలపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అత్యున్నత పౌర పురస్కారం అందుకోవడం రెండు దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలకు తార్కాణమని పేర్కొన్నారు. ఫిజీ మరింత బలోపేతమయ్యేందుకు, అభివృద్ధి దిశగా సాగేందుకు భారత్ తోడుగా నిలుస్తుందని వెల్లడించారు. భారత్ ప్రారంభించనున్న ప్రాజెక్టుల్లో ఒకటైన రాజధాని సువాలోని స్పెషాలిటీ కార్డియాలజీ హాస్పిటల్ ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తుందని ఆమె అన్నారు. 'ఫిజీ అధ్యక్షుడు రటు విలియమ్ మైవలిలి కటొనివెరె మంగళవారం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'తో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును గౌరవించారు'అని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఒక్క రోజు నా కుర్చీలో కూర్చోండి

- అప్పుడు మా ఒత్తిడి తెలుస్తుంది
- కేసు త్వరగా విచారించాలన్న లాయర్‌పై సీజేఐ ఆగ్రహం

న్యూఢిల్లీ: కేసును వాయిదా కంటే వారం ముందే కేసును విచారించాలని పదేపదే అభ్యర్థిస్తున్న న్యాయవాదిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసుల విచారణ ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తన స్థానంలో కూర్చుంటే తెలుస్తుందని సదరు లాయర్‌తో సీజేఐ వ్యాఖ్యానించారు.

కోపమెందుకొచ్చింది?

మహారాష్ట్రలో శివసేన పార్టీని చీల్చిన ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన చీలికవర్గమే అసలైన పార్టీ అని మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఎన్సీపీని చీల్చిన డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్సీపీ పార్టీ అంటూ నర్వేకర్ ఇచ్చిన మరో ఉత్తర్వును సవాల్‌చేస్తూ శరద్ పవార్ వర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులను జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఇటీవల విచారించింది. ఈ విషయంలో స్పందన తెలపాలని అజిత్, ఆయన వర్గం 40 మంది ఎమ్మెల్యేలకు కోర్టు నోటీసులిచ్చింది.



అయితే స్పందన తెలిపేందుకు మూడు వారాల గడువు కావాలని అజిత్‌పవార్ తరఫు సీనియర్ న్యాయవాది ఎన్‌కే కౌల్ మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. మూడు వారాలకు బదులు కేవలం 10 రోజుల సమయం ఇస్తామని న్యాయస్థానం తెలిపింది. ఇందుకు శివసేన తరఫు లాయర్ ససేమిరా ఒప్పుకోలేదు. సంబంధిత పత్రాల సమర్పణకు 2, 3 రోజులు సరిపోతాయని ఆ 2–3 రోజుల తర్వాత వెంటనే కేసును విచారణకు స్వీకరించాలని ఆయన పదేపదే సీజేఐను కోరారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో ఈ విషయం త్వరగా తేలాల్సిన ఆవశ్యకత ఉందని వాదించారు. దీంతో సీజేఐ ఆగ్రహించారు. '' మాకు ఆదేశాలు ఇవ్వాలని చూడకండి. ఒక్కరోజు నా కుర్చీలో కూర్చొని కేసుల తదుపరి విచారణ తేదీలను నిర్ణయించండి చూద్దాం. అదెంత విపరీతమైన పని ఒత్తిడితో కూడుకున్న పనో మీకే తెలుస్తుంది. ఒక్కసారి ఇక్కడికొచ్చి కూర్చోండి. ఒత్తిడి దెబ్బకు బ్రతుకుజీవుడా అని పారిపోవడం ఖాయం'' అని సీజేఐ అన్నారు.

నా రన్నింగ్‌మేట్ వాల్జ్

ప్రకటించిన డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున ఉపాధ్యక్ష అభ్యర్థి(రన్నింగ్‌మేట్)గా టిమ్ వాల్జ్‌ను ఎంపికచేస్తున్నట్లు ఆ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం టిమ్ మిన్నెసొటా గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈయన అభ్యర్థిత్వాన్ని డెమొక్రటిక్ పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. '' గవర్నర్‌గా, కోచ్‌గా, టీచర్‌గా, సాయుధ బలగాల్లో ఎన్నో విధాలుగా శ్రామికవర్గ కుటుంబాల కోసం ఆయన పనిచేశారు. అలాంటి టిమ్ వాల్జ్‌ను రన్నింగ్‌మేట్‌గా ఎంచుకున్నందుకు గర్వంగా ఉంది'' అని 'ఎక్స్'లో కమలా హారిస్ పోస్ట్‌చేశారు. గెలిస్తే మిన్నెసొటా నుంచి ఉపాధ్యక్షుడైన మూడో వ్యక్తిగా టిమ్ నిలుస్తారు.

కమల అభ్యర్థిత్వం అధికారికంగా ఖరారు

కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం అధికారికంగా ఖరారైంది. పార్టీ నేషనల్ కన్వెన్షన్ ప్రతినిధుల ఐదు రోజుల ఆన్‌లైన్ బ్యాలెట్ రోల్‌కాల్ ఓటింగ్ సోమవారం రాత్రి ముగిశాక ఆమె నామినేషన్ అధికారికంగా ఖరారైంది. అధికారికంగా నామినేషన్ పొందాలంటే కనీసం 1,976 డెలిగేట్ల ఓట్లు సాధించాలి. అయితే ఏకంగా 99 శాతం మంది డెలిగేట్లు అంటే 4,567 మంది డెలిగేట్లు కమలకే ఓటువేయడం గమనార్హం. ఇక లాంఛనమైన రోల్‌కాల్ ఆగస్టులో చికాగోలో పార్టీ నేషనల్ కన్వెన్షన్‌లో జరగనుంది.

బ్రిటన్‌లో 'వలస' రగడ తీవ్రతరం

లండన్: ప్రశాంత బ్రిటన్ భగ్గుమంది. సముద్ర మార్గం ద్వారా బ్రిటన్‌లోకి అక్రమంగా ముస్లింల వలసలు పెరిగాయంటూ కొనసాగుతున్న మితవాద గ్రూపుల ఆందోళనలు ఒక్కసారిగా పెల్లుబికాయి. యూకేలోని పలు నగరాలు, పట్టణాల్లో నిరసనలు ఎక్కువయ్యాయి. ముస్లిం శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న మసీదులు, హోటళ్లు, రెస్టారెంట్లను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. పలు ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేసి నిప్పంటించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇప్పటికే 400 మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. మరో 100 మందిపై కేసులు నమోదుచేశారు. బెల్ఫాస్ట్ సిటీలో జరిగిన విద్వేష దాడిలో తీవ్రంగా గాయపడిన 50 ఏళ్ల వ్యక్తి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. సమాజంలో విద్వేషం పెంచుతున్న నిరసనకారులపై ఉగ్రవాద చట్టాల కింద అభియోగాలు నమోదుచేస్తామని బ్రిటన్ హోంశాఖలోని పబ్లిక్ ప్రాసిక్యూషన్స్ విభాగ డైరెక్టర్ స్టీఫెన్ పార్కిన్‌సన్ హెచ్చరించారు. అరెస్టులతో జైళ్లు నిండిపోతాయన్న ఉద్దేశంతో ముందు జాగ్రత్తగా జైళ్ల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 600 తాత్కాలిక కారాగారాలను నిరసనకారుల కోసం సిద్ధంచేస్తున్నారు. మరోవైపు చిన్న నేరాలకు శిక్ష అనుభవిస్తున్న దోషులను త్వరగా విడుదలచేయాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. గృహ హింస, అత్యాచార, లైంగికవేధింపుల కేసుల దోషులు, యావజ్జీవ ఖైదీలుమినహా నాలుగేళ్లలోపు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడిచిపెట్టనున్నారు.



మిడిల్స్‌బరోలో నిరసనకారులు కారుకు నిప్పుపెట్టిన దృశ్యం

చిన్నారుల మరణంతో మొదలై..

జూలై 29న సౌత్‌పోర్ట్ ముగ్గురు తొమ్మిదేళ్లలోపు చిన్నారులను ఓ 17 ఏళ్ల బాలుడు డ్యాన్స్ క్లాస్‌లో బ్లేడుతో దాడిచేసి చంపేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నిందితుడు రువాండాకు చెందిన ముస్లిం అని, గతేడాది అక్రమంగా బ్రిటన్‌కు వలసవచ్చాడని ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పుకార్లు పుట్టించారు. దాంతో ముస్లింల అక్రమ వలసలను గట్టిగా వ్యతిరేకించే మితవాద సంస్థల సభ్యులు వందలాదిగా రోడ్లపైకొచ్చి ఆందోళనలను ఉధృతం చేశారు.



ప్రేమజంటలే లక్ష్యంగా...
కేబీఆర్ పార్కులో ప్రేమజంటలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇంటర్‌సెప్టార్ పెట్రోలింగ్ వెహికల్ హోంగార్డును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. -8లో



చిక్కడానికి ముందు..
దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో మరణశిక్ష పడి తప్పించుకున్న ఇండియన్ ముజాహిదీన్(ఐఎం) ఉగ్రవాది ఎజాజ్ సయీద్ షేక్ వ్యవహారంలో మరో ఆసక్తికర కోణమూ ఉంది. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
31.0/24.0
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంది. గరిష్ఠం 31, కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉంది.

ఓఆర్ఆర్‌పై ఇబ్బందులుంటే ఫోన్ చేయండి

'గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే' హెల్ప్‌లైన్ నంబర్లు 14449/18005996699

సాక్షి, సిటీబ్యూరో: వర్షాల వల్ల ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)పై తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనచోదకుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు 'గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే'సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 158 కి.మీ. పొడవైన ఓఆర్ఆర్‌పై వర్షపునీరు డ్రైన్లు, వెంట్స్ శుభ్రం చేయడం, ప్రధాన డ్రైనేజీ ఆర్టరీస్‌ను డిస్లిటింగ్ చేయడం, పోర్టబుల్ వాటర్ పంపులను ఇన్‌స్టాల్ చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు సంస్థ డైరెక్టర్ ఆర్ఎస్ శర్మ తెలిపారు. వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే హెల్ప్‌లైన్ నంబర్లు 14449 /1800 599 6699లలో సంప్రదించవచ్చని, ఔటర్‌పై ఎలాంటి ఇబ్బంది తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు తమ బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్, పోలీస్ తదితర ప్రభుత్వ విభాగాల సహాయ సహకారాలను తీసుకోనున్నట్లు తెలిపారు.

పాలివ్వలేకపోతున్న తల్లులు 35 శాతం

హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా తల్లులుగా మారిన వారిలో 35 శాతం మంది పాలు ఇవ్వలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్ఎఫ్) నిర్వహించిన అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. పాతబస్తీలో ఏర్పాటు చేసిన 5 ల్యాక్టేషన్ సెంటర్ల వ్యాప్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. దీని ప్రకారం కొత్తగా తల్లయిన వారిలో అనేకమంది నవజాత శిశువులకు పాలు పట్టలేకపోతున్నారు. వీరిలో 35 శాతం మంది చనుబాలు ఇవ్వలేకపోతున్నారని తేల్చింది. వీరిలో సగం మంది రకరకాల కారణాల వల్ల పాలివ్వలేకపోతుండగా, 30 శాతం మంది పలు రకాల అనారోగ్య సమస్యలు, మరో 20 శాతం మంది తరచు గర్భం దాల్చడం వల్ల పాలివ్వలేకపోతున్నారని హెచ్‌హెచ్ఎఫ్ నిర్వాహకులు ముజ్తాబా హసన్ అస్కారీ వివరించారు.

సాంకేతికాభివృద్ధికి పరిశోధనాకేంద్రాలు ఉపయోగపడాలి

డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి

జవహర్‌నగర్: నైపుణ్యాభివృద్ధి, దేశీయ సాంకేతిక అభివృద్ధి, దేశ భద్రతా సామర్థ్యాలను పెంచడానికి బిట్స్ పిలానీ, సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఇన్ నేషనల్ సెక్యూరిటీ(సీఆర్ఇఎన్ఎస్) సంస్థలు సమగ్ర దృష్టి సారించడం అభినందనీయమని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. సాంకేతికాభివృద్ధికి పరిశోధనా కేంద్రాలు ఉపయోగపడాలన్నారు. మంగళవారం బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో సీఆర్ఇఎన్ఎస్ పరిశోధన విశిష్టత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ చొరవతో డీఆర్‌డీవో, ఇస్రో, డీపీఈ, త్రి సర్వీసెస్, పోలీస్ సహకారంతో జాతీయ భద్రతా డొమైన్ విభాగాలు, రక్షణ పీఎస్‌యూ, పరిశ్రమలు విజయవంతమవుతాయని అన్నారు. దేశ వ్యూహాత్మక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ వి.రాంగోపాల్‌రావు మాట్లాడుతూ జాతీయ భద్రతా డోమైన్‌లోని నిపుణుల నైపుణ్యాలను మెరుగుపర్చడానికి హైబ్రీడ్ కోర్సులు దోహదపడుతాయని అన్నారు. ఈ సమావేశంలో డిఫెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ నారాయణమూర్తి, నేవీ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ ఏవీఎస్ఎం, వీఎస్ఎం సర్జన్ అడ్మిరల్ ఆర్టీసారిన్, వీఎస్ఎం అదనపు డైరెక్టర్ జనరల్, ఆర్మీ డిజైన్ బ్యూరో మేజర్ జనరల్ సీఎస్ మాన్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్, బిట్స్ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ సౌమ్యాముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ వేదికపై నగర విద్యార్థుల ఆవిష్కరణ

గ్రాండ్‌ప్రైజ్‌ను సొంతం చేసుకున్న 'లీప్ రోబోట్స్'



లక్డీకాపూల్: ఫార్మింగ్ మెథడ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆచరణాత్మకంగా వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు సరికొత్త రోబోను రూపొందించారు కూకట్‌పల్లికి చెందిన లీప్ రోబోట్స్ సంస్థ విద్యార్థులు. నగర విద్యార్థులు తమ అసాధారణ ప్రతిభతో 'సేవ్ ది ఎర్త్'అంశంపై ఆవిష్కరించిన క్రియేటివ్ డిజైన్ అంతర్జాతీయ వేదికపై శెభాష్ అనిపించుకుంది. ఇటీవల దక్షిణ కొరియాలోని డైజియన్ వేదికగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యువ రోబోట్ పోటీ(ఐవైఆర్‌సీ) వినూత్న రోబోలకు కేంద్రంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ మేధావులను సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణాత్మక సమస్యల పరిష్కార సామర్థ్యాలను ప్రదర్శించేందుకు ఐవైఆర్‌సీ ఆహ్వానించింది. ఈ పోటీల్లో 20 దేశాల నుంచి వెయ్యిమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ గ్లోబల్ వేదికపై లీప్ రోబోట్స్ సంస్థ విద్యార్థులు రూపొందించిన రోబోలు జూనియర్, సీనియర్ క్రియేటివ్ డిజైన్ విభాగాలలో గ్రాండ్ ప్రైజ్‌ను సొంతం చేసుకోవడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో మన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చుతున్నారనడానికి ఈ ప్రైజ్ నిదర్శనమని లీప్ రోబోట్ సంస్థ సీఈఓ సత్యనారాయణ మేకల అన్నారు.





ట్రా'ఫికర్' మంగళవారం నగరంలోని మూసాపేట ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా స్తంభించాయి. ట్రా'ఫికర్'తో వాహన చోదకులు అసహనానికి గురయ్యారు. రణగొణ ధ్వనుల మధ్య చాలాసేపు రోడ్డుపైనే గడపాల్సి వచ్చింది.



- 5.5 కి.మీ. నుంచి 7.5 కి.మీ. వరకు పొడిగింపు
- సీఎం అమెరికా పర్యటన అనంతరం డీపీఆర్ అప్పగింత
- దసరా నాటికి పనులు ప్రారంభించే అవకాశం

ఓల్డ్ సిటీ..
నయా డీపీఆర్

పాతబస్తీ మెట్రోరైల్‌కు ఇక రూట్ క్లియర్!

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో రైల్ మార్గానికి కొత్త డీపీఆర్ సిద్ధమైంది. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న 5.5 కిలోమీటర్ల కారిడార్‌ను మరో రెండు కిలోమీటర్ల మేర పొడిగించి తాజాగా చాంద్రాయణగుట్ట వరకు కొత్త డీపీఆర్‌ను అధికారులు రూపొందించారు. దీంతో ఈ మెట్రోరూట్ 7.5 కిలోమీటర్లకు పెరిగింది. మెట్రో మొదటి దశలోనే ఎల్అండ్‌టీ సంస్థ ఓల్డ్ సిటీ రూట్‌ను పూర్తి చేయాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల అది నిలిచిపోయిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రెండోదశలో భాగంగా ఓల్డ్‌సిటీ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మొదటి దశలోని 5.5 కిలోమీటర్లను కూడా రెండోదశలో విలీనం చేసింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు హయత్‌నగర్, పటాన్ చెరు, నూతన హైకోర్టు భవనం, అమెరికన్ కాన్సులేట్, కోకాపేట్ తదితర ప్రాంతాలకు మెట్రో సేవలను అందుబాటులోకి తెచ్చేవిధంగా 78.4 కిలోమీటర్లతో రెండోదశకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో మొదటగా 7.5 కిలోమీటర్ల పాతబస్తీ రూట్‌ను పూర్తి చేసి ఆ తరువాత ఎయిర్‌పోర్టు, హయత్‌నగర్ తదితర మార్గాల్లో మెట్రో నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు అనుగుణంగానే ఓల్డ్‌సిటీ మెట్రో డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను రూపొందించినట్లు సమాచారం. అమెరికా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తిరిగి వచ్చిన అనంతరం హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ఈ డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందజేయనున్నారు.



పరిహారం చెల్లించడమే ప్రధానం..

పాతబస్తీ డీపీఆర్‌కు కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే దసరా నాటికి పనులు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు తెలిపారు. అయితే ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు అలైన్‌మెంట్‌లోని నిర్మాణాలను తొలగించి పరిహారం చెల్లించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. ఈ రూట్‌లో దారుల్‌షిఫా జంక్షన్ నుంచి షాలిబండ జంక్షన్ వరకు మొత్తం 21 మసీదులు, 12 దేవాలయాలు, 12 అషూర్ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశానవాటికలు, మరో 6 చిల్లాలతోసహా మొత్తం 108 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. చాంద్రాయణగుట్ట వరకు అలైన్‌మెంట్ పొడిగించిన దృష్ట్యా తొలగించాల్సిన జాబితాలో మరిన్ని నిర్మాణాలు కొత్తగా చేరే అవకాశం కూడా ఉంది. మరోవైపు చాలావరకు మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకే రోడ్డు విస్తరణను కొన్నిచోట్ల 100 అడుగులకు బదులు 80 అడుగుల వరకే కుదించారు. మెట్రో మొదటి దశలో భాగంగా 2012లోనే ఈ ప్రాజెక్టు పనులు చేపట్టాల్సి ఉండగా 12 ఏళ్లపాటు కాలయాపన జరిగింది. దీంతో నిర్మాణం వ్యయం కూడా భారీగా పెరిగినట్లు అంచనా. ఫలితంగా పెద్ద మొత్తంలో పరిహారాలు చెల్లించాల్సి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. 7.5 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టు వ్యయం రూ.2,500 కోట్లు దాటవచ్చని పేర్కొంటున్నారు. ఆస్తులు కోల్పోయినవారికి పరిహారం చెల్లించడంతోపాటు అవసరమైన చోట్ల రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

ముచ్చర్ల వరకూ పొడిగిస్తారా..

మెట్రో రెండోదశలో ఎయిర్‌పోర్టు వరకు నిర్మించనున్న మార్గాన్ని ముచ్చర్ల వరకు పొడిగించి అలైన్‌మెంట్ ఖరారు చేస్తే బాగుంటుందని రవాణా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నాలుగో నగరంగా ముచ్చర్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తున్న దృష్ట్యా ఇందులో భాగంగానే మెట్రోపై కూడా దృష్టి సారించాలని సూచిస్తున్నారు. రెండోదశలో ఎయిర్‌పోర్టు వరకు ఇప్పటికే ప్రతిపాదనలు ఉన్నాయి. అక్కడి నుంచి మరో 28 కిలోమీటర్లు పొడిగిస్తే ముచ్చర్ల వరకు మెట్రో రైల్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఈ మేరకు రెండు ప్రతిపాదిత మార్గాలపై అధికారులు దృష్టి సారించారు. అయితే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తుక్కుగూడ, కొంగర కలాన్, తిమ్మాపూర్, ఎలిమినేడు, పంజాగూడ రూట్‌లో ముచ్చర్ల వరకు ఒక మార్గం, కొంగర కలాన్ నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, మీర్‌పేట్ మీదుగా ముచ్చర్లకు మరో మార్గంపై ప్రతిపాదనలు ఉన్నాయి. 'నాలుగో నగర నిర్మాణంలో భాగంగానే మెట్రో అలైన్‌మెంట్‌ను కూడా నిర్ధారిస్తే ప్రాజెక్టు వ్యయం తక్కువయ్యే అవకాశం ఉంది. నగర నిర్మాణం పూర్తయిన తరువాత భవిష్యత్‌లో మెట్రో కట్టాలనుకొంటే అలైన్‌మెంట్ ఖరారుతోపాటు నిర్మాణాల తొలగింపు, పరిహారాల చెల్లింపు వంటి ఇబ్బందులు తలెత్తవచ్చు'అని ఒక అధికారి వివరించారు. దీంతో ప్రాజెక్టు వ్యయం కూడా భారీగా పెరుగుతుందని చెప్పారు.

ఈ మార్గంలో అలైన్‌మెంట్..

దారుషిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీజా కోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా– చాంద్రాయణగుట్ట మార్గంలో ఈ అలైన్‌మెంట్ ఉంటుంది. ఈ మెట్రోరైల్ మార్గంలో ఎంజీబీఎస్ తరువాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. చాంద్రాయణగుట్ట వద్ద అమీర్‌పేట్ తరహాలో అతి పెద్ద ఇంటర్‌చేంజ్ స్టేషన్ ఏర్పాటు చేస్తారు.

వాటర్ లైన్‌మెన్ల దందాకు చెక్!

- మొబైల్ ద్వారానే వాటర్ వాల్వ్‌ల ఓపెన్, క్లోజ్
- సెన్సర్‌లు అధికారుల మొబైల్‌కు అనుసంధానం
- సరఫరా అవుతున్న నీటినాణ్యత గుర్తింపు
- సనత్‌నగర్ జేకే కాలనీలో పైలెట్ ప్రాజెక్టు
- ఇక డివిజన్లవారీగా అమలుకు జలమండలి సన్నాహాలు

ఆటోమెటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్‌ల ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో జలమండలి లైన్‌మెన్ల చేతివాటానికి చెక్ పడనుంది. పైప్‌లైన్ల సాధారణ వాల్వ్‌లకు బదులు ఆటోమెటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్‌లు అందుబాటులో రానున్నాయి. వాల్వ్ సెన్సర్ సంబంధిత లైన్‌మెన్, ఉన్నతాధికారుల మొబైల్‌తోపాటు వాటర్ బోర్డు డాష్‌బోర్డుకు అనుసంధానం కారణంగా నీటి సరఫరా, సమయం, నాణ్యత ఎప్పటికప్పుడు బహిర్గతం కానుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా సనత్‌నగర్ జేకే కాలనీలో ఆటోమెటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్‌లను ఏర్పాటు చేసి అమలు చేస్తున్నారు. వాటర్ లైన్‌మెన్లు వాల్వ్‌ల వద్దకు వెళ్లకుండానే మొబైల్ ద్వారా వాటిని ఆపరేట్ చేసేవిధంగా సరికొత్త సాంకేతికతతో స్మార్ట్ వాటర్ రూపొందించారు. దీనికి సోలార్ ప్యానళ్లు అమర్చి మొబైల్స్‌కు అనుసంధానిచ్చారు. జేకే కాలనీలో ఆటోమెటిక్ స్మార్ట్ వాల్వ్‌లు సత్ఫలితాలు ఇస్తుండటంతో ఇక డివిజన్లవారీగా ఈ విధానం అమలుకు జలమండలి సన్నాహాలు చేస్తోంది



పక్కాగా తేలనున్న నీటి సరఫరా

ఆటోమెటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్ ద్వారా నీటి సరఫరా పక్కాగా తేలనుంది. వాటర్ లైన్‌మెన్ల తీరుతో నీటి విడుదల సమయ పాలనతో సరిపడా నీరు సరఫరా లేక నగరవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవంగా కొన్ని ప్రాంతాలకు సరిపడా నీరు, మరి కొన్ని ప్రాంతాలకు లో ప్రెషర్‌తో అరకొర నీరు సరఫరా కావడం సర్వసాధారణంగా మారింది. ప్రస్తుతం రోజువారీగా 560 నుంచి 580 ఎంజీడీల వరకు నీరు సరఫరా అవుతున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఇండిపెండెంట్ గృహాలకంటే బహుళ అంతస్తుల భవన సముదాయాలకు, వాణిజ్య, హోటళ్లు గల ప్రాంతాలకు ఎక్కువ సమయం నీటి సరఫరా జరుగుతుందనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. లైన్లమెన్ల చేతి తడిపితే పూర్తిస్థాయి ప్రెషర్‌తో నీరు సరఫరా కావడం నిత్యకృత్యంగా మారింది. జలమండలి కాల్ సెంటర్‌కు ప్రతి నిత్యం లోప్రెషర్‌పై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా పరిష్కారం మాత్రం లభించడం లేదు. దీంతో క్షేత్రస్థాయి సరఫరాపై పూర్తిస్థాయి దృష్టి సారించేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ వాటర్ వాల్వ్ ప్రక్రియను అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

జలమండలి పరిధిలో సుమారు 23 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్లు, 50కిపైగా సెక్షన్లు ఉన్నాయి. మొత్తం మీద తాగునీటి నల్లా కనెక్షన్లు 13.25 లక్షలు కాగా, అందులో సాధారణ గృహావినియోగ కనెక్షన్లు 10.24 లక్షలు, మురికివాడల్లో 2.47 లక్షలు, వాణిజ్య కనెక్షన్లు 52 వేల వరకు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి సెక్షన్‌లోని ఒక్కో ప్రాంతంలో నల్లా కనెక్షన్లపై లైన్‌మెన్లు ఉంటారు. నీటి సరఫరా జరిగే సమయంలో పైప్‌లైన్ వాల్వ్‌లను తిప్పి నీటిని విడుదల చేస్తుంటారు. నిర్ణయించిన మేరకు థ్రెడ్లను తెరవాలి. వాల్వ్ థ్రెడ్లు తిప్పడం బట్టి సరిపడా ప్రెషర్, లో ప్రెషర్‌తో నీటి సరఫరా అవుతోంది. వాస్తవంగా ఆయా లైన్లకు నిర్ణయించిన సమయం వరకూ నీటిని వదలాలి. అనంతరం థ్రెడ్లను మూసివేస్తే సరఫరా ఆగిపోతోంది. అయితే లైన్‌మెన్లు చేతివాటం ప్రదర్శిస్తుండటంతో కొందరికి సరిపడా ప్రెషర్, మరికొందరికి లోప్రెషర్ ద్వారా నీటి సరఫరా అవుతోంది. స్మార్ట్ వాటర్ వాల్వ్‌లు అందుబాటులోకి వస్తే లైన్లమెన్ల ఈ చేతివాటానికి చెక్ పడనుంది.

ఓపెన్ ప్లాట్స్.. హాట్‌స్పాట్స్




దోమల స్వైర విహారం.. ప్రబలుతున్న డెంగీ

- నిర్మాణాల కారణంగా పెరుగుతున్న కేసులు
- జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సర్వేలో వెల్లడి

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఖాళీ ప్లాట్లు, నిర్మాణాల వల్ల డెంగీ కేసులు పెరుగుతున్నాయా? అంటే కాదనలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా డెంగీ డేంజర్ బెల్స్ మోగుతుండటంతో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అప్రమత్తమైంది. ఈ మేరకు నిర్వహించిన సర్వేలో నిర్మాణాలు, ఓపెన్ ప్లాట్లలో దోమల వృద్ధికారక ప్రాంతాల(హాట్‌స్పాట్స్)లు ఎక్కువగా ఉన్నాయి. దోమల వల్లే డెంగీ సోకుతుండటంతో అవి వృద్ధి చెందే సమస్యాత్మక ప్రాంతాలను నిర్మాణప్రాంతాలు, ఫంక్షన్‌హాళ్లు, సెల్లార్లు, ఓపెన్ ప్లాట్లుగా విభజించి సర్వే నిర్వహించారు. తాళం వేసి ఉన్న ఇళ్లను సైతం సర్వేలో లెక్కించారు. ఆ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే అవకాశాలుండటంతో ఆ ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. నిల్వనీటి వల్లే దోమలు వృద్ధి చెందుతుందని ఎంటమాలజీ అధికారులు పేర్కొన్నారు. ఆ లెక్కల మేరకు దోమలు ఎక్కువగా వృద్ధి చెందే హాట్‌స్పాట్లు నిర్మాణప్రాంతాలు, ఓపెన్‌ప్లాట్లలో ఎక్కువగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది.

సర్వే వివరాల మేరకు ఆయా ప్రాంతాల్లో హాట్‌స్పాట్లు జోన్లవారీగా ఇలా ఉన్నాయి

జోన్	నిర్మాణ ప్రాంతాలు	ఫంక్షన్ హాళ్లు	సెల్లార్లు	ఓపెన్ ప్లాట్లు
ఎల్బీనగర్	578	111	213	873
చార్మినార్	732	286	464	520
ఖైరతాబాద్	977	109	1,103	626
సికింద్రాబాద్	985	128	1,102	1,258
శేరిలింగంపల్లి	1,141	51	1,044	1,303
కూకట్‌పల్లి	1,957	82	708	1,577
మొత్తం	6,370	767	4,634	6,157



ఫీవర్ ఇన్ పేషంట్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

'ఫీవర్' కిటకిట

నల్లకుంట: హైదరాబాద్ నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా రోజురోజుకూ పెరుగుతుండడంతో రోగులు వైద్యుల వద్దకు క్యూ కడుతున్నారు. దీంతో గత కొద్దిరోజులుగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, వ్యాధుల బారిన పడుతున్నారు. ఫీవర్ ఆసుపత్రిలో గత నెలలో 17,813 మంది రోగులు ఓపీ విభాగంలో చికిత్స పొందగా, 471 మందిని ఇన్ పేషంట్లుగా చేర్చుకుని వైద్యం అందించారు. కాగా, ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ఓపీ 3,152, ఐపీ రోగులు 67 మంది చికిత్స పొందారు.

16 నుంచి 'ఇన్నోవేషన్ సమ్మిట్'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొ. రెడ్డన్న

సాక్షి, సిటీబ్యూరో: రెండు వందల దేశాలకు ఫార్మా ఉత్పత్తులను, 150 దేశాలకుపైగా వ్యాక్సిన్ సరఫరా చేస్తున్న భారత్.. గ్లోబల్ హెల్త్ మార్కెట్‌లో 3.72 శాతం వాటాను మాత్రమే కలిగి ఉందని 'ద ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్(ఎఫ్ఏబీఏ)'ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రెడ్డన్న తెలిపారు. ఎఫ్ఏబీఏ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించనున్న ఇన్నోవేషన్ సమ్మిట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఉత్పత్తికి తగ్గట్టుగానే అంతర్జాతీయ మార్కెట్‌లో వాటా పొందాలంటే స్టార్టప్స్‌కు ప్రోత్సాహం అందించాలని సూచించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 16 నుంచి 18 తేదీల్లో ఆవిష్కరణల సమ్మేళనం నిర్వహించనున్నామని ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఎంట్రప్రెన్యూర్స్ చైర్మన్ చక్రవర్తి తెలిపారు. ఇందులో భాగంగా డ్రగ్ డిస్కవరీ, డ్రగ్ డెవలప్‌మెంట్ వర్క్ షాప్ నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ వర్సిటీలో దాదాపు 60 నూతన ఆవిష్కరణలు స్టార్టప్స్‌గా రాణిస్తున్నాయని ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబత్ వివరించారు. జాతీయ స్థాయిలో దరఖాస్తు చేసుకున్న వందకుపైగా వినూత్న ఆవిష్కరణల నుంచి ఎంపిక చేసిన 20 ఆవిష్కర్తలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఏబీఏ సీఈఓ డా.జగదీశ్, డా.రత్నాకర్ పాల్గొన్నారు.

జయశంకర్ సార్ సేవలు మరువలేనివి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట



లక్డీకాపూల్: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో తుది వరకు పోరాటం చేసిన వ్యక్తిగా ఆచార్య జయశంకర్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని, తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి జయ శంకర్ సార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు కే.శ్రీవాస్తవ, చంద్రకాంత్‌రెడ్డి, యాదగిరి రావు, అకౌంట్ ఎగ్జామినర్ వేంకటేశ్వరరెడ్డి, సీపీఆర్‌ఓ మహమ్మద్ ముర్తుజా, జేసీ ఎలెక్షన్ మైకేల్ బొస్, పీఆర్‌ఓ విజయలక్ష్మి, ఏఎంసీలు రమణ, జీవన్ కుమార్ ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రేమజంటలే లక్ష్యం..

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న హోంగార్డు అరెస్టు


హోంగార్డు శ్రీనివాస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో ప్రేమజంటలు, స్నేహితులైన యువతీ యువకులను టార్గెట్ చేసి వారిని బెదిరించి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఇంటర్‌సెప్టార్ పెట్రోలింగ్ వెహికల్ హోంగార్డుతో పాటు మరో బ్రోకర్‌ను బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. కేబీఆర్ పార్కు చుట్టూ జీహెచ్ఎంసీ వాక్‌వేలో వాకర్లు, సందర్శకుల భద్రత కోసం ఇంటర్‌సెప్టార్ పెట్రోలింగ్ వాహనాలను ప్రవేశపెట్టి సాయుధులైన పోలీసులను నిఘాలో ఉంచారు. ఇందులో భాగంగా హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చే ఇంటర్‌సెప్టార్ పెట్రోలింగ్ వెహికల్ హోంగార్డు ముద్దం శ్రీనివాస్ (40) పార్కు చుట్టూ వాహనం నడుపుతుంటాడు. ఈ ముసుగులోనే వాక్‌వేలోకే వచ్చే ప్రేమజంటలు, యువతీ యువకులను లక్ష్యంగా చేసుకుని మీరు ఎక్కడి నుంచి వచ్చారు.. మీ స్నేహం గురించి మీ తల్లిదండ్రులకు తెలుసా..? వారి ఫోన్ నంబర్లు ఇవ్వండి అంటూ బెదిరించేవాడు. మే 6వ తేదీన రోడ్డు నంబర్–45 వైపు బాలకృష్ణ ఇంటి ఎదురుగా వాక్ వేలో యువతీ యువకులు కూర్చోగా వారి వద్దకు వెళ్లి మిమ్మల్ని పోలీసులకు పట్టిస్తానంటూ బెదిరించి రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన వద్ద అంత డబ్బు లేదని ఆ యువకుడు ఏడుస్తుండగా ఏటీఎం కార్డు ఉంటే డ్రా చేద్దామంటూ తీసుకువెళ్లడానికి యత్నిస్తుండగా ఆ యువకుడు భయంతో పారిపోతుండగా అప్పుడే వచ్చిన పెట్రోలింగ్ పోలీసులు అడ్డుకుని ఏం జరిగిందని ప్రశ్నించారు. తన స్నేహితురాలితో కలిసి పార్కుకు వచ్చానని, కూర్చొని మాట్లాడుతుండగా శ్రీనివాస్ అనే పోలీసు వచ్చి తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తన వద్ద అంత డబ్బు లేకపోగా భయపడి పారిపోయేందుకు యత్నిస్తున్నానని చెప్పాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు హోంగార్డు శ్రీనివాస్‌పై దోపిడీ కేసు నమోదు చేశారు. యువతీ యువకులు కూర్చొని మాట్లాడుకుంటుంటే వారి వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తెచ్చేలా శ్రీనివాస్ ఓ బ్రోకర్‌ను కూడా నియమించుకున్నాడు. సదరు బ్రోకర్ యాదగిరి వాక్ వేలో తిరుగుతూ అమాయకులైన యువతీ యువకులు కనిపిస్తే వారు ఎక్కడ కూర్చున్నారో ఆ విషయాన్ని హోంగార్డుకు తెలిపేవాడు. ఇలా 10 జంటల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఐపీసీ 393 కింద పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం హోంగార్డు శ్రీనివాస్‌తో పాటు బ్రోకర్‌గా వ్యవహరిస్తున్న యాదగిరిని రిమాండ్‌కు తరలించారు. కొన్నేళ్ల నుంచి ఇక్కడ యువతీ యువకులను వేధిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు చిక్కడానికి ముందు..

రెండుసార్లు ఎస్కేప్!

- 2009 నుంచి ఐఎం ఉగ్రవాదిగా ఉన్న ఎజాజ్ షేక్
- 'ఉగ్ర మెయిల్స్' పంపడంలో ఇతడిది కీలకపాత్ర
- రెండుసార్లు అదుపులోకి తీసుకున్న పుణే ఏటీఎస్
- అతడి స్కెచ్ అతడికే చూపించి గుర్తించమన్న వైనం
- గుర్తు పట్టలేనని చెప్పడంతో వదిలేసిన ఆ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో మరణ శిక్ష పడి, ఢిల్లీలోని జామా మసీదు వద్ద జరిగిన విధ్వంసం కేసులో 'సీడీ' పోవడంతో శిక్ష తప్పించుకున్న ఇండియన్ ముజాహిదీన్(ఐఎం) ఉగ్రవాది ఎజాజ్ సయీద్ షేక్ వ్యవహారంలో మరో ఆసక్తికర కోణమూ ఉంది. ఇతడు 2014లో అరెస్టు అయ్యాడు. దీనికి ముందు రెండుసార్లు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకసారి విచారణ నేపథ్యంలో 'తనను తాను' గుర్తించకలేక పోతున్నట్లు చెప్పి ఎస్కేప్ అయ్యాడు. ఎజాజ్ వ్యవహారం మహారాష్ట్ర పోలీసు విభాగానికే చెంపపెట్టు లాంటిదని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

తొలిసారి వార్నింగ్ ఇచ్చి వదిలేశారు..

మహారాష్ట్రలోని పుణేలో ఉన్న ఘోర్‌పేట్ పేఠ్‌కు చెందిన ఎజాజ్ షేక్ ప్రముఖ బీపీఓ సంస్థలో ఐటీ నిపుణుడిగా ఉంటూనే.. ఐఎం మీడియా సెల్‌లో స్లీపర్ సెల్‌గా పనిచేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న శీత్లా ఘాట్, ఢిల్లీలోని జామా మసీదు, పుణేలోని జర్మన్ బేకరీ విధ్వంసాలకు ముందు ఈ–మెయిల్స్ పంపాడు. 2010 డిసెంబర్ 7న శీత్లాఘాట్ పేలుడు జరిగింది. ఆ సందర్భంలో మోహిసిన్ సంబంధీకుల వివరాలపై ఆరా తీసిన పుణే ఏటీఎస్ అధికారుల దృష్టికి ఎజాజ్ వచ్చాడు. అదే నెల 24న ఎజాజ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించారు. తనకు మోహిసిన్ తెలుసని, తరచూ అతడితో మాట్లాడేవాడినని, కొన్నాళ్ల క్రితం అతడి కారును తీసుకుని వినియోగించానని చెప్పి తప్పుదోవ పట్టించాడు. ఆ కారును మోహిసిన్ ఆదేశాల మేరకు పుణేలోని శివాజీనగర్‌లో ఉన్న టూరిస్ట్ బస్టాప్ వద్ద పార్క్ చేశానని వల్లెవేశాడు. దీంతో ఆ కారు స్వాధీనం చేసుకున్న అధికారులు అతడితో సంప్రదింపులు జరపవద్దంటూ వార్నింగ్ ఇచ్చి మరీ ఎజాజ్‌ను వదిలేశారు.

అతడి స్కెచ్ అతడికే చూపించారు..

ఈ ఉదంతం తర్వాత కూడా ఎజాజ్ ఐఎంలో కొనసాగుతూ తన కార్యకలాపాలు కొనసాగించాడు. శీత్లాఘాట్ పేలుడుకు ముందు ఈ–మెయిల్‌ను ముంబైలోని వాషి ప్రాంతంలో ఉన్న ఓపెన్ వైఫై వినియోగించి పంపాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన యూపీ పోలీసులు సాంకేతిక ఆధారాలను బట్టి ఈ విషయం గుర్తించారు. వారి నుంచి సమాచారం అందుకుని అక్కడకు వెళ్లిన మహారాష్ట్ర ఏటీఎస్ అధికారులు ఓ ఊహాచిత్రం రూపొందించారు. దీనికి, ఎజాజ్ పోలికలకు ఎలాంటి సంబంధం లేదు. ఈ స్కెచ్ ఎవరిదో గుర్తించాలంటూ అప్పట్లో ఏటీఎస్ పోలీసులు అనేక మందిని అడిగారు. నేరచరితులు, అనుమానితులు, ఉగ్రవాద సంబంధీకులను ఏటీఎస్ కార్యాలయానికి పిలిచి అడిగారు. అలా రెండోసారి పోలీసుల వద్దకు వెళ్లిన ఎజాజ్‌కు అతడి స్కెచ్‌నే చూపించి గుర్తించమని కోరారు. అది ఎవరో తనకు తెలియదని, తెలిస్తే వెంటనే సమాచారం అందిస్తానని చెప్పి రెండోసారి తప్పించుకున్నాడు.

నేపాల్ నుంచి తిరిగి వస్తుండగా..

2013 ఫిబ్రవరిలో జరిగిన ఈ రెండో ఎస్కేప్ తర్వాత ఎజాజ్ దేశాన్ని వదిలేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే విదేశాల్లో ఉన్న భత్కల్ బ్రదర్స్‌తో పాటు మోహిసిన్‌కు చాటింగ్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వారి ఆదేశాల మేరకే అక్రమంగా సరిహద్దులు దాటి నేపాల్ చేరుకున్నాడు. మరో ఆపరేషన్ కోసం తిరిగి వస్తూ 2013 సెప్టెంబర్ 6న ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతమైన సహరంగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఢిల్లీ స్పెషల్ సెల్‌కు చిక్కాడు. ఆ అధికారుల విచారణలోనే అప్పటికి ముందు జరిగిన రెండు ఎస్కేప్‌లు వెలుగులోకి వచ్చాయి. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో ఉరిశిక్ష పడిన ఆరుగురు ఉగ్రవాదుల్లో ఎజాజ్ కూడా ఒకడు. వీరిపై వివిధ రాష్ట్రాల్లో ఉన్న కేసుల విచారణ పూర్తయిన తర్వాతే ఈ శిక్ష అమలుకు సంబంధించిన సన్నాహాలు ప్రారంభంకానున్నాయి.

ఔటర్‌పై కారు ఢీకొని వృద్ధుడి మృతి

– కారు అద్దంలో తల ఇరుక్కుని తెగిపడిన మొండెం


అంజయ్య మృతదేహం


ఔటర్‌పై వృద్ధుడి మృతికి కారణమైన కారు

శంషాబాద్ రూరల్: దారితప్పిన వృద్ధుడు ఓఆర్ఆర్‌పై రోడ్డు దాటుతున్నాడు.. ఇదే సమయంలో వేగంగా వచ్చిన కారు అతడిని బలంగా ఢీకొనడంతో ఎగిరి కారుపై పడ్డాడు. దీంతో కారు అద్దంలో వృద్ధుడి తల ఇరుక్కుని మొండెం నుంచి వేరు పడింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడకు చెందిన తోట్ల అంజయ్య(65) నాలుగు రోజుల కిందట ఊట్‌పల్లిలోని సోదరుడు పాపయ్య ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఊట్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి బయలుదేరాడు. నడుచుకుంటూ వెళ్తూ దారి తప్పాడు. తొండుపల్లి వద్ద ఉన్న ఔటర్ రింగురోడ్డు జంక్షన్ నుంచి పైకి చేరుకున్నాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా.. గచ్చిబౌలి నుంచి తుక్కుగూడ వైపు వెళ్తున్న కారు అతడిని బలంగా ఢీకొంది. దీంతో ఎగిరి పడటంతో తల అద్దంలో ఇరుక్కుపోయింది. కారు వేగంతో ముందుకు వెళ్లడంతో తల నుంచి మొండెం వేరు పడింది. డ్రైవర్ వెంటనే కారు ఆపి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు

చైతన్యపురి: రాఖీ పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు హైదరాబాద్ -2 డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 17వ తేదీ రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం 19వ తేదీ మధ్యాహ్నం బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటుందని వివరించారు. ఒక్కొక్కరికి రానుపోనూ రూ.3,600 చార్జి వసూలు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్: 99592 26249/93465 59649/96663 50995 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని వక్ఫ్‌భూములు, ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన వక్ఫ్ భూముల రక్షణ, సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ భూముల వివరాలను ప్రోహిబిటెడ్ ఆర్డర్ బుక్(పీఓబీ)లో నమోదు చేయాలని సూచించారు. మండల, డివిజన్, సర్కిల్ వారీగా గుర్తించి వారంలోగా డేటా సమర్పించాలని ఆదేశించారు. ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో 1,785 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నట్లు బోర్డు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, రెవెన్యూ డివిజన్ అధికారులు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, జీహెచ్ఎంసీ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, అడిషనల్ డీసీపీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పల బాధతో సినిమా డైరెక్టర్ ఆత్మహత్య


జానయ్య(ఫైల్)

మూసాపేట: అప్పుల బాధ తట్టుకోలేక ఓ డైరెక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట గ్రామానికి చెందిన జానకిరాం(జానయ్య)(44) దాదాపు 25 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉంటున్నాడు. 2021లో జీయస్‌టీ చిత్రానికి దర్శకత్వం వహించాడు. అవకాశాలు రాకపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. జానయ్య పక్క ఊర్లో ఉండే మరో వ్యక్తితో ఆర్థిక లావాదేవీలు జరిగి ఇబ్బందులు రావడంతో నెల రోజుల నుంచి డబ్బుల కోసం ఎదురుచూశాడు. ఎంతకూ డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో మనస్థాపంతో కేపీహెచ్‌బీ కాలనీలో ఓయో రూం అద్దెకు తీసుకొని ఫ్యాన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే రూమ్ తీసుకున్న సమయం గడిచినా బయటకు రాకపోవడంతో సిబ్బంది కిటికీలోంచి చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడు అదృశ్యం..

అన్న కొమారి జానకిరాం మృతి వార్త తెలుసుకున్న తమ్ముడు కొమారి బాలకృష్ణ సోమవారం భావోద్వేగానికి గురై.. బైక్ తీసుకొని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో జానకిరాం అంత్యక్రియలు కూడా నిలిచిపోయాయి. అతడు ఏమి చేసుకున్నాడో అనే ఆందోళనలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఉన్నారు. నాగర్‌కర్నూల్ సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తాలో పురుగు మందు కొనుగోలు చేసి శ్రీశైలం వైపు వెళ్లారని తెలియడంతో బంధువులు అక్కడికి వెళ్లి వెతికారు.

మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన

వృద్ధుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడైన సంగెపు హనుమంత రావు(60)కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె. పద్మావతి తీర్పునిచ్చారు. కోర్టు పీపీ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలిక తన కుటుంబ సభ్యులతో కలిసి ఎల్‌బీ నగర్ ఠాణా పరిధిలో నివాసం ఉంటోంది. 2018 ఏప్రిల్ 23వ తేదీన బాలిక ఇంటి ఎదుట ఆడుకుంటుండగా అదే భవనంలో నివాసం ఉండే 60ఏళ్ల వృద్ధుడు హనుమంతరావు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన బాలిక తల్లి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారించిన కోర్టు మంగళవారం పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పును ఇచ్చింది. బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు..

కృత్రిమమేధపై 'ఇస్రో ఇమ్మర్షన్ ఛాలెంజ్'

రాయదుర్గం: జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎస్ఆర్ఎస్సి), ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సంయుక్తంగా దేశవ్యాప్తంగా స్టార్టప్, రీసెర్చ్ స్టూడెంట్ టీమ్‌ల కోసం ఏఐ ఫర్ స్పేస్ ఇమ్మర్షన్ చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టార్టప్‌లు, విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులతో కూడిన డైనమిక్ కమ్యూనిటీని కలిసి ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, అంతరిక్ష రంగంలో కృత్రిమ మేధస్సు పరివర్తన సామర్థ్యాన్ని అన్వేషించడంపై చర్చించారు. ఇస్రో ఇమ్మర్షన్ ఛాలెంజ్‌లో 177 టీమ్‌ల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అందులో 74 టీమ్‌లను ఆహ్వానించారు. ఎక్స్‌పాన్స్ కాస్మోస్(ఢిల్లీలోని స్టార్టప్), టీమ్ త్రిశూల్(చండీఘడ్‌కు చెందిన విద్యార్థి బృందం) మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డీన్ ప్రొఫెసర్ సీవీ జవహర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని సీఐఈ పరిశోధనల మద్దతు ఆధారంగా ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఇది ఒక చొరవ అన్నారు.

చింతల చెరువు వద్ద నిర్మాణాలు నేలమట్టం


చెరువును ఆనుకుని నిర్మించిన నిర్మాణాలు పూర్తిగా నేలమట్టం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని చింతల చెరువును ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 329/1లో వెలసిన నిర్మాణాలను మంగళవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. హైడ్రా అధికారి పాపారావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి భాస్కరరావు నేతృత్వంలో మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీల పరిధిలోని భారీ పోలీసు బందోబస్తు మధ్య సుమారు 3 ఎకరాల్లో వెలసిన 51 నిర్మాణాలను మూడు జేసీబీలతో నేలమట్టం చేశారు. కూల్చివేతల సమయంలో తమ ఇళ్లను కూల్చవద్దంటూ స్థానికులు అడ్డుకున్నారు. ఇళ్లను కూలుస్తుండగా రోదనలు మిన్నంటాయి. ఎట్టకేలకు హైడ్రా అధికారులు చెరువు పరిసర ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేశారు.

స్కూల్‌బస్సు బోల్తా

- 9 మంది విద్యార్థులకు గాయాలు
- త్రుటిలో తప్పిన ప్రమాదం


బోల్తాపడ్డ పయనీర్ పాఠశాల బస్సు


చికిత్స పొందుతున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: అదుపు తప్పి స్కూల్ బస్సు బోల్తాపడ్డ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్‌లో ఉన్న పాయనీర్ కాన్సెప్ట్ పాఠశాల మంగళవారం సాయంత్రం 4.20 గంటలకు ముగియడంతో డ్రైవర్ ఆదిల్ స్కూల్ బస్సును పాఠశాల వద్ద ఎత్తుగా ఉన్న ప్రదేశంలో నిలిపి పక్కకు వెళ్లాడు. విద్యార్థులు ఒక్కొక్కరు వచ్చి దాదాపు 15 మంది వరకు బస్సు ఎక్కారు. డ్రైవర్ హ్యాండ్ బ్రేక్ వేయడంతో బస్సు మెల్లగా వెనక్కి వెళ్లి ఓ కారును ఢీకొట్టి బోల్తా పడింది. వెంటనే స్థానికులు బస్సులోంచి విద్యార్థులను బయటకు తీశారు. గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కాటేదాన్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పలువురి విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయని, వాహనం వెనుక కారు లేకపోయి ఉంటే భారీ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బస్సు డ్రైవర్‌తో పాటు యాజమాన్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. డ్రైవర్ ఆదిల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- ప్రేమ విషయంలో కొంతకాలంగా గొడవలు
- యువకుడిపై యువతి కుటుంబ సభ్యుల దాడి


సునీల్(ఫైల్)

మూసాపేట: ప్రేమ విషయంలో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి శంషీగూడలోని మహంకాళి నగర్‌లో సునీల్(22) తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెలుతో కలిసి నివాసం ఉంటున్నాడు. తల్లిదండ్రులు మేస్త్రి పనిచేసుకొని జీవనం సాగిస్తున్నారు. సునీల్‌ను కూకట్‌పల్లిలోని ఎంఎన్ఆర్ కాలేజీలో బీకాం థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఇతడికి ఇదే ప్రాంతంలోని యువతితో మూడేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. సునీల్ ప్రేమించిన అమ్మాయి కులం వేరు కావడంతో రెండు కుటుంబాల మధ్య గతంలో గొడవలు జరిగాయి. అయినా యువతి మాత్రం ఇతడితో రోజూ చాటింగ్ చేస్తూ ప్రేమాయణం సాగిస్తోంది. సోమవారం రాత్రి నిజాంపేట రోడ్డులోని ఓ వైన్స్ వద్ద ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్తున్న సునీల్‌పై యువతి అన్నలు బీరు సీసాతో దాడి చేశారు. అతడి ఇంటికి వెళ్లి రాళ్లతో కొట్టారు. వేర్వేరు కులాలు కావడంతోనే పెళ్లి చేయడం లేదంటూ సునీల్ తన ఫోన్‌కే మెసేజ్ చేసుకొని మంగళవారం తెల్లవారు జామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు యువతితో పాటు తల్లి, సోదరులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: పచ్చదనం స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున మొక్కల పంపిణీ చేపట్టారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పండ్లు, పూల మొక్కలు, ఇండోర్‌ప్లాంట్స్‌ను పంపిణీ చేశారు. పూల మొక్కల్లో మందార, గులాబీ, మల్లె, బంతి, ప్లమేరియా తదితర మొక్కలు ఉన్నాయి. అలాగే ఇక్సోరా, జట్రోపా తదితర మొక్కలతో పాటు మామిడి, నేరేడు, జామ, పనస, దానిమ్మ, సపోట తదితర పండ్ల మొక్కలను, రెడ్ అక్సీనా, గ్రీన్ అక్సీనా, గోల్డెన్ దురంతో తదితర ఇండోర్ మొక్కలను కూడా ప్రజలకు విస్తృతంగా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బేగంపేట్‌లోని మెట్రో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ఆయనకు నివాళులర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

వాహనాల వేలం


కార్యక్రమంలో డీసీపీ రక్షిత కృష్ణమూర్తి

గన్‌ఫౌండ్రీ: కొన్ని నెలలుగా గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉన్న వాహనాలకు మంగళవారం నగర పోలీసులు వేలం పాట నిర్వహించారు. 1,161 వాహనాలను విక్రయించగా రూ.91,43,500 లక్షలను ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు. ఈ సందర్భంగా సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి మాట్లాడుతూ.. 19వ దశ వేలంపాటను న్యాయమైన పద్ధతిలో వేలం వేశామని తెలంగాణ, ఆంధ్రా, మహారాష్ట్ర నుంచి సుమారు 500 మంది బిడ్డర్లు హాజరైనట్లు 1,072 ద్విచక్రవాహనాలు, 16 త్రీవీలర్లు, 5 నాలుగు చక్రాల వాహనాలను వేలం వేయగా రూ.80,35,000 లక్షలు, 68 విలువైన ద్విచక్రవాహనాలను వేలం వేయగా రూ.11,08,500 లక్షలు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ–2 ఎన్.అశోక్‌కుమార్, అదనపు డీసీపీ మద్దిపాటి శ్రీనివాసరావు, కార్ హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డీసీపీ బి.కృష్ణయ్య, గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, టీటీఐ ఇన్‌స్పెక్టర్ బి.హరీష్, షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలు చౌహాన్, ఆర్ఐ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్‌లో ఇరుక్కున్న విద్యార్థులు



ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్ సాంకేతిక లోపంతో ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో అందులో ముగ్గురు విద్యార్థులు ఇరుక్కుపోయారు. లిఫ్ట్‌లో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు పలుమార్లు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. దీంతో భయాందోళనకు గురయ్యారు. పెద్దగా అరవడంతో ప్రయాణికులు వెంటనే 100కు సమాచారం అందించారు. ఉప్పల్ పోలీసులు లిఫ్ట్ తలుపులు తెరిచేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు దాదాపు అరగంట పాటు శ్రమించి విద్యార్థులను బయటకు తీశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
■ మన తెలంగాణలో రెండవ హైదరాబాద్‌గా డెవలప్ అవుతున్న వరంగల్ దగ్గరలో కేవలం 15 లక్షలకే 1/2 అర ఎకరం భూమి ఎర్రచందనం, శ్రీగంధం మొక్కలతో ఇవ్వబడును. ఫోన్: 9177619716 [HA-14417]

PLOT FOR SALE
■ వరంగల్ హైవే - కొలనుపాక - జైన్ మందిర్ నుండి 3.5 KM దూరంలో భూమి అమ్మకానికి కలదు. ఒక ఎకరం 75 లక్షలు, 1/2 ఎకరం: 40 లక్షలు. Buy బ్యాక్ ఆఫర్ కలదు. సంప్ర: 9848489819 [H-778939]
■ షాద్‌నగర్ @ శంషాబాద్ టౌన్‌లో DTCP లేఅవుట్ ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్. సైట్ విజిట్ కొరకు. సంప్ర: 9949695027 [H-796186]

LAND WANTED
■ Land Required For Lease Around Tellapur, Nallagandla, Gopanpally. Contact: 6309320922 [HA-18610]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గాని, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800433]

BUSINESS OFFER
■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5872]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Shabana Banu Spouse of Mohammad Ilas Zhad, Resident of Ganesh Nagar, Bopkhel, Pune, Maharashtra - 411031, have changed my name from Shabana Banu to Shabana Iliyas Zhad, vide Affidavit date 05/08/2024 before Bolarum / Secunderabad-500010 [HA-03319]

OLD AGE HOME
■ వృద్ధులు, Rtd ఎంప్లాయీస్ విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, 24/7 మెడికల్ సర్వీస్. ఉప్పల్ మరియు ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్ భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 9515474083 [H-778833]
■ సన్‌రైజ్ హోంకేర్ : 24/7 వృద్ధులు, పేషెంట్స్, బేబీకేర్, ఇంటి/వంట పని చేయుటకు కేర్ టేకర్స్‌ని & వాచ్‌మెన్ ఫ్యామిలీని మీ ఇంటి వద్దకే పంపబడును. 8801821210 [HA-16333]

Wanted
■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కం. మార్కెటింగ్ చేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, అన్ని కేటగిరీస్. మంచి కమీషన్. ఉచిత శిక్షణ & సపోర్ట్. ఫోన్. 70137 94440 [HA-98127]
■ నూతనంగా ఆరంభించబడిన ఆఫీస్ నందు మియాపూర్, కూకట్‌పల్లి, LB నగర్, ఉప్పల్‌లో ఆఫీస్ సిబ్బంది & మార్కెటింగ్ సిబ్బంది కావలెను. జీ॥ (15-40K)+ఇన్సె. ఫోన్. 8919322740/8247744144 [H-778956]
■ అమీర్‌పేట్, లాల్‌బంగ్లా బస్టాప్ దగ్గర ప్రముఖ అపార్ట్‌మెంట్‌లో అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం. డ్యూటీ జీతం: 13-15 వేలు. సంప్ర: 8978907070 [H-783057]
■ శ్రీమంతుల ఇంట్లో ముసలివారికి సేవ చేయుటకు చిన్నపిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని, పేషెంట్ కేర్‌కి స్త్రీ/పురుషులు కావలెను జీతం: 15000 To 30000/- +రూం+భోజనం ఫ్రీ. ఫోన్: 6303835653, 8888432835 [H-779003]
■ శ్రీలక్ష్మీ హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 17000 రూం+మీల్స్ ఫ్రీ ✆ 9347148051 [G-2137]
■ వంట, ఇంటి పని, పిల్లలను, వృద్ధులను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి, కేర్‌టేకర్స్, ఆయాలను మీ ఇంటి వద్దకు పంపబడును 20-40 సం. స్త్రీ/పు వర్కర్స్ కావలెను. ఫోన్ : 6309807798, 9121099519 [H-800443]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎ.ఎస్.రావునగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
శార్వాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

న్యాయం చేయాలని విద్యార్థుల ఆందోళన



ఫ్రాన్స్ క్యాంపస్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్: ప్యారిస్‌లో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి తాము చెల్లించిన డబ్బులు రీఫండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత విద్యార్థులు మంగళవారం బంజారాహిల్స్ అరోరా కాలనీలోని ఫ్రాన్స్ క్యాంపస్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ కోసం మొత్తం 22 మంది విద్యార్థులు ఒక్కొక్కరు రూ. 5 లక్షల చొప్పున ఎస్ ల్యాప్ ప్యారిస్ కాలేజీలో అడ్మిషన్ కోసం కట్టామని పలు కారణాల వల్ల 21 మంది విద్యార్థులకు వీసా రద్దు అయిందని తెలిపారు. వీసా రద్దు అయిన 45 రోజుల్లోపు తమ ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉన్నా కాలేదని తెలిపారు. ఇదే విషయమై పలుమార్లు యూనివర్సిటీ వారిని సంప్రదించగా 16 మంది విద్యార్థులకు 50 శాతం మేర రీఫండ్ చేశారని ఇంకా 5 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో, మిగతా వారికి 50 శాతం మేర సుమారుగా రూ. 60 లక్షల వరకు రావాల్సి ఉందని తెలిపారు. పలుమార్లు వారికి మెయిల్ పెట్టినా కూడా స్పందించడం లేదని తెలిపారు. ఇదే విషయమై ఫ్రెంచ్ ప్రభుత్వ పెద్దలకు కూడా తాము మెయిల్స్ పెడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలకాని సురేష్, కరీముల్లా, సయ్యద్ అబ్దుల్ ఆమిద్, ఇంతియాజ్, షేక్ హబీబుల్లా, వసీంఖాన్ పాల్గొన్నారు.

చెట్లు ప్రాణవాయువును అందించే గొప్ప సంపద



బస్తీల్లో అవగాహన కల్పిస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: చెట్లు మానవాళికి ప్రాణ వాయువును అందించే గొప్ప సంపద అని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం రెండో రోజులో భాగంగా మంగళవారం డివిజన్ పలు బస్తీల్లో ఆయన అధికారులతో కలసి పర్యటించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మొక్కలను నాటాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ మొక్కలను ఉచితంగా అందిస్తున్నదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు. ఆసుపత్రుల ఆవరణలో విధిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త విధిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కవిత, ఏఈ భరత్, ఎంటమాలజీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదు

సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిల్ షరీఫ్

బంజారాహిల్స్: ఉద్యోగుల హక్కుల కోసం, వారి సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఐఎన్‌టీయూసీ అనుబంధ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను కొంతమంది అధికారులు వేధిస్తున్నట్లు తమ దృష్టికి వస్తున్నదని అది మంచి పద్ధతి కాదని కార్మికులను వేధిస్తే చూస్తు ఊరుకోమని అన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు యూనియన్ పని చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఐఎన్‌టీయూసీ సహకార్ మజ్దూర్ యూనియన్‌కు మద్దతుగా యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కె. రమేష్, ఖైరతాబాద్ జోనల్ సహకార్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున్, సెక్రటరి కృష్ణ, గోవింద్, బాలమురళీ మోహన్, కన్వీనర్ ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలనలోనే తెలంగాణ అభివృద్ధి



నివాళులర్పిస్తున్న డైరెక్టర్ డా. బీరప్ప తదితతరులు

లక్డీకాపూల్: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ ఆశించినట్లు స్వయం పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని ముఖ్యంగా వైద్య రంగంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించినంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పేదలందరికీ ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, రవి, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, పారా మెడికల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శాంతి, భరత్ భూషణ్, మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీని వాసరావు, మార్త రమేష్, రమణమ్మ, రాధిక తదితరలు పాల్గొన్నారు.

బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో...

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి సందర్భంగా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 'ఆచార్య జయశంకర్ చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి అర్పించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ డైరెక్టర్ (అకాడమిక్) ప్రొఫెసర్ జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జి సుధారాణి, సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ వడ్డాణం శ్రీనివాస్, డైరెక్టర్లు గుంటి రవీందర్, బానోతు ధర్మా, రమాదేవి, శ్రీనివాస్‌లతో పాటు పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జ్వర పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు



దూద్‌ఖానా బస్తీలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: పెద్దఎత్తున సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీల పరిధిలో ఉన్న పలు బస్తీలు, కాలనీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం బంజారాహిల్స్‌రోడ్ నెం. 7లోని దూద్‌ఖానా బస్తీతో పాటు జహిరానగర్, భోలానగర్ బస్తీల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ మాట్లాడతూ జ్వర లక్షణాలు ఉన్న వెంటనే స్థానికంగా ఉన్న బస్తీ దవాఖానాకు కానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కానీ సందర్శించాలని తెలిపారు. నిర్లక్ష్యం చేయకూడదని తగిన మందులు వాడటంతో పాటు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న ఆశా వర్కర్లు బస్తీలు, కాలనీల్లో ఫీవర్ సర్వే చేస్తూ జ్వర పీడితులను గుర్తిస్తున్నారని వారికి ఇంటి వద్దే సరైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

'బీఆర్ఎస్‌కు కాలం చెల్లింది'



రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్పష్టం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు నందునాయక్ మంగళవారం కార్పొరేటర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని అందుకే ఆ పార్టీకి చెందిన నాయకులు ఒక్కొక్కరు పార్టీని వీడుతున్నారన్నారు. నందునాయక్‌కు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు మన్సూర్, షరీఫ్, సింగారి శ్రీనివాస్, పల్లె సాయిలు. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ రూటే సపరేట్!

ఆస్పత్రిలో దారులన్నీ 'వన్‌వే' లోనే..

- పంజగుట్ట నుంచి లోపలికి.. బంజారాహిల్స్ నుంచి బయటకు..
- ఇబ్బందుల్లో రోగులు.. ఆందోళనలో వాహనదారులు
- నిమ్స్ వైద్యులు, సిబ్బందికి మాత్రం ప్రత్యేక ఎంట్రీ



లక్డీకాపూల్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యసేవలను అందిస్తున్న నిమ్స్ ఆస్పత్రి రూటే సపరేట్ అన్నట్టుగా వ్యవహరిస్తోంది. సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సైతం సునాయసంగా చేసే నిమ్స్ రోగుల రాకపోకలపై నియంత్రణ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చే వాహనాలకు నిబంధనలు విధించింది. మంగళవారం అమలులోకి వచ్చిన కొత్త నిబంధనలతో ఆస్పత్రికి వచ్చిన రోగులు తికమకపడుతున్నారు. నిమ్స్‌కు వచ్చే ఏ వాహనమైనా పంజగుట్ట మెయిన్ గేట్ నుంచి లోపలికి రావాలి. చివరికి ఆటోలు, క్యాబ్‌లలో వచ్చే వైద్యులు, సిబ్బంది సైతం వాళ్లు కూడా పంజగుట్ట గేట్ నుంచే లోపలికి రావాలి. ఆస్పత్రికి వచ్చిన వాహనం ఏదైనా సరే తిరిగి బయటకి వెళ్లాలంటే బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని ట్రామా బ్లాక్ వద్ద ఉన్న ఎగ్జిట్ గేట్ నుంచి వెళ్లాలి. అయతే వాహనాల పార్కింగ్ సదుపాయం మాత్రం ఎప్పటిలాగానే ఉన్నప్పటికి రాకపోకలపై కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా ప్రైవేట్ వాహనాల రాకపోకలను నియంత్రించే క్రమంలో వన్‌వే ని అమలులోకి తెచ్చినట్టు తెలుస్తుంది. వాస్తవానికి కొన్ని ప్రైవేటు వాహనాలు నిమ్స్‌ను బైపాస్ రోడ్‌గా వినియోగించుకుంటున్న పరిస్థితి. దాంతో కొన్ని సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో వన్ వేని ఏర్పాటు చేసినట్టు తెలుస్తుంది. ఇప్పటికే ప్రైవేట్ వాహనాలను నియంత్రంచేందుకు బారికేట్లను ఏర్పాటు చేసినప్పటికి ఆశించిన ప్రయోజనం చేకూరకపోవడంతో వన్‌వే విధించినట్టు తెలుస్తుంది. అయితే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మీ భాస్కర్ తెలిపారు. ఈ విషయంలో ఎదురయ్యే సమస్యలను సైతం అధిగమించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని రోగులకు మరింత మెరుగైన సదుపాయం కల్పించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే రోగుల ప్రయోజనం కోసం 8 బ్యాటరీ కారులను అందుబాటులోకి తెచ్చామన్నారు.

నిమ్స్ సిబ్బందికి ప్రత్యేక ఎంట్రీ..

అదే సొంత వాహనాల్లో వచ్చే సిబ్బందికి మాత్రం వెసులుబాటు కల్పించారు. పంజగుట్ట వైపు వచ్చే వాళ్ల మెయిన్ గేట్ నుంచి నాగార్జున సర్కిల్ వైపు నుంచి వచ్చే వైద్యులు, సిబ్బంది బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని వెంగళరావు పార్క్ ఎదురుగా పూమా, ఉడ్‌లాండ్ షోరూమ్‌ల మధ్య రోడ్‌లోంచి నిమ్స్‌లోకి ప్రవేశించే వెసులుబాటు కల్పించారు. అందుకు నిర్ణీత వేళల్లో బంజారా గేటు తెరుచుకునేలా యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. దీంతో గతంలో నిమ్స్ బ్యాక్ గేటుగా వినియోగించిన బంజారా గేట్ తిరిగి వినియోగంలో వచ్చింది. వైద్యులు, సిబ్బందికి ప్రత్యేకించిన ఈ గేట్ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు తెరిచి ఉండేలా చర్యలు తీసుకున్నారు. అంతే కాకుండా నర్సింగ్ హాస్టల్ పక్కనున్న స్థలంలో సిబ్బంది వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యం



అస్మితశ్రీ

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన దొడ్డి అస్మితశ్రీ (24) వివాహం ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన వంగు లక్ష్మీశ్రీనివాస్‌తో జరిగింది. ఆషాఢ మాసం సందర్భంగా నెలరోజుల క్రితం ఆమె అత్తింటి నుంచి యూసుఫ్‌గూడలో నివసించే పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 5వ తేదీన శ్రావణమాసం రావడంతో భార్యను తీసుకువెళ్లేందుకు లక్ష్మీశ్రీనివాస్ అత్తవారింటికి వచ్చాడు. అయితే భర్త వచ్చే కంటే ముందే సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తన కూతురు కనిపించడం లేదంటూ తల్లి భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712661278 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మరో ఘటనలో..



అర్పితా సమాల్

యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో నివసించే అర్పితా సమాల్ (23) ఈ నెల 5వ తేదీన ఉదయం భర్త డ్యూటీకి వెళ్లగానే ఇంట్లో తన నాలుగేళ్ల కొడుకును వదిలేసి వెళ్లిపోయింది. భర్త రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని ఆమె ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712661278 నెంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఆర్టిజన్లుగా గుర్తించి ఆదుకోండి సారూ..!

ప్రజాభవన్ వద్ద బైఠాయించిన కాంట్రాక్ట్ బిల్లు కలెక్టర్లు



లక్డీకాపూల్: విద్యుత్ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్‌వో), డివిజనల్ ఇంజినీర్ (డీఈ) కార్యాలయాల్లో తమను నైపుణ్యం కలిగిన కార్మికులు (ఆర్టిజన్లు)గా నియమించాలని ప్రభుత్వాన్ని కాంట్రాక్టు బిల్లు కలెక్టర్లు డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విద్యుత్ బోర్డు, రెవెన్యూ క్యాషియర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలో వచ్చిన అనేక మార్పులతో ఆన్‌లైన్ బిల్లులు చెల్లించడం వల్ల తమకు వేతనం తగ్గి దుర్భరమైన జీవితాలను గడుపుతున్నామన్నారు. ప్రస్తుతం 6 గ్యారంటీలలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలైందని దీంతో తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 3 దశాబ్దాలుగా సంస్థని నమ్ముకుని పనిచేస్తున్న తమకు ఈఆర్‌ఓలలో ఏదైనా పని కల్పించి కనీస వేతనం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్యను వేడుకున్నారు. అదే విధంగా బాధితులు వివిధ సమస్యలపై మొత్తం 465 దరఖాస్తులు సమర్పించారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్యలు దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆంజనేయ స్వామికి 'వడమాల' అలంకరణ



వడమాల అలంకరణలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: శ్రావణ మాసంలో తొలి మంగళవారం సందర్భంగా పదకొండువేల నూట పదహారు వడలతో అలంకరించిన ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బంజారాహిల్స్‌రోడ్ నంబర్ 14లోని నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామిని ఆలయ అర్చకులు శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా స్వామి వారిని వడమాలలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేష శైలాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు మాట్లాడుతూ ప్రతీయేటా శ్రావణ మాసంలో వచ్చే ప్రతి మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా స్వామి వారిని దివ్యంగా అలంకరిస్తున్నామని తెలిపారు. పూజల్లో భాగంగా స్వామి వారికి సుప్రభాత సేవ, మూల విగ్రహానికి పంచామృతాలతో విశేష అభిషేకం, స్వామివారికి ఎంతో ఇష్టమైన వడలతో సహస్ర వడమాలంకరణ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని కమిషనర్‌కు వినతి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బాల్‌రెడ్డినగర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డు మొత్తం నడవడానికి కూడా వీల్లేకుండా మారిందని, వెంటనే కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఆమెకు వినతిపత్రం అందజేశారు. లోతట్టు ప్రాంతమైన బాల్‌రెడ్డినగర్‌లో పాడైపోయిన రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేయాలన్నారు. దీనిపై కమిషనర్ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

విధులకు ఆటంకం.. యువకులపై కేసు

వెంగళరావునగర్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు నమోదైంది. మధురానగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే ఎం.సతీష్‌కు మార్ సోమవారం నైట్ డ్యూటీ చేస్తున్నాడు. ఆ సమయంలో ఎల్లారెడ్డిగూడ వద్ద అనుమతి లేకుండా తొట్టెల ఊరేగింపు పెద్ద శబ్దంతో నిర్వహిస్తున్నారు. అక్కడకు వెళ్ళి అనుమతి లేకుండా చేయవద్దని చెప్పడంతో సంజయ్, రాకేష్ అనే యువకులు కానిస్టేబుల్‌ను అసభ్య పదజాలంతో దూషించి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

సాక్షి,సిటీబ్యూరో: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించే బాధ్యత ఫిజికల్ డైరెక్టర్లపై ఉందని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి. ఒడ్డెన్న అన్నారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన ఫిజికల్ డైరెక్టర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించే విధంగా క్రీడా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలో కూడా ఫిజికల్ డైరెక్టర్ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. జక్కయ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉమారావ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

బంజారాహిల్స్: బస్సు దిగుతున్న క్రమంలో ఓ వ్యక్తిని ఐదుగురు వ్యక్తులు చుట్టుముట్టి గందరగోళానికి గురిచేసి మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గాజులరామారంలో నివసించే వానపల్లి బ్రహ్మాజీ సినిమాల్లో మేనేజర్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో అమీర్‌పేటలో బస్సు దిగేందుకు యత్నిస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఐదుగురు వ్యక్తులు ఆయనను చుట్టుముట్టి గందరగోళానికి గురిచేశారు. ఎలాగోలా బస్సు దిగి శ్రీనగర్‌కాలనీలోని తన ఆఫీసుకు వచ్చి చూసుకోగా మెడలో బంగారు చైన్ కనిపించలేదు. బస్సులో తనను గందరగోళానికి గురిచేసిన ఈ వ్యక్తులే మెడలో నుంచి గొలుసు కొట్టేసి ఉంటారని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీగ్యాంగ్ వీరంగం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ పోచమ్మగుడి సమీపంలో రెండు గ్యాంగ్‌లుగా ఏర్పడిన యువకులు దారిలో బైక్‌లు అడ్డుపెట్టి న్యూసెన్స్ చేస్తూ ఇదేమిటని ప్రశ్నించిన వారిపై కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇందిరానగర్‌లో నివసించే డి.మమత (28) తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై మార్కెట్‌కు వెళ్తుండగా కమ్యూనిటీ హాల్ వద్ద ముగ్గురు యువకులు వీరిని ముందుకు వెళ్లనీయకుండా అడ్డుపడ్డారు. ఇదేమిటని ప్రశ్నించగా షఫీ, షారూఖ్, గోపీ తనను, తన భర్తను కర్రలతో తీవ్రంగా కొట్టారని, గాయాలయ్యాయని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో నివసించే షఫీవుల్లా అనే జిమ్ ట్రైనర్ తన స్నేహితుడు గోపీకృష్ణతో కలిసి డిన్నర్ చేసేందుకు వెళ్తుండగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద ముగ్గురు యువకులు అసభ్యకరంగా మాట్లాడుతూ న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు ముగ్గురు యువకులు రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో గోపీకృష్ణ, తనకు తీవ్ర గాయాలయ్యాయని, తమపై దాడి చేసిన రాజు, రవి, శ్రీనులపై చర్య తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ పుష్పలత

ఫిలింనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఖైరతాబాద్-2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం గృహ సందర్శన చేపట్టారు. గర్భిణులు, బాలింతలు ఉన్న ఇళ్లకు వెళ్లి పోషకాహారంపై అవగాహన కలిగించారు. పోషకాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని, పుట్టిన శిశువుకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఈ సందర్భంగా సూచించారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధిలోని 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలను ప్రాజెక్టు డైరెక్టర్ పుష్ప పర్యవేక్షించారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీఆర్ఎస్ నేతలు

బంజారాహిల్స్: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ నేతలు జె. రాజు, శంకర్, మునికొండ వెంకటేష్, విక్కీ, వినయ్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యర్థాల తొలగింపు



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: ఎన్నో నెలలుగా బస్తీలు, కాలనీల్లో లారీల కొద్ది పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలతోపాటు ఇతర వ్యర్థాలు ఎట్టకేలకు కదలుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా నిర్మాణ వ్యర్థాలను అధికారులు ప్రత్యేక వాహనాల ద్వారా తొలగిస్తున్నారు. మంగళవారం బంజారాహిల్స్‌రోడ్‌నెం. 5లోని దేవరకొండ బస్తీలో కార్పొరేటర్ కవితారెడ్డి హాజరై ఇక్కడ నిర్మాణ వ్యర్థాల తొలగింపును ఏఎంహెచ్‌వో రవి కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి ఎక్కడెక్కడ నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయో వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు.

మధురానగర్
శారదా శారీస్
ప్యూర్ కంచి పట్టు చీరల నిలయం
H.No.A-68, S.R.K రాజు కమ్యూనిటీ హాల్ రోడ్, పెల్లంకి స్వీట్ షాప్ దగ్గర, మధురానగర్, హైదరాబాద్. ఫోన్: 7093026316 / 9391083553
ఆషాడం రేట్లకే శ్రావణ మాసం మెగా డిస్కౌంట్ సేల్
5వ తేది సోమవారం నుండి
ప్యూర్ కంచి హ్యాండ్లూమ్ శారీస్ మాస్టర్ వీవర్స్ సేల్
ప్యూర్ కంచి పట్టు హ్యాండ్లూమ్ శారీస్ మాస్టర్ వీవర్స్ రేట్లకే ఇవ్వబడును
మా వద్ద ప్యూర్ కంచి పట్టు హ్యాండ్లూమ్ శారీస్, 1 గ్రా॥ గోల్డ్, 2 గ్రా॥ గోల్డ్, 4 గ్రా॥ గోల్డ్, 6 గ్రా॥ గోల్డ్ శారీస్ లభించును
అన్ని రకముల శారీస్‌పై 50% నుండి 80% డిస్కౌంట్ కలదు.
మరియు అన్ని రకముల డిజైనర్ శారీస్, ఫ్యాన్సీ శారీస్‌పై 80% డిస్కౌంట్ కలదు.
ప్యూర్ కంచి హ్యాండ్లూమ్ శారీస్ మేమిచ్చే ధరలు హైదరాబాద్‌లో ఎవరూ ఇవ్వలేరు
ముఖ్య గమనిక:
మధురానగర్ శారద శారీస్‌లో కంచి పవర్ లూమ్ శారీస్ మా వద్ద లభించవు
మా వద్ద డిజైనర్, బెనారస్, కలకత్తా, జైపూర్, కోయంబత్తూర్, రాజ్‌కోట్, అహ్మదాబాద్, ఉప్పాడ, బెంగుళూర్ శారీస్ లభించును.
ముఖ్య గమనిక:- మీ Google Mapలో శారదా శారీస్, 1959 మధురానగర్ అని టైప్ చేస్తే A/68, Lata Enclave అని అడ్రస్ చూపిస్తుంది.
saradasarees1959wholesale_shop

పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

లక్డీకాపూల్ : పారిశుద్ధ్య నిర్వహణలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని జీహెచ్ఎంసీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా గ్రేటర్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టు కార్మికులు సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పేరుతో జీతాలు పెంచడంలో తీవ్రమైన జాప్యం చేసిందని ఆరోపించారు. రిటైర్డు అయ్యే కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోకపోవడం వల్ల సిబ్బందిపై పని భారం పడుతుందని తెలిపారు. తీవ్రమైన ఎండలు, చలి, వర్షాలలో సైతం అనేక ఇబ్బందులు పడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టు కార్మికుల పర్మనెంట్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతనాలు రూ. 26 వేలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర నాయకులు జె. వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు శివబాబు తదితరలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

హైటెక్స్‌లో మెషీన్ టూల్స్ ఎక్స్‌పో..

సాక్షి, సిటీబ్యూరో: హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ మెషీన్ టూల్స్, ఇంజినీరింగ్, ఇండియా ప్రాసెస్ ఎక్స్‌పో, కాన్ఫరెన్స్, ఎకో సస్టైన్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు హైటెక్స్ వాణిజ్య అధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకూ ఎక్స్‌పో ఉంటుందని తెలిపారు. పరిశ్రమల ఆవిష్కరణ, స్థిరత్వానికి హైదరాబాద్ మైలురాయిగా మారడానికి సిద్ధమవుతోందని తెలిపారు. హిమ్‌టెక్స్ 2024 (హెచ్ఐఎంటిఈఎక్స్) మెషీన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో సాధించిన పురోగతిని ప్రదర్శించేందుకు 300 మంది హాజరవుతారని తెలిపారు. హిమ్‌టెక్స్, ఎపిక్ (ఐపీఈసీ) ఎకో సస్టైన్ ఎక్స్‌పోలు ఉత్పాదక రంగానికి అనుగుణంగా సరికొత్త సాంకేతికత, స్థిరమైన పరిష్కారాలను అందించే వేదికలుగా నిలుస్తాయన్నారు.


అమెజాన్‌లో.. ఫ్రీడమ్ ఫెస్టివల్..

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ షాపింగ్ వేదిక అమెజాన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఫ్రీడమ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. ఈ ఫెస్టివల్ మంగళవారం ప్రారంభమైందని, ఈ నెల 11 వరకూ కొనసాగుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ఫెస్ట్‌లో హస్తకళాకారులు, చేనేతలు, ఔత్సాహిక మహిళా వ్యాపార వేత్తలు, స్టార్టప్స్‌తో పాటు నగరానికి చెందిన పలు స్టోర్స్, టాప్ బ్రాండ్స్ పాల్గొంటున్నాయని, స్మార్ట్ ఫోన్స్ సహా ఎలక్ట్రానిక్స్, గ్రాసరీ, ఫ్యాషన్, సౌందర్య పోషణ ఉత్పత్తులు.. తదితరాలన్నీ అత్యంత ఆకర్షణీయమైన డిస్కౌంట్స్, క్యాష్ బ్యాక్ ఆఫర్లతో అందుబాటులో ఉంటాయన్నారు.



వ్రతం.. వజ్రం..

సాక్షి, సిటీబ్యూరో: వరలక్ష్మి వ్రత పూజను పురస్కరించుకుని ప్రత్యేకంగా లిమిటెడ్ ఎడిషన్ కలెక్షన్‌ను బాలీవుడ్ ప్రముఖుడు కరణ్ జోహార్ ఆధ్వర్యంలోని 'త్యాని బై కరణ్ జోహార్' ఆభరణాల స్టోర్ రూపొందించింది. ఈ ఆభరణాల శ్రేణిని జూబ్లీహిల్స్‌లోని షోరూమ్‌లో మంగళవారం విడుదల చేశారు. ఈ కలెక్షన్‌లో సంప్రదాయాలను ఆధునికతలను మేళవించిన ఆభరణాలు ఉన్నాయని, వ్రతాన్ని పరిపూర్ణం చేసేలా ఇవి డిజైన్ చేయడం జరిగిందని త్యాని నిర్వాహకులు రిషబ్ తెలిపారు. అదే విధంగా విభిన్న రకాల మేలిమి వజ్రాభరణాలు కూడా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సరికొత్త కలెక్షన్ ప్రదర్శించారు.



'మనిషి మనసు నుంచే యుద్ధాలు పుట్టుకొస్తాయి.. మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే ప్రపంచ శాంతి స్థాపన సాధ్యం అవుతుంది' అన్న బుద్ధుడి మాటలే వారికి స్ఫూర్తి.. ఆయన ప్రవచించిన పంచశీల లక్షణాలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు.. అంతేకాదు ఆయన బోధనలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కృషి చేస్తున్నారు. ప్రజల్లో మానసిక ప్రశాంతతను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణలో ఉన్న ప్రముఖ బౌద్ధ క్షేత్రాల గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



మానసిక ప్రశాంతతపై ప్రజల్లో అవగాహన

నగరంలో మానవతా బుద్ధిజం ప్రచారం

బుద్ధ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ స్థాపన

కొత్తూరు మండలం తిమ్మాపూర్‌లో ఏర్పాటు

మన బౌద్ధ ప్రదేశాలపై దేశ, విదేశాల్లో గుర్తింపు



హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొత్తూరు మండలం తిమ్మాపూర్‌లో బోధిసత్వ బుద్ధవిహార్ పేరుతో క్షేత్రాన్ని స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారే బుద్ధా లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు.

బుద్ధుడి మార్గంలో..!

మానవతా బౌద్ధ ధర్మం..

హైదరాబాద్ చాప్టర్ ప్రధాన కార్యాలయం ఫోగువాంగ్ షాన్ పేరుతో తైవాన్‌లో ఉంది. మానవతా బుద్ధిజాన్ని విరివిగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఈ సంస్థ ప్రారంభమైంది. ప్రపంచంలో శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా మైండ్ కల్చర్‌ను పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ఈ సంస్థ హైదరాబాద్ శాఖకు ప్రధాన సలహాదారు అయిన డాక్టర్ బాలు సావ్లా 15 ఏళ్లుగా పని చేస్తున్నారు. రెండు సార్లు ఈ సంస్థకు ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

విద్య, వైద్య సేవలు..

హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఎన్నో విద్య, వైద్య పరమైన సేవలు అందిస్తున్నారు. ప్రజల్లో మానసిక ప్రశాంతత గురించి అవగాహన కల్పిస్తూనే చాలా ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.

దేశ, విదేశాల్లో ప్రచారం..

తెలంగాణలో బౌద్ధ మతం ఒకప్పుడు విరాజిల్లింది. బుద్ధుడు నడయాడిన ఘనమైన చరిత్ర మన నేలకు ఉంది. కాలక్రమేణా బౌద్ధమతం కనుమరుగైనప్పటికీ అప్పటి ఆనవాళ్లు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఆ చరిత్ర గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు డాక్టర్ బాలు ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. థాయ్‌లాండ్, మలేసియా, సింగపూర్, చైనా, కెనడా వంటి దేశాల ప్రజలకు ఇక్కడి బౌద్ధ క్షేత్రాల గొప్పదనాన్ని చాటి చెబుతున్నారు.

మానసిక ప్రశాంతత అవసరం..



ప్రస్తుతం ఉన్న బిజీ జీవన విధానంలో మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. బుద్ధుడు చూపిన మార్గంలో వెళ్తే సులువుగా దాన్ని సాధించవచ్చు. ఇప్పటి తరానికి బుద్ధుడి బోధనలు ఎంతో అవసరం.

– డాక్టర్ బాలు సావ్లా, బుద్ధ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్, హైదరాబాద్ శాఖ ప్రధాన సలహాదారు



హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్..

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు కొనసాగనున్న హైలైఫ్ ఎగ్జిబిషను నటి శ్రవంతి చొకరపు, మాలవిక శర్మ నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లతో కూడిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దేశంలోని 350 మంది డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. గృహాలంకరణ ఉత్పత్తులు, వధువరులకు ఆకర్షణీయమైన ఉత్పత్తులు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నటి ప్రీతి సుందర్ తో పాటు పులవురు మోడల్స్, డిజైనర్లు పాల్గొన్నారు.



- రఘునందన 'శ్వాస, ధ్యాస' చేనేత వస్త్రాలే
- మూడు దశాబ్దాలుగా చేనేతపై ప్రచారం
- చేనేత ఉత్పత్తులే కానుకలుగా
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

హ్యాండ్సమ్.. హ్యాండ్లూమ్స్..

డియర్ సార్.. ప్లీజ్ 'వీ ఆర్ హ్యాండ్లూమ్' అంటూ పలకరించే తమ స్నేహితుడి కోసం చేనేత వస్త్రాలను ధరించే వారు కొందరైతే, వీఆర్ హ్యాండ్లూమ్.. బీ హ్యాండ్లూమ్ అని చెబితే గానీ, చేనేత వస్త్ర ధారణ పై తమకు మక్కువ కలగలేదనే వారు మరి కొందరు. చేనేత వస్త్ర ప్రియుడిగా, ప్రోత్సాహకుడిగా తన ఉనికిని చాటుకునే మాచన రఘునందన వృత్తి రీత్యా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పౌర సరఫరాల శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్. చేనేత పట్ల ఆయనకున్న కమిట్‌మెంట్‌పై పలు విశేషాలు... – సాక్షి,సిటీబ్యూరో

మూడు దశాబ్దాలుగా చేనేత వస్త్రాలు మాత్రమే ధరిస్తూ చేనేత వస్త్రాలపై విస్తత ప్రచారం చేస్తున్నారు. 'చేనేత వస్త్రాలను ధరించండి.. నేతన్నను ఆదరించండి'. అంటూ తన మిత్రులు, సహచర ఉద్యోగులు హ్యాండ్లూమ్ బట్టలు ధరించేలా ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషిస్తూ చేనేత వస్త్రాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ప్రచారం కల్పిస్తున్నారు. హ్యాండ్లూమ్‌కు తన దైనందిన జీవితంలో అత్యంత ప్రాధాన్యతనివ్వడంతో ఆదర్శ ప్రాయంగా మారారు.



చదువుకునే రోజుల నుంచే..

మాచన రఘునందన చదువుకునే రోజులనుంచే చేనేత వస్త్రాలు ధరించడం ఆరంభించారు. తన వివాహ సమయంలో కూడా చేనేత వస్త్రాలను మాత్రమే విధిగా ఉండేలా నిబంధన పెట్టి సఫలీకృతమయ్యారు. చేనేత ఉపయోగాలను జనబాహుళ్యానికి తెలిసేలా తన దైనందిన జీవితంలో అనుదినం చేనేత వస్త్రాలనే ధరిస్తూ వస్తున్నారు. చేతిరుమాలు, తువ్వాలు, లుంగీలు, ఇలా ప్రతిదీ చేనేతనే ఉపయోగిస్తారు. తాను చేనేత వస్త్రాలను ధరించడమే కాకుండా కుటుంబ సభ్యులను, తోటివారిని, ఇరుగు పొరుగు వారిని సైతం చేనేతనే వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇంట్లోని దుప్పట్లు, మొదలు వివిధ రకాల అలంకరణ వస్త్రాలను సైతం చేనేతవే వినియోగిస్తుంటారు. ఇక పుట్టినరోజు, వివాహాది శుభకార్యాలకు కానుకలుగా చేనేత ఉత్పత్తులనే అలంకార వస్తువులుగా తయారు చేయించి ఇస్తుండడం ఆయన ప్రత్యేకత. ఏటా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారులను చేనేత తువ్వాళ్లతో సత్కరించడం ఆయన ఆనవాయితీ. మిత్రుల వివాహాది శుభకార్యాలకు హ్యాండ్లూమ్ షోరూంను సందర్శించేలా చేసి, నచ్చిన వస్త్రాలు తక్కువ ధరలకు లభ్యమయ్యేలా ప్రోత్సహిస్తున్న తీరును ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. హ్యాండ్లూమ్‌ను ఆదరిస్తే.. ఒక నేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకున్నట్లేనని ఆయన అభిప్రాయం. మిత్రులు కలిసిన సందర్భంగా డియర్ ఫ్రెండ్.. వీఆర్ హ్యాండ్లూమ్ అంటూ కరచాలనం చేయడం ఆయన ప్రత్యేకత.

ఓటీటీ వేదికపై.. అహం రీబూట్

ఒకే ఒక్క క్యారెక్టర్.. దాదాపు గంటన్నర సినిమా. సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'ఆహా' ఓటీటీ వేదికగా విడుదలై, కొత్తదనాన్ని ప్రదర్శిస్తున్న చిత్రం 'అహం రీబూట్'. ఫిల్మ్ మేకింగ్‌లో.. ఓటీటీ ప్లాట్‌ఫాం వినూత్న ప్రయోగాలకు వేదికగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఐతే ఓటీటీ వేదికగా సినిమా రూపు రేఖలే మార్చుతూ విభిన్న కథాంశంతో, సరికొత్త సినిమాటిక్ ఫీల్‌తో వస్తున్న సినిమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ కోవలోకే వస్తుంది ప్రముఖ సినీనటుడు సుమంత్ నటించిన 'అహం రీబూట్'. – సాక్షి, సిటీబ్యూరో

- సోలో క్యారెక్టర్‌తో గంటన్నర సినిమా..
- ఓటీటీ వేదికగా గుర్తింపు పొందుతున్న వినూత్న ప్రయోగం..
- 2 నెలల్లో 2 కోట్ల వ్యూస్ సొంతం చేసుకున్న 'అహం రీబూట్'..

న్యూ ఫిల్మ్ మేకింగ్‌కు పట్టం కడుతున్న ప్రేక్షకులు..

ఓటీటీ వేదికపై సోలో షో.. ఓన్లీ వన్..

నగరం వేదికగా రూపుదిద్దుకున్న ఈ సినిమా మరోసారి తెలుగువారి ప్రయోగాత్మకతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. ఆహాలో విడుదలైన 2 నెలల్లోనే 2 కోట్ల మంది వీక్షించిన చిత్రంగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా తన అనుభవాలను సాక్షితో పంచుకున్నారు దర్శకులు ప్రశాంత్ సాగర్..

ట్రయల్ ట్రైలర్ అడిగారు..

95 నిమిషాల నిడివి ఉన్న సినిమా పూర్తయ్యేంత వరకూ ఒకే ఒక్క క్యారెక్టర్‌ను ప్రేక్షకులకు అనుసంధానం చేయడం అంత సులువు కాదంటున్నారు దర్శకులు ప్రశాంత్‌సాగర్. సినిమా కోసమే నగరానికొచ్చి, సినిమాతోనే ప్రయాణం చేయాలంటే ఇంతకుముందెన్నడూ చూడని ప్రయోగాలను ఆసక్తికరంగా చూపించగలగాలని ఆయన అంటున్నారు. ఒక రాత్రిలో జరిగే కథతో రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్కినేని సుమంత్‌కు చెప్పాను. వినూత్న ప్రయోగాలు, నూతనత్వం ఉన్న కథాంశాలను వదులుకోని సుమంత్.. ట్రయల్ ట్రైలర్ అడిగారు. ఆయన అడిగినట్టుగానే చేసి ఇవ్వడంతో నో చెప్పకుండా చేసి ఒప్పుకున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రయోగాత్మక చిత్రాన్ని ఈ మధ్యనే అమేజాన్ వేదిక కూడా ప్రసారం చేస్తుంది.





ఇదే తరహాలో గతంలోనూ..

సోలో క్యారెక్టర్‌తో గతంలోనూ ఒకటీ, రెండు సినిమాలు వచ్చినప్పటికీ ఓటీటీ వేదికగా కొత్త ఫిల్మ్ మేకింగ్‌తో ఆకట్టుకుంటుంది 'అహమ్ రీబూట్'. కొత్త సినిమాను పరిచయం చేయాలనే నిర్మాత రఘువీర్ గోరపర్తి లక్ష్యం నెరవేరడం మరింత సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోగంతో కంటెంట్ రైటర్ సుమలత, ప్రేక్షకులను సంగీతంతో ఎంగేజ్ చేసిన శ్రీరాం మద్దూరి మంచి గుర్తింపు పొందుతున్నారు. చిన్న, పెద్ద అని తేడాలేకుండా, నాన్ కమర్షియల్, డీగ్లామర్ సినిమాను కూడా ప్రేక్షకులు ఇంతలా ఆదరించడం తమలాంటి సినిమా ప్రేమికులకు శుభపరిణామం అని అన్నారు.






మొసలిని ఇలా పట్టేశారు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో ఓ ఇంట్లో 10 అడుగుల మొసలి కనిపించడం కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కుక్కలు మొరగడంతో నాగన్న అనే వ్యక్తి బయటకు వచ్చి చూడగా మరుగుదొడ్డి పక్కనే ఉన్న సందులో మొసలి కనిపించింది. వెంటనే ఆయన 100కు డయల్ చేశారు. పోలీసులు వెంటనే స్నేక్ సొసైటీ అధ్యక్షుడు, హోంగార్డు కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన తన టీం సభ్యులతో పాటు పెబ్బేరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాణితో కలిసి అక్కడికి వచ్చారు. నాలుగు గంటల పాటు శ్రమించి మొసలిని తాళ్లతో బంధించారు. ట్రాక్టర్‌లో బీచుపల్లికి తీసుకొచ్చి కృష్ణానదిలో వదిలేశారు. పక్కనే ఉన్న రంగసముద్రం చెరువులో నుంచి దారి తప్పి వచ్చి ఉంటుందని కృష్ణసాగర్ చెప్పారు. మొసలిని అక్కడి నుంచి తరలించిన కానిస్టేబుల్ రామకృష్ణ, స్నేక్ సొసైటీ సభ్యులు గోపాల్, దేవేంద్రం, అవినాష్, సాగర్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

..ప్రత్యామ్నాయంగా ఎదుగుతాం

▶ మొదటి పేజీ తరువాయి

బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు చెందిన చైర్‌పర్సన్లు, సీఈఓలను ఉద్దేశించి మాట్లాడారు.

భారత భవిష్యత్తు చిరునామాగా 'ఫ్యూచర్ సిటీ': హైదరాబాద్‌లో నాలుగో నగరంగా, దేశంలోనే తొలి జీరో కార్బన్ సిటీగా నిర్మించ తలపెట్టిన 'ఫ్యూచర్ సిటీ' భారత భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని రేవంత్ పేర్కొన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ రాష్ట్ర అభివద్ధికి దోహదపడటంతో పాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందన్నారు. ఇందులో ఏఐ హబ్‌తో పాటు, మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా విలేజ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలలో బలమైన పునాదులు వేసుకుందని తెలిపారు.

వీలైనన్ని పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం: సీఎం హోదాలో తొలిసారిగా అమెరికాలో పర్యటిస్తున్న తాను వీలైనన్ని పెట్టుబడులు తెలంగాణకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నానని సీఎం తెలిపారు. నిజాంలు నిర్మించిన 425 సంవత్సరాల పురాతనమైన హైదరాబాద్, ఇంచుమించుగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో సమకాలీనంగా ఉండటం ఆసక్తి రేపుతోందన్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తలందరూ హైదరాబాద్‌కు వస్తే అనుకూలతలు, పెట్టుబడులపై చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి అభివృద్ధి చేయడానికి సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికలపై సీఎం ప్రెజెంటేషన్ ఇచ్చారు.

రూ.1,000 కోట్లతో స్వచ్ఛ్ బయో ఫ్యూయల్ ప్లాంట్: బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ స్వచ్ఛ్ బయో తెలంగాణలో సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్ నెలకొల్పనుంది. మొదటి దశలో సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ నిర్మించనుంది. ఈ ప్లాంట్ ఏర్పాటుతో 250 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందంతో స్వచ్ఛ్ బయో చైర్ పర్సన్ ప్రవీణ్ పరిపాటి ఈ మేరకు చర్చలు జరిపారు.

హెచ్‌సీఏ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

హెల్త్‌కేర్‌లో ప్రపంచంలో పేరొందిన హెచ్‌సీఏ హెల్త్‌కేర్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది మార్చిలో ఇంక్యుబేషన్ ఫెసిలిటీని ప్రారంభించిన ఈ సంస్థ తమ కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో హెచ్‌సీఏ హెల్త్‌కేర్ ప్రతినిధులు సమావేశమై దీనిపై చర్చలు జరిపారు.

జనాగ్రహాన్ని తట్టుకోలేరు

సీఎం చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక

- భయపెడదామనుకుంటే మిమ్మల్ని బంగాళాఖాతంలో కలిపేస్తారు
- ఈ దారుణాలను హైకోర్టు, సుప్రీం కోర్టుల దృష్టికి తీసుకెళ్తాం
- సుప్రీంకోర్టు జడ్జిగా పని చేసిన గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తలకు జగన్ పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విధ్వంసాలు, హత్యాకాండతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏం సాధించాలనుకుంటున్నారో చెప్పాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోమని చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వల్లే రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని మండిపడ్డారు. గ్రామ స్థాయి నుంచి భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలా చేస్తే ప్రజలు భయపడతారనుకోవద్దని, వారి ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు పద్ధతి మార్చుకుని పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం నవాబ్‌పేటలో టీడీపీ మూకల చేతిలో తీవ్రంగా గాయపడి విజయవాడ సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, గోపి, రామకృష్ణను మంగళవారం సాయంత్రం వైఎస్ జగన్ పరామర్శించారు. ఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. ఆయనేమన్నారంటే..

మీరు చేసే ఈ కిరాతకాలు, దారుణాల వల్ల ప్రజలు భయపడతారనుకుంటున్నారా? ఎవరూ భయపడరు. జనాగ్రహానికి చంద్రబాబును, టీడీపీని బంగాళాఖాతంలో కలిపే పరిస్థితికి దారి తీస్తుంది. సాధారణంగా కొత్త ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం మీద వ్యతిరేకత రావడానికి కాస్తో కూస్తో టైమ్ పడుతుంది. కానీ మొట్టమొదటిసారిగా చూస్తున్నాం. చంద్రబాబు మీద వ్యతిరేకత అన్నది చాలా వేగంగా పెరుగుతోంది. అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా.. ఇవన్నీ ఈరోజు మాకెందుకు ఇవ్వడం లేదని ప్రజలంతా అడుగుతున్నారు. పిల్లల గురించి పట్టించుకోకుండా స్కూళ్లను, చదువులను నిర్వీర్యం చేస్తూ.. ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తూ.. ఏ ఒక్కరూ మిమ్మల్ని ప్రశ్నించకూడదని, రోడ్డెక్కకూడదని భయాందోళనలకు గురి చేయాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి మీ కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవాలని గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ చంద్రబాబు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

రాష్ట్రపతి పాలన విధించాలి..

ఈ అరాచక పాలనపై మేం కచ్చితంగా హైకోర్టు తలుపు తడతాం. అవసరమైతే సుప్రీం కోర్టును కూడా ఆశ్రయిస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయమైన ఘటనలు, ఇక్కడి పరిస్థితిని అన్ని రాజకీయ పార్టీలకు వివరించాం. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అన్యాయాలు, అఘాయిత్యాలను వివరించి రాష్ట్రపతి పాలన ఎందుకు విధించకూడదు? అని న్యాయస్థానాలకు నివేదిస్తాం.

గవర్నర్ గారికి విన్నపం..

ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని గవర్నర్‌కు విన్నవిస్తున్నాం. మీరు గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. మీరు రాష్ట్రంలో ఉండగా, మీ కళ్ల ముందే ఇవన్నీ జరుగుతున్నాయి. మీరు కచ్చితంగా జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా గవర్నర్ గారికి విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇది తప్పుడు సంప్రదాయం..

మళ్లీ మళ్లీ చెబుతున్నా చంద్రబాబుకు. మీరు చేస్తున్నది తప్పుడు సంప్రదాయం. ఇది కనుక కొనసాగిందంటే.. మీ ప్రభుత్వం చాలా వేగంగా తుడిచిపెట్టుకుపోతుంది. ఆ తరవాత మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు మేము వారించినా మా కార్యకర్తలు వినే పరిస్థితి ఉండదు. వారంతా టీడీపీ వారికి బుద్ధి చెప్పే విధంగా ఈరోజు చంద్రబాబు బీజం వేస్తున్నారు. మొన్న నంద్యాలలో ఓటు వేశారని మా పార్టీ నేతను ఏకంగా చంపేసిన ఘటనను మీరంతా చూశారు. శుక్రవారం నేను అక్కడికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తా. ఆ ఘాతుకాన్ని రాష్ట్రం, యావత్ దేశం దృష్టికి తీసుకొస్తాం.

నెక్లెస్ రోడ్డులో గద్దర్ స్మృతివనం

ఎకరం స్థలం, రూ.3 కోట్లు కేటాయింపు: ఉప ముఖ్యమంత్రి భట్టి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భట్టి, వివేక్, మధుయాష్కి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మృతివనం నిర్మాణం కోసం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఒక ఎకరం స్థలం, రూ.3 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మంగళవారం రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... గద్దర్ ఫౌండేషన్ చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. మంత్రి సీతక్క మాట్లా డుతూ... గద్దర్ పాటే పోరాటాలకు దిక్సూచి అని గుర్తుచేశారు. తమిళనాడుకు చెందిన ఎంపీ తిరువల్లవన్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేసిన గొప్ప కళాకారుడు గద్దర్ అని కొనియాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఎమ్మెల్యేలు వీరపల్లి శంకర్, గడ్డం వివేక్, మందుల శామ్యూల్, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, క్రాంతికిరణ్, సినీ నటులు పరుచూరి వెంకటేశ్వరరావు, బండ్ల గణేష్, గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ శాంతి సిన్హా, కుటుంబ సభ్యులు వెన్నెల సూర్యం, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత జానపద కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు రచయితలు గద్దర్‌పై రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు.

గర్భిణులకు పరీక్ష

వైద్య పరీక్షల కోసం ఐదు కిలోమీటర్ల నడక



పెంచికల్‌పేట్ (సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సరైన రహదారులు లేక గర్భిణులకు 'నడక' పరీక్ష తప్పడం లేదు. పెంచికల్‌పేట్ మండలంలో మారుమూల గిరిజన గ్రామాలైన మురళీగూడ, జిల్లెడకు చెందిన గర్భిణులు నెలవారీ వైద్యపరీక్షలకు కాలినడకన గుట్ట దిగి ఆస్పత్రికి చేరుకున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన ఏడుగురు గర్భిణులు.. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల సాయంతో ఎత్తైన గుట్టపైనుంచి 5 కి.మీ. దూరం నడిచి కమ్మర్‌గాం చేరుకున్నారు. అక్కడి నుంచి అమ్మఒడి వాహనంలో పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సరైన రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలినడకన పరీక్షల కోసం వస్తున్నామని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షం కురిస్తే కమ్మర్‌గాం వరకు కూడా వాహనాలు రావని వారు తెలిపారు.

రైల్లోనే ప్రసవం..

గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో గర్భిణికి పురిటి నొప్పులు



తల్లీబిడ్డను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

భువనగిరి క్రైం: ఓ నిండు గర్భిణి రైలులో ప్రసవించింది. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ నుంచి బిహార్‌లోని పాట్నాకు ప్రయాణిస్తున్న హీనాక టోస్ అనే గర్భిణికి యాదాద్రి జిల్లా భువనగిరి సమీపంలోకి రాగానే పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో స్టేషన్ మాస్టర్ అనుమతితో భువనగిరి స్టేషన్‌లో రైలుని ఆపి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే గర్భిణిని ఆస్పత్రికి తరలించడం కష్టం కావడంతో, 108 వాహనం ఈఎంటీ విష్ణుమోహన్‌రెడ్డి రైలులోనే కాన్పు చేయగా.. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే మెరుగైన వైద్యం కోసం తల్లీబిడ్డను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా రైలును దాదాపు 35 నిమిషాలపాటు భువనగిరి రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. 108 వాహనం ఈఎంటీ విష్ణుమోహన్‌రెడ్డి, పైలట్ మహేశ్‌ను రైల్వే అధికారులు, ప్రయాణికులు ప్రశంసించారు.

'స్థానిక' ఎన్నికలను సీరియస్‌గా తీసుకుందాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్ర పదాధికారుల భేటీలో నిర్ణయం



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలు మొదలుకుని మండల పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలుపొంది సత్తా చాటాలని భావిస్తోంది. మంగళవారం పార్టీ కార్యాలయంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్రపదాధికారులు, వివిధ సెల్‌ల కన్వీనర్లు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతు రుణమాఫీతో సహా మహిళలు, నిరుద్యోగ యువత, ఇతర వర్గాల ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలుకు పార్టీపరంగా ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

8, 9 తేదీల్లో అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా: సమావేశానంతరం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఆగస్టు 8, 9 తేదీల్లో అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా కార్యక్రమం రూపొందించినట్టు తెలియజేశారు. ఈనెల 10, 11 తేదీల్లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద నివాళులర్పించి, స్మరించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆగస్టు 12, 13 తేదీల్లో జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ కేంద్రాలు, ప్రతి మండలం, మున్సిపాలిటీల స్థాయిలో యువమోర్చా ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 12న మహిళా మోర్చా ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో మహిళలతో బైక్ ర్యాలీల నిర్వహణ, ఆగస్టు 15న రాష్ట్రంలో ప్రతి బూత్‌లో, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని నిర్ణయించామని చెప్పారు. కాగా, రాష్ట్ర పదాధికారుల సమావేశానికి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా మినహా మిగతా 7 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది.

సమాచార వ్యవస్థలో ఊహకందని మార్పులు

- కచ్చితమైన సమాచారాన్ని అందించడమే పీఆర్‌ల బాధ్యత..
- జాతీయ పీఆర్ విద్యా దినోత్సవంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో శ్రీనివాసరెడ్డి

సనత్‌నగర్: సమాచార వ్యవస్థ ఊహకందని విధంగా మారుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ప్రజా సంబంధాల (పీఆర్) నిపుణుల పాత్ర కీలకమని రాష్ట్ర నీటి పారుదల, ఆహారం, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ పీఆర్ విద్యా దినోత్సవం సందర్భంగా బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ యుగంలో పీఆర్‌ల పాత్ర ఎంతో కీలకమనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సమాచార వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనిస్తూనే పౌరులకు వాస్తవిక సమాచారాన్ని చేరవేయడంలో వారి పాత్ర ముఖ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ కన్సార్టియం ఆఫ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్ భూషణ్ నడ్డా మాట్లాడుతూ కార్పొరేట్లు, పీఎస్‌యూలు, ప్రభుత్వాలు, ఎన్జీఓలలో పీఆర్ ప్రాక్టీషనర్ల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పీఆర్ రంగంలో పరిశోధనలు చాలా అవసరమన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం..: జాతీయ పీఆర్ దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మక అవార్డులను ఇదే వేదికపై పలు సంస్థలకు అందజేశారు. ఎన్ఎండీసీ హైదరాబాద్ జనరల్ మేనేజర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్స్) శ్రీనివాసరావు డాక్టర్ సీవీఎస్–పీఆర్ఎస్ఐ బెస్ట్ పీఆర్ మేనేజర్ ఆఫ్ ది ఇయర్–2024 అవార్డును అందుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ టి.రవి కృషికి గాను ఆయనను 'జ్యూరీ ప్రశంస'తో సత్కరించారు. అదేవిధంగా వైజాగ్‌లోని పయనీర్ బ్యూరో చీఫ్ జువ్వాడి లక్ష్మణరావుకు పీఆర్ వాయిస్ లిటరరీ ఎక్సెలెన్స్ అవార్డు లభించింది. వివిధ విద్యా సంస్థలకు చెందిన 16 మంది అత్యుత్తమ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే పలువురు ఉపాధ్యాయులతో పాటు అంకితభావంతో సేవలు అందిస్తున్న కౌన్సెలర్లను అవార్డులతో సత్కరించారు.

బోగస్ కంపెనీలతో పెట్టుబడుల ఒప్పందాలు

బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్



సాక్షి, హైదరాబాద్: బోగస్ కంపెనీల నుంచి పెట్టుబడులు రాబట్టేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికాలో పర్యటిస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ విమర్శించారు. కేసీఆర్ కంటే తానే మెరుగ్గా చేశానని చెప్పుకునేందుకే బోగస్ కంపెనీలతో పెట్టుబ డుల ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మంగళవారం క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ... నాలుగు నెలల క్రితమే ప్రారంభమైన వాల్ష్ కర్రా హోల్డింగ్స్‌లో ఇద్దరు డైరెక్టర్లే ఉండగా వారిద్దరికీ చెరో యాభై షేర్లు మాత్రమే ఉన్నాయన్నారు. జాబితా నుంచి తొలగించిన కంపెనీకి తెలంగాణలో పెట్టుబడులు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మహిళా స్టార్టప్‌లకు రూ.839 కోట్ల పెట్టుబడులు పెడతామంటూ వాల్ష్ కర్రాతో చేసుకున్న ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ బోగస్ కంపెనీల నుంచి పెట్టుబడులు ఎలా సాధ్యమో రేవంత్‌రెడ్డి వివరించాలన్నారు. గతంలోనూ దావోస్‌లో గోదీ ఇండియా అనే బోగస్ కంపెనీతో కూడా ఇలాగే ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే రాష్ట్రంలో పెట్టుబడులు సగానికి పడిపోయాయని విమర్శించారు.

హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

- ఆరు నెలల్లో కార్యకలాపాలు షురూ
- ఆర్‌సీసీఎంతో తెలంగాణ సర్కారు ఒప్పందం
- అమెరికాలో సీఎం రేవంత్ బృందంతో పలు కంపెనీల ప్రతినిధుల భేటీ



ఆర్‌సీసీఎం ప్రతినిధులతో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు



భారత అంధుల క్రికెట్ జట్టును సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా తమ కలలు నెరవేర్చుకునేందుకు వారు చూపుతున్న ప్రతిభను కొనియాడారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం న్యూయార్క్‌లో క్రికెట్ జట్టు సభ్యులతో కాసేపు ముచ్చటించారు.

సాక్షి, హైదరాబాద్: రెండు దశాబ్దాలకు పైగా ఐక్యరాజ్య సమితి, దాని అనుబంధ విభాగాలకు సాంకేతిక భాగస్వామిగా ఉన్న ట్రైజిన్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్, డెలివరీ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సెంటర్ ద్వారా డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమైన కృత్రిమ మేధస్సు సాంకేతిక ఆధారిత పరిష్కారాలను (ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్) సంస్థ అందిస్తుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందంతో ట్రైజిన్ టెక్నాలజీస్ బృందం సమావేశమైంది. రాష్ట్రంలో తాము ఏర్పాటు చేయనున్న సెంటర్‌పై చర్చించింది. ఈ సెంటర్ వచ్చే ఆరు నెలల్లో కార్యకలాపాలను ప్రారంభిస్తుంది. వచ్చే మూడేళ్లలో 1,000 మందికి పైగా ఉద్యోగుల నియామకం, శిక్షణ చేపడుతుంది. ప్రస్తుతం ట్రైజిన్ మొత్తం ఆదాయం 160 మిలియన్ డాలర్లకు పైగా ఉండగా, ప్రపంచ వ్యాప్తంగా 2,500 మంది ఈ సంస్థలో పనిచేస్తున్నారు. భారత్‌లో 1,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వీరిలో హైదరాబాద్ కేంద్రంగా 100 మంది ఉన్నారు.

హైదరాబాద్‌లో ఆర్‌సీసీఎం విస్తరణ

సాంకేతికత, సేవల పరిష్కారాల్లో పేరొందిన ఆర్‌సీసీఎం సంస్థ తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు తాజాగా తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సంస్థ సీఈఓ గౌరవ్ సూరి నేతృత్వంలోని ఆర్‌సీసీఎం ప్రతినిధి బృందం అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ప్రస్తుతం అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ.. విదేశాల్లో తమ కార్యకలాపాలను విస్తరిస్తూ పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి అని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ సేవల విస్తరణకు హైదరాబాద్ కేంద్రం కీలకంగా నిలుస్తుందన్నారు. డేటా మేనేజ్‌మెంట్, డేటా స్ట్రాటజీ రంగంలో గుర్తింపు కలిగిన ఆర్‌సీసీఎం వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను నియమించుకుంటుందని చెప్పారు. మౌలిక సదుపాయాలతో పాటు నైపుణ్యంకలిగిన మానవ వనరులు ఉన్నందున తమ అంతర్జాతీయ కార్యకలాపాలకు హైదరాబాద్‌ను అనువైన ప్రదేశంగా ఎంచుకున్నట్లు గౌరవ్ సూరి తెలిపారు. డీఈ షా గ్రూప్, బ్లాక్‌స్టోన్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల మద్దతుతో స్వతంత్ర సంస్థగా ప్రారంభమైన ఆర్‌సీసీఎం.. బ్యాంకులు, సంస్థాగత ఆస్తుల నిర్వాహకులు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు సంబంధించిన డేటా, వాటి కార్యకలాపాలపై విశ్లేషణలు అందిస్తుంది.

ఐటీ బహుముఖ వృద్ధికి ప్రాధాన్యం: సీఎం రేవంత్

ఐటీ రంగంలో బహుముఖ వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అమెరికాలో పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పెట్టుబడులతో తెలంగాణకు వచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాలకు హైదరాబాద్ నూతన ఆవిష్కరణ కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు. సాంకేతిక వృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య సహకారం తప్పనిసరి అని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సీహెచ్‌ఓ బదిలీ.. సిబ్బంది కంటతడి



అర్వపల్లి: సాధారణంగా ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుంటే విద్యార్థులు రోదిస్తారు.ఇందుకు భిన్నంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఓ ఉద్యోగి బదిలీపై వెళ్తుంటే సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు.సూర్యాపేట జిల్లా అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక ఆరోగ్య అధికారి (సీహెచ్‌ఓ)గా ఆరేళ్లపాటు పనిచేసిన ఎల్.చరణ్ నూతనకల్ మండల సీహెచ్‌ఓగా బదిలీ అయ్యారు. మంగళవారం అర్వపల్లి పీహెచ్‌సీలో నిర్వహించిన సన్మాన కార్య క్రమంలో చరణ్‌ను ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పట్టుకొని 'మీరు వెళ్లొద్దు.. ఇక్కడే ఉండాలి' అంటూ రోదించారు



రెవెన్యూ శాఖలో అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసి విజ్ఞప్తి చేసింది.

అదర్ సైడ్


మను బాకర్

గెలుపు, ఓటములకు అతీతంగా కొన్ని విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి. ఆట అంటే 'గెలుపు' లేదా 'ఓటమి' మాత్రమే కాదు. గెలుపుకు ముందు, గెలిచిన తరువాత, ఓటమికి ముందు ఓటమికి తరువాత విషయాలు కూడా పసందుగా ఉంటాయి. 'షూటర్ మను బాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో భోజనం చేయలేదు' అనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అరె మనకు పతకాలు తెచ్చిన అమ్మాయి భోజనం చేయలేదా? ఎందుకు చేయలేదు?


తల్లిదండ్రులతో మను బాకర్

ఒట్టు... మను బాకర్ భోజనమే చేయలేదు!

పారిస్ ఒలింపిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మరో కాంస్యాన్ని గెలుచుకొని రికార్డ్ సృష్టించింది షూటర్ మను బాకర్. 'ఇది మను ఒలింపిక్స్' అంటూ క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంది. 25 మీటర్‌ల విభాగంలో మూడో పతకం కొద్దిలో చేజారింది.

హిస్టారిక్ మెడల్ హాట్రిక్ మిస్ అయిన తరువాత ఆమె ఏం ఆలోచించిందనే విషయానికి వస్తే... మొదటిది... నాలుగు సంవత్సరాల తరువాత లాస్ ఏంజెల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్ గురించి. రెండోది... భోజనం గురించి. మొదటి విషయం సరే, రెండో విషయమే అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ఆడి ఆడి అలిసిపోయిన మను బాకర్‌ను విశ్రాంతి గురించి అడిగినప్పుడు... 'నేను చేసే మొదటి పని ఇంటి భోజనం చేయడం. ఇన్ని రోజులు నేను భోజనం చేయలేదు. విలేజ్‌లో బ్రేక్ ఫాస్ట్ చేసి, షూటింగ్ రేంజ్‌కు వచ్చేదాన్ని. అక్కడ స్నాక్స్ తినేదాన్ని. విలేజ్‌లో మధ్నాహ్న భోజనం ఉంటుంది. ప్రాక్టీస్ తర్వాత 3 లేదా 5 గంటల మధ్య మాత్రమే తిరిగి భోజనశాలకు రావడానికి వీలయ్యేది. ఆ సమయానికి మధ్యాహ్న భోజనం అయిపోయేది. దాంతో సాయంత్రం ఏదో తినేదాన్ని' అని ఒక ఇంటర్వ్యూలో చెప్పింది మను బాకర్.

డైట్ రొటీన్

భోజనానికి సంబంధించి వ్యక్తిగత ఇష్టాయిష్టాలు వేరు. క్రీడాకారిణిగా వేరు. శాకాహారి అయిన మను బాకర్ 'డైట్ రోటిన్' విషయానికి వస్తే... హెల్తీ ఫ్యాట్స్. లో-జీఐ కార్బోహైడ్రేడ్స్‌తో కూడిన సింపుల్ డైట్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. అలసట, గాయాలకు దూరంగా ఉండడానికి డైట్‌లో హైడ్రేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. మను డైట్‌లో రకరకాల పండ్లు. విటమిన్ సి అధికంగా ఉండే కూరగాయలు ఉంటాయి. హై-ఎనర్జీ. షుగర్ ఫుడ్స్‌కు దూరంగా ఉంటుంది. ఆహారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో కంటినిండా నిద్రకు అంతే ప్రాధాన్యత ఇస్తుంది. యోగా, జిమ్ తరువాత ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది గంటలు షూటింగ్ ప్రాక్టీస్ చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పెయింటింగ్స్ వేస్తుంటుంది. మైండ్ ఫోకస్డ్‌గా ఉండడానికి క్రియేటివ్ వర్క్ ఉపయోగపడుతుందని చెబుతుంది మను బాకర్.

మను మధ్యాహ్న భోజనానికి దూరమైన విషయం ఆమె తల్లి సుమేధకు కూడా తెలిసిపోయింది.

కుమార్తె విజయం కోసం రోజూ ప్రార్థనలు చేసిన ఆమె ఇలా అన్నది...'మను ఇంటికి తిరిగి రాగానే వేడి వేడి ఆలూ పరోట తినిపిస్తాను. మనుకు ఆలూ పరోట అంటే ఎంతో ఇష్టం'

'కుమార్తె గెలుపు వార్త మాత్రమే వినాలి... తన ఓటమిని చూడలేను' అనుకుందో ఏమో మను బాకర్ లైవ్ మ్యాచ్‌లు చూడడానికి ఇష్టపడేది కాదు సుమేధ.

'మా అమ్మ నన్ను ఛాంపియన్ చేయడం కోసం ఎంతో కష్టపడింది. అమ్మా... నువ్వు ఎప్పుడు ఆయురారోగ్యాలతో ఉండాలి' అంటున్న మను బాకర్ అమ్మ చేతి వంట కోసం ఎదురు చూస్తోంది.

'ఏదైనా సరే, మా ఇంట్లో అమ్మ చేతివంట తినడం అంటే ఎంతో ఇష్టం. ఐ రియల్లీ లవ్ ఆలూ పరోటా. ఆలూ పరోటా తినక నాలుగు నెలలు అవుతోంది' అంటుంది మను బాకర్

మనకు విజయాలు మాత్రమే కనిపిస్తాయి. ఆ విజయాల వెనుక ఎన్ని సర్దుబాట్లు ఉంటాయో చెప్పడానికి మను బాకర్ ఒక ఉదాహరణ.

ఒకటి రెండు రోజులంటే ఫరవాలేదుగానీ ఎన్నో రోజులు మధ్నాహ్న భోజనం లేకుండా గడిపింది మను. ఆ సమయంలో ఆమెకు కోపం రాలేదు. ఎందుకంటే మను బాకర్ 'గెలుపు' ఆకలితో ఉంది. రెండు పతకాలతో ఆ ఆకలి తీరింది.


భర్త సజిన్, పిల్లలతో భావన

ఈ తల్లి ఒక అద్భుతం

ప్రకృతి ప్రమాదాలు సంభవించినప్పుడు పాత బట్టలు, గిన్నెలు తీసుకుని బయల్దేరతారు కొందరు. కానీ, తల్లిని కోల్పోయి పాలకోసం ఏడుస్తున్న చంటిపిల్లలకు తన పాలు ఇవ్వడానికి బయల్దేరింది ఆ తల్లి.

వయనాడ్ వారియర్స్

ప్రకృతి ప్రకోపంతో వయనాడు తల్లడిల్లితే ఆ విషాదంలో కొందరు శిశువులు తల్లిపాలు లేక అల్లాడారు. అయితే ఆ వార్త తెలిసిన వెంటనే ఇడుక్కికి చెందిన భావన బాధిత శిబిరాల దగ్గరకు వెళ్లి తన పాలు అందించింది. నాలుగేళ్ల వయసు, నాలుగు నెలల వయస్సు గల ఇద్దరు పిల్లలు ఆమెకు ఉన్నారు. ఆమె భర్త సజిన్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. సేవా కార్యక్రమాలు కూడా చేస్తాడు. వయనాడ్‌లోని పసికందుల అవస్థను భార్యకు చెప్పి తల్లి పాలు ఇచ్చేందుకు ప్రోత్సహించాడు. ఇడుక్కిలోని వారి ఇంటి నుండి పికప్ ట్రక్‌లో కేరళలోని వయనాడ్ కొండలపైకి వెళ్లి మెప్పాడిలోని శిబిరాల్లో కుటుంబాలకు సేవ చేసిన తర్వాత ఇడుక్కికి తిరిగి వచ్చారు ఆ దంపతులు.

'మేం కొన్ని శిబిరాలు, హాస్టళ్లను సందర్శించాం. నేను ఆరు నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న కొంత మంది పిల్లలకు నా పాలు ఇచ్చాను. కొందరికి ఆహారాన్ని తినిపించాను. కొండచరియలు విరిగిపడి గాయపడిన తల్లులు కోలుకున్న వెంటనే తమ పిల్లల బాధ్యతలు స్వీకరించారు. మేం ఒక కుటుంబంగా పిల్లల్ని చూసుకున్నాం. నేను చేస్తున్న పని తెలిసి చాలా మంది మెచ్చుకున్నారు. కొందరు మా ట్రిప్‌ను స్పాన్సర్ చేస్తామన్నారు. కానీ, ఆ మాత్రం ఖర్చును భరించలేమా? నేను తల్లిని, పిల్లలకు తల్లి పాలు ఉత్తమమని నాకు తెలుసు. అందుకే, వాటిని కొందరికైనా అందించాలనుకున్నాను' అని భావన చెప్పింది.

స్త్రీని కాబట్టి వెనక్కు తగ్గాలా?

ప్రమాదం జరిగినప్పుడు స్త్రీలను అక్కడకు వెళ్లనివ్వరు. చాలామంది స్త్రీలు తమ భర్త, కొడుకులను సహాయానికి పంపడానికి సంశయిస్తారు. కాని వయనాడ్ వరద బీభత్సం సంభవించినప్పుడు ఒక అంగన్‌వాడి టీచర్ రక్షణ దళాలతో సమానంగా రంగంలో దిగింది. సహాయక చర్యల్లో పాల్గొంది. 'ఇంత దారుణ పరిస్థితిలో అందరూ ఉంటే స్త్రీని కాబట్టి నేను వెనక్కు తగ్గాలా?' అని ప్రశ్నించిందామె.

వయనాడ్‌లోని చిన్న పల్లె ముప్పైనాడ్. అక్కడ అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తోంది 36 ఏళ్ల విజయకుమారి. జూలై 30 తెల్లవారుజామున నాలుగు గంటలకు ఫోన్ కాల్ అందుకుంది. వాళ్ల పల్లె నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న చూరల్‌మలను వరద చుట్టుముట్టిందని అందరూ ప్రమాదంలో ఉన్నారని. ఆమె అంగన్‌వాడి టీచర్. ప్రమాదస్థలంలో ఆమెకు ఏ విధమైన విధులు లేవు ఒక ఉద్యోగిగా. ఒక పౌరురాలిగా ఎలాంటి నిర్బంధం లేదు సేవకు. కాని ఆమె ఆగలేకపోయింది. వెంటనే బయల్దేరడానికి ఇంటి నుంచి బయటకు వచ్చింది. బయట భారీ వర్షం. హోరుగాలి. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. అయినా సరే తన టూ వీలర్ తీసి చూరల్‌మలకు బయలుదేరింది. తెల్లవారుజాము ఐదు అవుతుండగా అక్కడకు చేరుకుంది.

కాని అక్కడ కనిపించిన దృశ్యం ఆమెను అవాక్కు చేసింది. తనకు బాగా పరిచయమైన ప్రాంతం, జనావాసం ఇప్పుడు కేవలం బురద దిబ్బ. ఎవరు ఏమయ్యారో తెలియదు. సహాయ బృందాలు వచ్చి అప్పుడప్పుడే సహాయక చర్యలు మొదలెట్టాయి. విజయకుమారి ఏమీ ఆలోచించలేదు. వెంటనే రంగంలో దిగింది. వారికి తనను పరిచయం చేసుకుని అగ్నిమాపక బృందం వారి షూస్, ఇనుపటోపి పెట్టుకుని రంగంలో దిగింది. ఆ తర్వాత ఆమె చేసినదంతా ఎవరూ చేయలేనంత సేవ.

'నా ఎదురుగా మహా విపత్తు. ప్రాణం పోయిన వారు ఎందరో. ఇలాంటి సందర్భంలో స్త్రీగా వెనక్కు తగ్గాలా? అనిపించింది. కాని మనిషిగా ముందుకే వెళ్లాలని నిశ్చయించుకున్నాను. సహాయక చర్యల్లో పాల్గొన్నాను. తెల్లవారుజాము 5 నుంచి 8 లోపు ఎన్నో మృతదేహాలను వెలికి తీసి రవాణా చేయడంలో సాయ పడ్డాను' అందామె.


విజయకుమారి

పనికి వచ్చిన కరాటే

విజయకుమారికి పోలీసు కావాలని చిన్నప్పటి నుంచి కోరిక. పోలీసు కావాలని కరాటే నేర్చుకొని బ్రౌన్ బెల్ట్ వరకూ వెళ్లింది. అంతేకాదు పరీక్షలు రాసి పోలీస్‌గా సెలెక్ట్ అయ్యింది కూడా. కాని వాళ్ల నాన్నకు ఆమె ఆ ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. అపాయింట్‌మెంట్ లెటర్ చింపేశాడు. ఆమె అంగన్‌వాడి టీచర్‌గా మిగలాల్సి వచ్చింది. 'పోలీస్ కావాలని నేను తీసుకున్న కరాటే శిక్షణ, చేసిన ఎక్సర్‌సైజులు నాకు ఈ సమయంలో తోడు వచ్చాయి. రక్షణ దళాలతో సమానంగా నేను కష్టపడ్డాను. మనిషికి మనిషి సాయం చేయాల్సిన సమయం ఇది. ముఖ్యంగా ఈ సమయంలో ఎందరో స్త్రీలు దుఃఖంతో స్పృహ తప్పారు. సహాయక బృందాల్లో అందరూ మగవారే ఉంటారు. వారు ఓదార్చలేరు. కాని నేను స్త్రీని కావడం వల్ల వారిని దగ్గరకు తీసుకొని ఓదార్చగలిగాను. ఇలాంటి సందర్భాల్లో స్త్రీలు ఉండాలి స్త్రీల కోసం' అంటుంది విజయకుమారి. ఆమె సేవలను అందరూ మెచ్చుకుంటున్నారు.

లీగల్

వీళ్లు విడాకులు తీసుకోవచ్చా?

- దంపతులలో ఎవరి తప్పూ లేకపోయినా విడాకులు తీసుకోవచ్చా?

పాశ్చాత్య దేశాలలో, ముఖ్యంగా అమెరికాలోని కొన్ని రాష్ట్రాలలో దంపతులలో ఏ తప్పూ లేకపోయినా 'నో ఫాల్ట్ డివోర్స్' (అపరాధరహిత విడాకులు) పేరుతో విడాకులు ఇచ్చే చట్టం అమలులో ఉంది. అలాగే 'ఇర్రిట్రీవబుల్ బ్రేక్‌డౌన్ ఆఫ్ మ్యారేజ్' (పునఃస్థాపనకు వీలులేని వివాహ బంధం)లో కూడా విడాకులు తీసుకునేందుకు చాలా దేశాలలోని చట్టాలు వీలు కల్పిస్తున్నాయి. అయితే భారతదేశంలోని పెళ్లిళ్లను నియంత్రించే రెండు ప్రాథమిక చట్టాలైన హిందూ వివాహ చట్టం 1955, ప్రత్యేక వివాహ చట్టం 1954 అపరాధ రహిత విడాకులను, పునఃస్థాపనకు వీలులేని వివాహ బంధంలో విడాకులను మంజూరు చేసేందుకు ఆ ప్రాతిపదికలను అంగీకరించవు.

చేసుకోవడం, కోర్టు ఆదేశం ఇచ్చినప్పటికీ తిరిగి సంసార జీవితం ఆరంభించకపోవడం వంటివి మాత్రమే విడాకులు తీసుకోవడానికి ప్రాతిపదికగా పరిగణించబడతాయి (గ్రౌండ్స్ ఫర్ డివోర్స్). కాని 1978 లోనే, 71వ లా కమిషన్ తన సిఫార్సులలో 'ఇర్రిట్రీవబుల్ బ్రేక్ డౌన్ ఆఫ్ మ్యారేజ్'ను విడాకులు తీసుకోవడానికి ఒక ప్రాతిపదికగా/కారణంగా గుర్తించేలా చట్టంలో మార్పులు చేయాలి అని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను పరిగణిస్తూ, ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు చాలా కేసులలో 'ఇర్రిట్రీవబుల్ బ్రేక్డౌన్ ఆఫ్ మ్యారేజ్' కింద విడాకులు మంజూరు చేసింది. అంతేకాదు విదేశాలలో నివసిస్తున్న భారతీయులు ఒకవేళ ఈ ప్రాతిపదికన విడాకులు తీసుకొని ఉంటే, భారతదేశం



భార్య-భర్తల కొన్ని సంవత్సరాల పాటు విడిపోయి ఉండి, వారి వివాహ బంధం తిరిగి అతుక్కునే వీలులేనంతలా తెగిపోయి, ఇరువురు కలిసి బతికే ఆస్కారం లేకుండా పోయివున్న సందర్భాలను 'ఇర్రిట్రీవబుల్ బ్రేక్డౌన్ ఆఫ్ మ్యారేజ్' (పునఃస్థాపనకు వీలులేని వివాహ బంధం) అంటారు. ఇలాంటి వివాహ బంధాలు కేవలం చట్టం దృష్టిలో మాత్రమే వివాహంగా మిగిలి ఉంటాయి. అలాగే 'నాకు నా భార్యపై (లేదా భర్తపై) ఎటువంటి ఫిర్యాదులు లేవు, వారు వ్యక్తిగతంగా మంచివారే, మా ఇద్దరి మధ్య లేనిది సఖ్యత మాత్రమే. నాకు నా భార్య (లేదా భర్త) విడాకులు ఇవ్వను అంటున్నారు. అందుకే నాకు నో ఫాల్ట్ డివోర్స్ ఇవ్వండి' అని అడిగితే భారతదేశం లోని ఏ చట్టం ప్రకారమూ విడాకులు ఇవ్వడం కుదరదు. భాగస్వామిపై హింసకు పాల్పడడం, అకారణంగా వదిలేసి వెళ్లడం, వివాహేతర సంబంధం కలిగి ఉండటం, నయం కాలేని అంటు వ్యాధులు కలిగి వుండటం, హేయమైన నేరారోపణ రుజువు కావటం, సంసార జీవనానికి పనికిరాకుండా ఉండడం, మతమార్పిడి

లోని ఏ చట్టంలోనూ ఆ ప్రాతిపదిక లేదు కాబట్టి విడాకులు చెల్లవు అనడం సమంజసం కాదు - అలా విదేశాలలో పొందిన విడాకులు చట్టబద్ధమే అని కొన్ని కేసులలో తీర్పునిచ్చింది. ''నో ఫాల్ట్ డివోర్స్'' - ''ఇర్రిట్రీవబుల్ బ్రేక్డౌన్ ఆఫ్ మ్యారేజ్'' వంటి చట్టాలకు భారత దేశం పూర్తిగా సిద్ధంగా లేకపోయినప్పటికీ, వీలైనంత మేర సఖ్యత కుదిర్చేలా ప్రయత్నించి, వీలుకాని పక్షంలో సత్వరమే విడాకులు మంజూరు చేసే లాగా చట్టం మారాలి. పరస్పర ఒప్పందం/అంగీకారం ఉంటే భార్యాభర్తలు ఇద్దరూ కలిసి వివాహం అయిన ఒక సంవత్సరం తర్వాత మ్యూచువల్ డివోర్స్ పొందవచ్చు. ఇదివరకు లాగా విడాకుల దరఖాస్తు చేసిన తరువాత ఆరు నెలలు ఆగవలసిన అవసరం లేదు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వకేట్

ఆహారం



ఇడ్లీ మీద నెయ్యి వేసుకునే అలవాటు మంచిదేనా? ఇలా తింటే బరువు పెరుగుతారా?

ఇడ్లీ మీద నెయ్యి రాసుకుని తినే అలవాటు మంచిదే. ఇలా తింటే బరువు పెరుగుతారా అనే సందేహంలో కూడా వాస్తవం ఉంది. బరువు పెరుగుతారు. అయితే ఇడ్లీ, నెయ్యి ఆరోగ్యకరమైనవే. కాబట్టి ఆరోగ్యంగా బరువు పెరగడం, వ్యాయామంతో ఫిట్‌నెస్ సాధించడమే హెల్దీ లైఫ్ స్టైల్.

ఇడ్లీలో కేలరీలు, ప్రొటీన్, ఫ్యాట్ తక్కువ, కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఒక టేబుల్ స్పూన్ నెయ్యిలో 120 నుంచి 130 కేలరీలు, అరవై శాతం సాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. కార్బొహైడ్రేట్‌లు, ప్రొటీన్‌లు తక్కువ. ఇడ్లీలో నెయ్యి వేసుకుని తిన్నప్పుడు నెయ్యి మోతాదును బట్టి మూడు వందల నుంచి ఆరు వందల కేలరీలు అందుతాయి.

నెయ్యి కావాలి!

కొవ్వులో కరిగే ఎ,డి,ఇ,కె విటమిన్‌ల కోసం దేహానికి నెయ్యి అవసరమే. అలాగే దేహంలో వాపులను నివారించే కాంజుగేటెడ్ లినోలిక్ యాసిడ్‌ను దేహం సరిగ్గా పీల్చుకోవడానికి కూడా నెయ్యి ఉండాలి. ఇడ్లీ మీద నెయ్యి వేసుకుని తినడానికి భయపడాల్సిన అవసరం లేదు. ఒకటి లేదా రెండు టీ స్పూన్‌లకు పరిమితం చేస్తే మంచిది. అలాగే రోజువారీ డైట్‌లో ప్రొటీన్, ఫైబర్ సమృద్ధిగా ఉండేలా చూసుకుంటూ రోజు మొత్తంలో ఆహారంలో ఎన్ని కేలరీలు చేరుతున్నాయో గమనించుకోవాలి.


సుజాత స్టీఫెన్ ఆర్.డి.
న్యూట్రిషనిస్ట్

* తల్లిపాల వారోత్సవాలు

పాల బంధం



అన్ని దానాల్లోకెల్లా ఉత్తమమైనది అన్నదానం అంటారు. అది పెద్దలకు. మరి చంటి పిల్లలకు? తల్లిపాలు తాగే వీలు లేక పోతపాలు పడక ఆకలితో అల్లాడే చిన్నారి కూనల కోసం తల్లిపాలను దానం ఇవ్వడం ఒక బాధ్యత. తల్లిపాలు పిల్లలకు జీవశక్తి. కాని అవి అందరికీ అందవు. నేటికీ దేశంలో తల్లిపాల బ్యాంకులు అతి తక్కువ ఉన్నాయి. ఆరోగ్యకరమైన బాలింతలు తమ పిల్లలకు సరిపడా పాలు ఇచ్చాక ఇంకా ఎక్కువ ఉంటే అవి దానం చేసే వీలు కొన్నిచోట్ల ఉంది. అక్కడి నుంచి పాలు తెచ్చుకుని తమ పిల్లలకు తాగించే వీలు తల్లులకు ఉంది. 'తల్లిపాల వారోత్సవాల' సందర్భంగా తల్లిపాల బ్యాంకుల గురించి ఒక అవగాహన.

పుట్టిన వెంటనే పసిబిడ్డకు తల్లిపాలు నోటికి అందితే ప్రాణం పుంజుకుంటుంది. కాని కొందరు తల్లులు అనేక కారణాల రీత్యా బిడ్డకు చనుబాలు ఇవ్వరు. ఇలాంటి స్థితి నుంచి తల్లులను సొంత బిడ్డలకు పాలు ఇచ్చేందుకు ప్రోత్సహించే కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తూనే ఉన్నాయి. తల్లిపాల గురించి అవగాహన కల్పించడానికి కేంద్రం 'మదర్స్ అబ్సల్యూట్ ఎఫెక్షన్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ప్రసవం తర్వాత కొందరు తల్లులకు పాలు పడవు. లేదా అనారోగ్య కారణాల రీత్యా పాలు ఇచ్చే వీలు ఉండదు. కాని పిల్లలు తల్లి పాలు తాగే స్థితిలో ఉంటారు. ఇలాంటి వారి కోసం తల్లిపాల బ్యాంకులు కీలకంగా మారాయి. కాని ఇవి ఉండాల్సినన్ని లేవు. దేశ వ్యాప్తంగా ఇప్పటికి కేవలం 90 తల్లిపాల బ్యాంకులు ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు సిద్దిపేట, ఖమ్మంలలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పాల బ్యాంకులు ఉన్నాయి. పాల బ్యాంకులకు ఇతర రాష్ట్రాల నుంచి తల్లిపాలను పంపడానికి 'సుదేనా హెల్త్ ఫౌండేషన్' కృషి చేస్తోంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు కూడా తల్లిపాలను నిల్వ చేసి, శిశువులకు అందజేస్తున్నాయి

బ్లడ్ బ్యాంకులను పోలిన విధంగా!

రక్తదానం చేసినట్టుగానే నవజాత శిశువుల ప్రాణాలను రక్షించడానికి తల్లిపాలను దానం చేయవచ్చు.



పాలిచ్చే తల్లులు పంపింగ్ మెషీన్లను ఉపయోగించి లేదా చేతితో అదనపు పాలను సేకరిస్తారు. ఆ తర్వాత వారికి సంబంధం లేని నవజాత శిశువుకు విరాళంగా ఆ పాలను అందిస్తారు.

- హెచ్ఐవి, హెపటైటిస్, లైంగిక వ్యాధులు లేని తల్లుల నుంచి మాత్రమే టెస్ట్ రిపోర్ట్స్ ఆధారంగా పాల సేకరణ చేస్తారు. అందుకని తల్లులు తమ ఆరోగ్య నివేదికలను ముందుగా పాల బ్యాంకుకు ఇవ్వాలి.

ఆసియాలోనే మొట్టమొదటి తల్లిపాల బ్యాంకు

ముంబైలోని సియోన్ హాస్పిటల్‌లో హ్యూమన్ మిల్క్ బ్యాంక్‌ను 1989లో ప్రారంభించారు. ఇది ఆసియాలో మొట్టమొదటి బ్రెస్ట్ మిల్క్ బ్యాంకు. ఈ ఐదేళ్లలో 43,412 మంది తల్లుల నుండి పాలను విరాళంగా పొందింది. 10,523 మందికి పైగా నవజాత శిశువుల ప్రాణాలను రక్షించే పాలను అందించింది. 1989లో నియోనాటాలజీ విభాగం అధిపతి డాక్టర్ జయశ్రీ మోండ్కర్ చొరవతో ఈ పాల బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి యేటా 10 వేల నుండి 12 వేల మంది శిశువులు పుడితే వీరిలో 1,500 నుండి 2,000 మంది బ్యాంకు నుండి పాలు పొందుతున్నారు. సియోన్ హాస్పిటల్ మిల్క్‌బ్యాంక్ గుజరాత్, గోవా, మధ్యప్రదేశ్, డామన్, దయ్యూతో పాటు మహారాష్ట్రలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలోని పాల బ్యాంకుల ఏర్పాటుకు మద్దతు ఇస్తుంది.

సంప్రదించి.. పాలు ఇవ్వచ్చు...

తల్లికి ఆరోగ్య సమస్యలు ఉంటే వారి పిల్లలకు మరో తల్లి పాలు అవసరం అవుతాయి. వీటిని మేం సేకరించి, పాలను స్టెరిలైజ్ చేసి, ఫ్రీజర్‌లో నిల్వ ఉంచుతాం. శిశువులకు అవసరం అయినప్పుడు ఫ్రీజర్ నుంచి తీసి, రూమ్ టెంపరేచర్‌లోకి వచ్చాక ఇస్తాం. హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రిలో 2017 నుంచి సుషేన హెల్త్ ఫౌండేషన్ నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు తల్లి పాలను అందజేసే ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సాధారణంగా ఇక్కడ నెలకు వెయ్యి ప్రసవాలు అవుతుంటాయి. నెలలు నిండకుండా పుట్టినా, తల్లులకు శస్త్రచికిత్స వంటి సమస్యలు ఉంటే ఆ శిశువుకు ఈ పాల బ్యాంక్ నుంచి పాలను అందిస్తాం. ఎవరైనా తల్లులు తమ బిడ్డకు ఇవ్వగా అదనపు పాలను మా బ్యాంక్‌ను సంప్రదించి, ఇవ్వచ్చు. అందుకు తగిన పరీక్షలు చేసి, పాలను ఎలా సేకరించి, ఇవ్వాలో అవగాహన కల్పిస్తాం.



– డా.ఉషారాణి తోట,
ప్రొఫెసర్ ఆఫ్ పిడియాట్రిక్స్, నీలోఫర్ హాస్పిటల్

- ఆరోగ్యకరమైన తల్లులకు తమ పాలు దానంగా ఇవ్వాలని ఉన్నా కుటుంబం అంగీకరించకపోవచ్చు. కుటుంబం ప్రోత్సహిస్తే ఎందరో శిశువులకు మేలు జరుగుతుంది.
- తల్లి పాలను సేకరించి, బ్యాంకుకు ఇచ్చిన తర్వాత, వాటిలో ఏదైనా కలుషితం ఉన్నట్టు తెలిస్తే వెంటనే దాతకు తెలియజేస్తారు. దీని వల్ల ఆ తల్లి ఆరోగ్యస్థితి కూడా మెరుగుపడుతుంది.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ ఉన్న హాస్పిటల్స్, హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, ఇఎస్ఐ హాస్పిటల్, మహబూబ్‌నగర్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కాకినాడలోని ప్రభుత్వ హాస్పిటల్, అమలాపురంలోని డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌ని సంప్రదించి తల్లులు తమ పాలను దానంగా ఇవ్వచ్చు.

– నిర్మలారెడ్డి


పారిస్‌లో భారతీయం

నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

రెజ్లింగ్
మహిళల ఫ్రీస్టయిల్ 53 కేజీలు: అంతిమ్ పంఘాల్ X జైనెప్ యెట్గిల్ (మధ్యాహ్నం గం. 3.05 నుంచి)

వెయిట్‌లిఫ్టింగ్
మహిళల 49 కేజీల (పతక పోరు): మీరాబాయి చాను (రాత్రి గం. 11:00 నుంచి)

అథ్లెటిక్స్
మిక్స్‌డ్ మారథాన్ వాక్: ప్రియాంక గోస్వామి, సూరజ్ పన్వర్ (ఉదయం గం. 11:00 నుంచి). పురుషుల హైజంప్ (క్వాలిఫికేషన్): సర్వేశ్ (మధ్యాహ్నం గం. 1:35 నుంచి). మహిళల జావెలిన్ త్రో (క్వాలిఫికేషన్): అన్ను రాణి (మధ్యాహ్నం గం. 1:55 నుంచి). మహిళల 100 మీటర్ల హర్డిల్స్: జ్యోతి యర్రాజీ (హీట్-4) (మధ్యాహ్నం గం. 2:09 నుంచి). పురుషుల ట్రిపుల్ జంప్ (క్వాలిఫికేషన్): ప్రవీణ్ చిత్రావెల్, అబ్దుల్లా అబూబాకర్ (రాత్రి గం.10:45 నుంచి). పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ (అవినాశ్ సాబ్లే; అర్ధరాత్రి గం. 1:13 నుంచి)



విజయీభవ ‘వినేశ్’ తిరంగా ప్యారా!

స్వర్ణ పతక పోరుకు భారత మహిళా స్టార్ రెజ్లర్
- వరుసగా మూడు బౌట్‌లలో గెలుపు
- తొలి రౌండ్‌లో ఒలింపిక్, ప్రపంచ చాంపియన్‌పై సంచలన విజయం
- నేడు అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో ఫైనల్
- విజయం సాధిస్తే ఒలింపిక్స్ క్రీడల్లో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా వినేశ్ ఘనత

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు నాలుగో పతకం ఖరారైంది. మహిళల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 50 కేజీల విభాగంలో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ ఖాతాలో చేరేది స్వర్ణమా, రజతమా అనేది నేడు రాత్రి తేలనుంది. ఈరోజు రాత్రి 11 తర్వాత అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో జరిగే ఫైనల్లో వినేశ్ విజయం సాధిస్తే ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టిస్తుంది. ఒకవేళ ఓడిపోయినా రజత పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా ఆమె గుర్తింపు పొందుతుంది.



పారిస్: విశ్వ క్రీడల్లో తమ ‘పట్టు’ను నిలబెట్టుకుంటూ వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ క్రీడాంశంలో భారత్‌కు పతకం ఖరారైంది. మహిళల ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన 50 కేజీల ఈవెంట్‌లో వినేశ్ వరుసగా మూడు బౌట్‌లలో విజయం సాధించి స్వర్ణ-రజత పోరుకు అర్హత సాధించింది. సెమీఫైనల్లో వినేశ్ 5-0తో పాన్ అమెరికన్ గేమ్స్ చాంపియన్ యుస్నెలిస్ గుజ్మాన్ లోపెజ్‌పై గెలిచింది. మూడు నిమిషాల నిడివి గల తొలి భాగం ముగిసేసరికి వినేశ్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడు నిమిషాల నిడివి గల రెండో భాగంలోనూ వినేశ్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన వినేశ్ ఈ భాగంలో నాలుగు పాయింట్లు స్కోరు చేసింది. వినేశ్ డిఫెన్స్‌ను ఛేదించలేక క్యూబా రెజ్లర్ ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయింది.

యూరోపియన్ మాజీ విజేతను ఓడించి...



క్వార్టర్ ఫైనల్లో వినేశ్ 7-5 పాయింట్ల తేడాతో 2018 ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత, 2019 యూరోపియన్ చాంపియన్ ఒక్సానా లివాచ్ (ఉక్రెయిన్)ను ఓడించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఈ బౌట్‌లో వినేశ్ ఆరంభంలోనే 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఉక్రెయిన్ రెజ్లర్ కోలుకొని స్కోరును సమం చేసింది. అయితే చివర్లో వినేశ్ దూకుడుగా వ్యవహరించి రెండు పాయింట్లు గెలిచి విజయాన్ని ఖాయం చేసుకుంది.

ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్‌ను మట్టికరిపించి...



అంతకుముందు తొలి రౌండ్‌లో వినేశ్ పెను సంచలనం సృష్టించింది. 50 కేజీల విభాగంలో ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, మూడుసార్లు ప్రపంచ చాంపియన్ సుసాకి యుయి (జపాన్)పై 3-2తో గెలిచి రెజ్లింగ్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. 25 ఏళ్ల సుసాకి ఈ బౌట్‌కు ముందు తన అంతర్జాతీయ కెరీర్‌లో ఒక్క పరాజయం కూడా చవిచూడలేదు. తాను పోటీపడిన 82 బౌట్‌లలోనూ సుసాకి విజేతగా నిలిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో సుసాకి తన ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. వినేశ్‌తో పోరులో సుసాకి ఫేవరెట్ అని అందరూ భావించారు. బౌట్ కూడా అలాగే సాగింది. ఐదు నిమిషాల 49 సెకన్లు ముగిసే వరకు సుసాకి 2-0తో ఆధిక్యంలో నిలిచి విజయం అంచుల్లో నిలిచింది. ఈ దశలోనే వినేశ్ అద్భుతం చేసింది. అందివచ్చిన అవకాశాన్ని వదలకుండా ఒక్కసారిగా సుసాకిని కిందపడేసి మూడు పాయింట్లు సాధించి అనూహ్య విజయాన్ని అందుకుంది.

సాక్షి తర్వాత వినేశ్..

2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి భారత్‌కు పతకాలు లభిస్తున్నాయి. 2008 బీజింగ్‌లో సుశీల్ కుమార్ (66 కేజీలు) కాంస్యం గెలిచాడు. 2012 లండన్‌లో సుశీల్ కుమార్ (66 కేజీలు) రజత పతకం నెగ్గగా... యోగేశ్వర్ దత్ (60 కేజీలు) కాంస్య పతకం సాధించాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో మహిళా రెజ్లర్ సాక్షి మలిక్ (58 కేజీలు) కాంస్య పతకం సొంతం చేసుకుంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బజరంగ్ (65 కేజీలు) కాంస్యం... రవి కుమార్ (57 కేజీలు) రజతం గెల్చుకున్నారు. సాక్షి మలిక్ తర్వాత ఒలింపిక్స్‌లో పతకం సాధించిన రెండో భారతీయ మహిళా రెజ్లర్‌గా వినేశ్ గుర్తింపు పొందనుంది.



‘పట్టు’ వీడని పోరాటం

డిఫెండింగ్ ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ సుసాకిపై గెలిచిన వేళ...

‘పట్టు’ వీడని పోరాటం

అసాధారణం వినేశ్ ఫొగాట్ ఒలింపిక్ పతక ప్రస్థానం

‘ఈ అమ్మాయిని పోలీసు దెబ్బలతో అణచివేశారు... ఈ అమ్మాయిని తన దేశంలోనే రోడ్లపై ఈడ్చుకెళ్లారు... కానీ ఇదే అమ్మాయి ఇప్పుడు ప్రపంచాన్ని గెలుస్తోంది... పోరాటంలో ఎక్కడా తగ్గని మా వినేశ్ సివంగిలాంటిది. ఆమె విజయాలు చూస్తుంటే ఆనందిస్తున్నామో, కన్నీళ్లు వస్తున్నాయో కూడా తెలియడం లేదు. ఆమె ఆడుతున్న తీరు చూస్తే వినేశ్ ఒక్కతే కాదు... దేశంలోని ప్రతీ మహిళ పోరాడుతున్నట్లుగా ఉంది’... భారత మాజీ రెజ్లర్, టోక్యో ఒలింపిక్స్ పతక విజేత బజరంగ్ పూనియా మంగళవారం వినేశ్ ఫొగాట్ గురించి భావోద్వేగంతో చేసిన వ్యాఖ్య ఇది.

నిజం... వినేశ్ సాధించిన ఘనత ఇప్పుడు ఒలింపిక్ పతకం మాత్రమే కాదు, అంతకుమించి దానికి విలువ ఉంది. ఆటలో కాకుండా మ్యాట్ బయట ఆమె ఎదుర్కొన్న అవమానం, బాధలు, కన్నీళ్లు ఈ పతకం వెనక ఉన్నాయి. ఏడాదిన్నర ముందు ఆమె ఈ పతకం గెలిచి ఉంటే ఒక ప్లేయర్‌గానే ఆమె గొప్పతనం కనిపించేది. కానీ ఇప్పుడు అన్ని ప్రతికూల పరిస్థితులను దాటి సాధించిన ఈ గెలుపు అసాధారణం.



ఢిల్లీ వీధుల్లో ఆమె జీవితంలో అతి పెద్ద సవాల్‌ను ఎదుర్కొంది. పోలీసు దెబ్బలు, అరెస్ట్, బహిరంగంగా అవమానాలు, చంపేస్తామనే బెదిరింపులు, అవార్డులను వెనక్కి ఇచ్చే పరిస్థితులు రావడం, గెలిచిన పతకాలన్నీ గంగా నదిలో పడేసేందుకు సిద్ధం కావడం... ఇలా ఇలా ఒకటేమిటి ఎన్నో రకాలుగా వినేశ్ వేదన అనుభవించింది. తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించడం వల్లే, సహచర మహిళా రెజ్లర్లు ఎదుర్కొన్న లైంగిక వేధింపులకు కారణమైన వ్యక్తిపై చర్య తీసుకోమని కోరడం వల్లే ఇదంతా జరిగింది. ఈ మొత్తం వ్యవహారంలో వినేశ్ తన కెరీర్‌ను పణంగా పెట్టింది. రిటైర్మెంట్‌కు చేరువైంది కాబట్టే ఇలా చేస్తోందంటూ వినిపించిన వ్యాఖ్యానాలను ఆ తర్వాత బలంగా తిప్పి కొట్టింది. మళ్లీ రెజ్లింగ్‌పై దృష్టి పెట్టింది. తీవ్ర గాయం నుంచి కోలుకొని మరీ పోరాడింది. ఆరు నెలలు ముగిసేలోపు తానేంటో నిరూపించుకుంటూ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. వరుసగా మూడు ఒలింపిక్స్ ఆడిన భారత రెజ్లర్‌గా బరిలోకి దిగి మూడో ప్రయత్నంలో తన అద్భుత కెరీర్‌లో లోటుగా ఉన్న ఒలింపిక్ పతకాన్ని సాధించి సగర్వంగా నిలిచింది. కెరీర్‌లో ఎన్నోసార్లు గాయాలతో సహవాసం చేసి కోలుకోగానే మళ్లీ మ్యాట్‌పై సంచలనాలు సృష్టించిన వినేశ్‌పై ఢిల్లీ ఉదంతం తీవ్ర ప్రభావం చూపించింది. శరీరానికి తగిలిన గాయాలకంటే మనసుకు తగిలిన ఈ గాయం బాధ చాలా పెద్దది అంటూ కన్నీళ్ల పర్యంతమైంది. బ్రిజ్‌భూషణ్ శరణ్‌పై పోరాటం తర్వాత మళ్లీ ఆటలోకి అడుగు పెట్టే క్రమంలో కూడా అడ్డంకులు ఎదురయ్యాయి. సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరు కాకుండా సీనియార్టీ ద్వారా అడ్డదారిలో వెళ్లేందుకు ప్రయత్నిస్తోందంటూ మళ్లీ విమర్శలు. ఈ మనో వేదన వెంటాడినా వినేశ్ బేలగా మారిపోలేదు. మళ్లీ పట్టుదలతో నిలబడింది. కెరీర్ ఆరంభం నుంచి 53 కేజీల కేటగిరీలోనే పోటీ పడిన ఆమె తప్పనిసరి పరిస్థితుల్లో 50 కేజీలకు మారాల్సి వచ్చింది. రెజ్లింగ్‌లో ఇలా కేటగిరీ మారడం... అందులోనూ తక్కువ బరువుకు మారి రాణించడం అంత సులువు కాదు. కానీ ఎక్కడైనా నెగ్గగలననే పట్టుదల తనను నడిపించగా ఈ సవాల్‌ను వినేశ్ అధిగమించింది.



2016 రియోలో తొలిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన వినేశ్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరినా... చైనా రెజ్లర్‌తో బౌట్‌లో ఎడమకాలు విరిగి కన్నీళ్లపర్యంతమై నిష్క్రమించింది. స్ట్రెచర్‌పై ఆమెను బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. 2020 టోక్యో ఒలింపిక్స్ సమయంలో అద్భుత ఫామ్‌తో అడుగు పెట్టినా క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి ఎదురైంది. దీనికి తోడు టీమ్ యూనిఫామ్ ధరించలేదని, గేమ్స్ విలేజ్ బయట ఉందని, భారత సహచరులతో కలిసి సాధన చేయలేదని క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఫెడరేషన్ ఆమెపై సస్పెన్షన్ విధించింది. కొన్నాళ్లకు దానిని ఎత్తివేయడంతో మళ్లీ ఆటలోకి అడుగు పెట్టినా... గత ఏడాది యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్ (ఏసీఎల్) గాయంతో దెబ్బ పడింది. ఆపై మళ్లీ శస్త్రచికిత్స, రీహాబిలిటేషన్. మళ్లీ కోలుకొని మ్యాట్‌పై అడుగు పెట్టిన వినేశ్ ఒలింపిక్ పతకం సాధించే వరకు విశ్రమించలేదు. కొన్నాళ్ల క్రితం తన ఇన్‌స్టాగామ్ ప్రొఫైల్‌లో ఒక స్ఫూర్తిదాయక వాక్యం రాసుకుంది. ‘ఖుదీ కో కర్ బులంద్ ఇత్‌నా కే హర్ తక్దీర్ సే పహేలే ఖుదా బందేసే ఖుద్ పూఛే బతా తేరీ రజా క్యా హై’ (నిన్ను నువ్వు ఎంత బలంగా మార్చుకో అంటే అదృష్టం అవసరం పడే ప్రతీ సందర్భంలో నీకు ఏం కావాలని దేవుడే స్వయంగా అడగాలి). దీనికి తగినట్లుగా ఇప్పుడు వినేశ్ తన రాతను తానే మార్చుకొని రెజ్లింగ్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. **- సాక్షి క్రీడా విభాగం**

వచ్చాడు... విసిరాడు... ఫైనల్ చేరాడు



నీరజ్ చోప్రా

- జావెలిన్ త్రోలో పతక పోరుకు నీరజ్ చోప్రా
- తొలి ప్రయత్నంలోనే 89.34 మీటర్లు దూసుకెళ్లిన నీరజ్ జావెలిన్
- క్వాలిఫయింగ్‌లో ‘టాప్’లో నిలిచిన భారత స్టార్
- 12 మంది మధ్య రేపు ఫైనల్

అనూహ్యమేమీ కాదు...అలవాటు లేనిదేమీ కాదు... అడుగు పెడితే చాలు జావెలిన్‌తో అద్భుతంగా ఆడుకునే భారత స్టార్ నీరజ్ చోప్రా ఒలింపిక్ వేదికపై మళ్లీ తన బంగారు వేటను మొదలు పెట్టాడు. అసలు పోరుకు ముందు అర్హత సమరంలో తనదైన శైలిలో అదరగొట్టాడు. క్వాలిఫయింగ్ పోరులో ఒకే ఒక్క త్రో విసిరి అలా అలవోకగా ముందంజ వేశాడు... మరో మాటకు తావు లేకుండా అగ్ర స్థానంతో దర్జాగా ఫైనల్లోకి అడుగు పెట్టి ఒక లాంఛనం ముగించాడు... ఎక్కడా తడబాటు లేదు, కాస్త ఉత్కంఠ పెంచినట్లుగా కూడా కనిపించలేదు. రోజూ చేసే పని ఇదేగా అన్నట్లుగా క్షణాల వ్యవధిలో త్రో పూర్తి చేసి వెనక్కి తిరిగి చూడకుండా నడుచుకుంటూ వెళ్లిపోయాడు... ఇదే తరహా ప్రదర్శనను రేపు జరిగే ఫైనల్లోనూ చూపిస్తే మన బంగారు బాలుడి ఒడిలో వరుసగా రెండో ఒలింపిక్స్‌లో మరో పసిడి పతకం పరుగెత్తుకుంటూ వచ్చి వాలడం ఖాయం!

పారిస్: కోట్లాది భారత అభిమానుల పసిడి ఆశలను మోస్తూ బరిలోకి దిగిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో సత్తా చాటిన నీరజ్ ఈసారి కూడా అదే జోరును కొనసాగించే లక్ష్యంతో మైదానంలోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్ గ్రూప్ ‘బి’లో నీరజ్ తన జావెలిన్‌ను 89.34 మీటర్ల దూరం విసిరి క్వాలిఫై అయ్యాడు. ఫైనల్ చేరేందుకు అర్హత మార్కు 84 మీటర్లు కాగా... తన తొలి ప్రయత్నంలోనే అంతకంటే ఎక్కువ దూరం బల్లెం విసరడంతో నీరజ్‌కు మళ్లీ త్రో చేయాల్సిన అవసరమే రాలేదు. గ్రూప్ ‘ఎ’, గ్రూప్ ‘బి’ రెండూ కలిపి నీరజ్‌దే అత్యుత్తమ ప్రదర్శన. వ్యక్తిగతంగా కూడా ఈ దూరం నీరజ్ కెరీర్‌లో రెండో స్థానంలో నిలుస్తుంది. 2022లో అతను జావెలిన్‌ను 89.94 మీటర్లు విసిరాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ కూడా అయిన నీరజ్‌తో హోరాహోరీగా తలపడేందుకు సిద్ధమైన అండర్సన్ పీటర్స్ (గ్రెనడా), జూలియన్ వెబర్ (జర్మనీ) జావెలిన్‌ను 88.63 మీటర్లు, 87.76 మీటర్లు వరుసగా రెండు, మూడు స్థానాలతో ముందంజ వేశారు. పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ (86.59 మీటర్లు) కూడా ఫైనల్స్‌కు క్వాలిఫై అయ్యాడు. 84 మీటర్లు విసిరిన లేదా రెండు గ్రూప్‌లలో కలిపి 12 మంది అత్యుత్తమ స్కోరర్లు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. క్వాలిఫయింగ్‌లో 9 మంది 84 మీటర్ల మార్క్‌ను అందుకొని ముందంజ వేయగా, మరో ముగ్గురికి మాత్రం టాప్-12లో రావడంతో అవకాశం లభించింది. పోటీలో నిలిచిన మరో భారత జావెలిన్ త్రోయర్ కిషోర్ జెనా తీవ్రంగా నిరాశపరిచాడు. జావెలిన్‌ను 80.73 మీటర్లు మాత్రమే విసిరిన అతను గ్రూప్ ‘ఎ’లో తొమ్మిదో స్థానానికే పరిమితం కావడంతో ఫైనల్ అవకాశం చేజారింది. గత ఏడాది ఆసియా క్రీడల్లో జావెలిన్‌ను 87.54 మీటర్ల దూరం విసిరి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన కిషోర్... అసలు సమయంలో కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయాడు. మరోవైపు మహిళల 400 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ కిరణ్ పహాల్ నిరాశపర్చింది. ఈ ఈవెంట్‌లో ఆమె సెమీఫైనల్ చేరడంలో విఫలమైంది. అరుగురు పాల్గొన్న రెపిచాజ్ హీట్-1లో మొదటి స్థానంలో నిలిస్తేనే సెమీస్ చేరే అవకాశం ఉండగా... 52.59 సెకన్లలో పరుగు పూర్తి చేసిన కిరణ్ ఆరో స్థానంతో ముగించింది.

> “ఎప్పుడైనా తొలి ప్రయత్నమే మెరుగ్గా ఉండాలని భావిస్తా. ప్రతీసారి అది సాధ్యం కాకపోవచ్చు. అలా జరిగింది కూడా. నేను ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉన్నా. ఎలాంటి ఇబ్బంది లేదు. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. అయితే క్వాలిఫయింగ్‌కంటే ఫైనల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. కాబట్టి సన్నద్ధత కూడా చాలా బాగుండాలి. నేను చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నా. ఫైనల్ సాయంత్రం జరుగుతుంది కాబట్టి వాతావరణం కాస్త చల్లగా ఉండవచ్చు. అయితే దానికి అనుగుణంగానే సిద్ధమవుతా. ఫైనల్ చేరిన వారంతా బలమైన ప్రత్యర్థులే కాబట్టి ఎవరితోనూ ప్రత్యేకంగా పోటీ ఉండదు. **-నీరజ్ చోప్రా**

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	అమెరికా	22	30	29	81
2	చైనా	22	20	15	57
3	ఆస్ట్రేలియా	14	12	9	35
4	ఫ్రాన్స్	13	16	19	48
5	బ్రిటన్	12	15	18	45
6	దక్షిణ కొరియా	11	8	7	26
7	జపాన్	11	6	11	28
8	ఇటలీ	9	10	6	25
9	నెదర్లాండ్స్	8	5	6	19
10	జర్మనీ	8	5	4	17
11	కెనడా	5	4	8	17
60	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.



హర్మన్‌ప్రీత్

సెమీస్‌లో భారత హాకీ జట్టు ఓటమి

- టీమిండియాపై 3-2తో నెగ్గి ఫైనల్ చేరిన జర్మనీ
- రేపు కాంస్యం కోసం స్పెయిన్‌తో భారత్ పోరు

పారిస్: నాలుగు దశాబ్దాల తర్వాత వరుసగా రెండోసారి ఒలింపిక్స్ సెమీఫైనల్‌కు చేరిన భారత పురుషుల జట్టు.. తుదిపోరుకు అర్హత సాధించడంలో మరోసారి విఫలమైంది. మంగళవారం హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్లో ఆరంభం నుంచి ఆధిక్యంలో ఉండి.. టీమిండియా 2-3 గోల్స్‌తో జర్మనీ చేతిలో పరాజయం పాలైంది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (7వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (36వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. జర్మనీ తరఫున ఫైలాట్ గోంజాలో (18వ నిమిషంలో), రుహెర్ క్రిస్టోఫర్ (27వ నిమిషంలో), మిల్కావు మార్కో (54వ నిమిషంలో) తలా ఒక గోల్ సాధించారు. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన పోరులో ఆట మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనగా.. జర్మనీ అనూహ్య గోల్‌తో ముందంజ వేయగా.. చివర్లో గోల్‌కీపర్‌ను తప్పించి అదనపు అటాకర్‌తో ప్రయత్నించినా భారత్ స్కోరు సమం చేయలేకపోయింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో జర్మనీపై విజయంతోనే మెడల్ దక్కించుకున్న టీమిండియా... ఈసారి మాత్రం అలాంటి ప్రదర్శన కనబర్చలేకపోయింది. మరో సెమీఫైనల్లో నెదర్లాండ్స్ 4-0తో స్పెయిన్‌పై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

బీసీసీఐ జీఎస్టీ చెల్లింపులు రూ.2038 కోట్లు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గత రెండేళ్లుగా రూ. 2038.55 కోట్లను జీఎస్టీ రూపంలో చెల్లించినట్లు రాజ్యసభలో తెలిపారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎగువసభలోని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నిర్వహణ ద్వారా 2022-23, 2023-24 ఈ రెండు ఆర్థిక సంవత్సరాలకు గాను 28 శాతం జీఎస్టీ రూపంలో బోర్డు స్థూలంగా రూ. 2038.55 కోట్లు చెల్లించిందని లిఖిత పూర్వకంగా రాజ్యసభలో తెలిపారు. ఆదాయపన్ను శాఖ నుంచి చారిటీలకు వర్తింపచేస్తున్న మినహాయింపును బీసీసీఐకి తొలగించడంతో ఈ మేరకు బోర్డు చెల్లించిందని మంత్రి పంకజ్ చౌదరి వివరించారు. బీసీసీఐ 'తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1975'కు లోబడి రిజిస్టరైన సంస్థ. అయితే ఇన్నాళ్లు చారిటీల గొడుగుకింద సెక్షన్ 11 ప్రకారం పన్ను మినహాయింపు పొందేది. అయితే ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలో ఉందని ఆయన చెప్పారు. అలాగే కేంద్ర క్రీడా శాఖ నుంచి ఎలాంటి గ్రాంట్లు, నిధులు, పథకాలు క్రికెట్ బోర్డు పొందడం లేదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

40 ఏళ్ల తర్వాత...

ఒలింపిక్స్ ఫుట్‌బాల్ ఫైనల్లో ఫ్రాన్స్



రెండోసారి ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచేందుకు ఫ్రాన్స్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు విజయం దూరంలో నిలిచింది. స్వదేశంలో జరుగుతున్న పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో ఫ్రాన్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన సెమీఫైనల్లో ఫ్రాన్స్ 3–1 గోల్స్‌తో ఈజిప్ట్ జట్టుపై విజయం సాధించి 1984 తర్వాత మళ్లీ ఒలింపిక్స్ క్రీడల్లో టైటిల్ పోరుకు అర్హత పొందింది. ఫ్రాన్స్ తరఫున మెటిటా జీన్ ఫిలిప్ (83వ, 99వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో మెరవగా... మైఖేల్ ఒలీస్ (108వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. ఈజిప్ట్ తరఫున మహమూద్ సాబెర్ (62వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. ఒలింపిక్స్ చరిత్రలో ఫ్రాన్స్ ఫుట్‌బాల్ జట్టు ఫైనల్ చేరడం ఇది మూడోసారి. 1900 పారిస్ క్రీడల్లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ ఆ తర్వాత 1984 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. శుక్రవారం జరగనున్న ఫైనల్లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ అమీతుమీ తేల్చుకోనుంది.

భారత టీటీ జట్టు నిష్క్రమణ



పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు కథ ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో భారత్ 0–3తో చైనా చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్–మానవ్ ఠక్కర్ జోడీ 2–11, 3–11, 7–11తో మా లాంగ్–వాంగ్ జంట చేతిలో 0–1తో వెనుకబడింది. రెండో మ్యాచ్‌లో ఐదోసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్న ఆచంట శరత్ కమల్ 11–9, 7–11, 7–11, 5–11తో ఫాన్ జెన్‌డాంగ్ చేతిలో ఓడిపోయాడు. తొలి గేమ్ గెలిచి ఆశలు రేకెత్తించిన శరత్ అదే జోరు చివరి వరకు కొనసాగించ లేకపోయాడు. మూడో మ్యాచ్‌గా జరిగిన సింగిల్స్ రెండో పోరులో మానవ్ ఠక్కర్ 9–11, 6–11, 9–11తో వాంగ్ చేతిలో పరాజయం పాలవడంతో భారత ఓటమి ఖరారైంది.

సమం చేస్తారా... సమర్పిస్తారా!



నేడు శ్రీలంకతో భారత్ మూడో వన్డే

- టీమిండియా గెలిస్తే సిరీస్ సమం
- ఓడిపోతే సిరీస్ శ్రీలంక వశం
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కొలంబో: టి20 సిరీస్‌ను సులువుగా గెలుచుకున్న టీమిండియాకు వన్డే సిరీస్ గెలుపు కూడా లాంఛనమే అనిపించింది. కానీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లితో ఉన్న పూర్తిస్థాయి టీమిండియాకు వన్డేల్లో ఎవరూ ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి. తొలి వన్డేను గెలుపు మెట్టుపై 'టై' చేసుకున్న రోహిత్ బృందం రెండో మ్యాచ్‌లో లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 97/0తో పటిష్టస్థితిలో ఉండి కూడా... లంక స్పిన్ మాయాజాలానికి అనూహ్యంగా కుప్పకూలింది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఆలౌటైంది. బంతులు మాత్రం మిగిలిపోయాయి. అంటే మన బ్యాటర్లు క్రీజులో నిలువడమే కష్టమైపోతోంది. కోహ్లి, రాహుల్‌లాంటి సీనియర్లపై కూడా ఆతిథ్య స్పిన్ బౌలింగ్ ఆధిపత్యం చలాయిస్తోంది. ఇది జట్టును కలవరపెడుతోంది. మరోవైపు 1–0తో సిరీస్‌లో ఆధిక్యంలో ఉన్న శ్రీలంక ఇప్పుడు ఇదే ఉత్సాహంతో ఆఖరి పోరులో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది.

మన బ్యాట్‌లకు పని చెప్పాల్సిందే!

ఈ పర్యటనలో భారత్ ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లాడింది. మూడు టి20లు సహా, గత రెండు వన్డేల్లోనూ బౌలర్లు ప్రతాపం చూపారు. కానీ బ్యాటర్లే ఆ రేంజ్‌లో రాణించలేకపోతున్నారు. ముఖ్యంగా వన్డేల్లో చక్కని శుభారంభాలు వచ్చినా... కెప్టెన్ రోహిత్ శర్మ ధాటైన బ్యాటింగ్‌తో లక్ష్యాన్ని సులువుగా మారుస్తున్నా... తర్వాత వచ్చిన బ్యాటర్లు మిగిలిన లక్ష్యాన్ని ఛేదించలేకపోవడమే పెద్ద సమస్యగా మారింది. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించిన టీమ్ మేనేజ్‌మెంట్ ఆఖరి పోరులో తమ బ్యాటింగ్ దళాన్ని సన్నద్ధం చేస్తోంది. రోహిత్ ఆడినట్లే టాపార్డర్‌లో కోహ్లి, మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ ఏ కాస్తోకూస్తో ఆడినా... కొన్ని ఓవర్లు క్రీజులో పాతుకుపోయినా ఎంతటి స్పిన్నయినా తుత్తునీయలు చేయొచ్చు.

జోరు మీదున్న లంక

టి20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌తో పల్లెకెలెలో పోగొట్టుకున్న పరువును కొలంబోలో కొల్లగొట్టాలని ఆతిథ్య శ్రీలంక పట్టుదలతో ఉంది. చక్కగా స్పిన్‌కు అనుకూలించే పిచ్‌పై బౌలర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. పటిష్టమైన ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను తేలిగ్గా కూల్చేస్తున్నారు. పైగా 1–0తో ఉన్న శ్రీలంక ఇప్పుడు సిరీస్ కోల్పోలేని స్థితిలో ఉంది. ఒత్తిడేమో భారత్‌పై ఉంది. దీన్ని సద్వినియోగం చేసుకొని తమ స్పిన్‌తో తిప్పేయాలని వాండెర్సే, అసలంక పిడికిలి బిగిస్తున్నారు. కొలంబో వేదికపై లక్ష్యఛేదన మ్యాచ్ సాగేకొద్దీ కష్టతరమవుతోంది కాబట్టి టాస్ గెలిస్తే మాత్రం మరో మాటకు తావులేకుండా ఏ జట్టయినా బ్యాటింగే ఎంచుకోవడం ఖాయం.

పిచ్, వాతావరణం

కొలంబో పిచ్ స్పిన్‌కు స్వర్గధామం. దీనివల్లే ఆతిథ్య స్పిన్నర్లు చెలరేగుతున్నారు. బ్యాటర్లు జాగ్రత్త పడాల్సిందే! వర్ష సూచన ఉన్నా... మ్యాచ్‌కైతే ఇబ్బంది ఉండకపోవచ్చు.

మీరా ఔరా అనిపించేనా?

- నేడు మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 49 కేజీల విభాగం బరిలో భారత స్టార్
- గత టోక్యో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన మీరాబాయి
- రాత్రి గం.11:00 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో... పోటీలు ప్రారంభమైన తొలి రోజే భారత్‌కు పతకం అందించి సంబరాల్లో ముంచెత్తిన భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను... బుధవారం 'పారిస్' క్రీడల బరిలోకి దిగనుంది. 49 కేజీల విభాగంలో గత ఒలింపిక్స్‌లో 202 కేజీలు (87 కేజీలు+115 కేజీలు) బరువెత్తి రజతం గెలిచిన మీరాబాయిపై ఈసారి కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అయితే కొంతకాలంగా ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న చాను.. ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందనేది ఆసక్తికరం. ఒలింపిక్స్ వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఇప్పటి వరకు భారత్‌కు రెండు పతకాలు దక్కగా... ఆ రెండూ మహిళా లిఫ్టర్లే గెలిచారు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో దిగ్గజ లిఫ్టర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరణం మల్లీశ్వరి కాంస్య పతకం సాధించగా... టోక్యోలో మీరాబాయి రజతం నెగ్గింది. గత ఒలింపిక్స్‌లో మెరుపులు మెరిపించిన మీరాబాయి.. ఆ తర్వాత గాయాల బారిన పడి అదే స్థాయి ప్రదర్శన కొనసాగించలేకపోయింది. 2022 కామన్వెల్త్ క్రీడల్లో మాత్రమే 200 కేజీల మార్కు దాటగలిగింది. ఇక తాజాగా 'పారిస్' క్రీడల్లో మీరాబాయి ఎంట్రీ వెయిట్ 200 కేజీలుగా నమోదు చేసుకుంది. ఒలింపిక్ డిఫెండింగ్ చాంపియన్ హో జీహుయి (చైనా), డెలాక్రజ్ (అమెరికా), సురోచన ఖామ్‌బో (థాయ్‌లాండ్), మిహేలా కామ్‌బెయి (రొమేనియా) మీరాకన్నా మెరుగైన ఎంట్రీ వెయిట్ నమోదు చేసుకున్నారు. ఈసారి పోటీల తీవ్రతను బట్టి చూస్తే.. మీరాబాయి తన అత్యుత్తమ ప్రదర్శన (205 కేజీలు) కనబర్చగలిగితేనే పతకం రేసులో నిలిచే అవకాశాలు ఉన్నాయి. చైనా లిఫ్టర్ హో జీహుయి మరోసారి స్వర్ణంపై గురి పెట్టింది. మీరాబాయి గాయం నుంచి పూర్తిగా కోలుకుందని కోచ్ విజయ్ శర్మ పేర్కొన్నారు. 'మీరా 200 కేజీలు సునాయాసంగా దాటగలదు. టోక్యో ఒలింపిక్స్‌లో ఎత్తిన 202 కేజీల బరువును మించిన ప్రదర్శన చేస్తుంది. సవాలు స్వీకరించేందుకు చాను సిద్ధంగా ఉంది' అని విజయ్ శర్మ అన్నాడు.

ఏ బిడ్డా... ఇది నా అడ్డా!

సర్ఫింగ్ సెమీస్‌కు అతిథిగా తిమింగలం



తిహుపో (తాహిటి): పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా సర్ఫింగ్ పోటీలు పసిఫిక్ మహాసముద్రంలో జరుగుతున్నాయి. బ్రెజిల్‌కు చెందిన తాతియానా వెస్టన్ వెబ్, కోస్టారికా సర్ఫర్ బ్రిసా హెన్నెస్సీల మధ్య సెమీఫైనల్స్ జరుగుతోంది. పారిస్‌కు సుమారు పదివేల మైళ్ల దూరంలో ఉన్న తాహిటిలో ఈ పోటీలు జరుగుతుండగా... ఓ తిమింగలం అక్కడ చక్కర్లు కొట్టింది. ఓ కంట ఉలిక్కిపాటుతో మరో కంట కేరింతలతో ప్రేక్షకులు ఈ అనుకోని అతిథిని తమ కెమెరాల్లో, స్మార్ట్‌ఫోన్‌లలో బంధించారు. వెస్టన్, బ్రిసాలకు కాస్త దూరంలో అది నీటిపై తేలియాడింది. అయితే సర్ఫర్లు ఇద్దరు సురక్షిత దూరంలోనే ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దీవుల మధ్యలో ఫ్రాన్స్ ఆధీనంలో తాహిటి ఉంది. ఇది సర్ఫింగ్‌కు ప్రసిద్ధి. క్రీడాకారులే కాదు ఔత్సాహికులు సర్ఫింగ్‌తో సంద్రానికి ఎదురీదుతారు. అయితే సర్ఫింగ్ చేసే ప్రతీచోటా కూడా వైల్డ్ యానిమల్స్ దర్శనమివ్వడం పరిపాటి. తిమింగలాలు, సీల్స్, షార్క్‌లు సర్ఫర్లను అప్పుడప్పుడు భయపెడుతుంటాయి.

ఈ నెల 15, 16 తేదీల్లో పీకేఎల్ వేలం



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ ప్రారంభానికి ముందు ఈ నెల 15, 16తేదీల్లో ప్లేయర్ల వేలం జరగనుంది. పవన్ షెరావత్, ప్రదీప్ నర్వాల్, మణిందర్ సింగ్, ఫజల్ అత్రాచలీ, మొహమ్మద్ రెజా వంటి పలువురు స్టార్ ప్లేయర్లు ఈసారి వేలంలో పాల్గొంటున్నారు. 88 మంది ప్రధాన ప్లేయర్లను రీటెయిన్ చేసుకున్న 12 ఫ్రాంచైజీలు.. యువ ఆటగాళ్లను దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. వేలంలో పాల్గొంటున్న ప్లేయర్లను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 'ఎ' కేటగిరీలో ఉన్న ప్లేయర్ల కనీస ధర రూ. 30 లక్షలు కాగా.. 'బి' కేటగిరీలో ఉన్న వాళ్ల బేస్ ప్రైజ్ రూ. 20 లక్షలు. 'సి' కేటగిరీ ప్లేయర్లకు రూ.13 లక్షలు, 'డి' కేటగిరీ ఆటగాళ్లకు రూ. 9 లక్షలు ప్రాథమిక ధరగా నిర్ణయించారు. వేలంలో 500 మందికి పైగా ప్లేయర్లు పాల్గొననుండగా.. ఒక్కో ఫ్రాంచైజీ ఐదు కోట్లు ఖర్చు చేయనుంది.

సినిమా

మొదలైంది... తెలుసు కదా


● సిద్ధు జొన్నలగడ్డ

''మొదలైంది... తెలుసు కదా' అంటున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా'. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తుండగా, రాశీ ఖన్నా, శ్రీ నిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మంగళవారం ప్రారంభమైంది. దాదాపు ముప్పై రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్టుతో పాటు పాటలనూ చిత్రీకరించనున్నారు. ''తొలి రోజు సిద్ధు, రాశీ కాంబినేషన్‌లోని సన్నివేశాల చిత్రీకరణను ప్రారంభించాం'' అని చిత్రబృందం తెలిపింది.

మరో హాలీవుడ్ అవకాశం?


● ధనుష్

హాలీవుడ్ మూవీ 'అవెంజర్స్' సిరీస్‌లో తమిళ నటుడు ధనుష్ భాగమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్వెల్ ఫ్రాంచైజీలోని 'అవెంజర్స్' సిరీస్‌లో తర్వాతి చిత్రాలుగా 'అవెంజర్స్: డూమ్స్ డే, అవెంజర్స్: సీక్రెట్ వార్' రానున్నాయని, 'అవెంజర్స్: ఎండ్ గేమ్' చిత్రానికి దర్శకత్వం వహించిన రూసో బ్రదర్స్ (ఆంథోనీ రూసో, జోసెఫ్ రూసో) ఈ చిత్రాలను తెరకెక్కించనున్నారని మార్వెల్ సంస్థ ప్రకటించింది. 'అవెంజర్స్: డూమ్స్ డే'లో రాబర్ట్ డౌనీ జూనియర్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్నారు. మరో లీడ్ రోల్‌లో ధనుష్ నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. రూసో బ్రదర్స్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ మూవీ 'ది గ్రే మ్యాన్'లో ధనుష్ ఓ లీడ్ రోల్ చేశారు. మరి... 'అవెంజర్స్: డూమ్స్ డే'లోనూ ఈ ఇండియన్ హీరో నటిస్తారా? వేచి చూడాలి.

సినిమా చూసి కన్నీళ్లొచ్చాయి - వరుణ్ తేజ్


● వరుణ్ తేజ్, నిహారిక, సాయి దుర్గ తేజ్, వంశీ, అడివి శేష్

''కమిటీ కుర్రోళ్ళు' సినిమా చూశాను. చాలా బాగుంది. నాకు పాత రోజులు గుర్తొచ్చాయి.. చాలా చోట్ల కన్నీళ్లు పెట్టుకున్నాను. ప్రేక్షకులకు కూడా అలాంటి అనుభూతి కలుగుతుందనిపిస్తోంది. ఇంతమంది ప్రతిభ ఉన్న నటీనటులను ఇండస్ట్రీకి అందిస్తున్న మా చెల్లి నిహారికను చూస్తుంటే గర్వంగా ఉంది'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. నూతన నటీనటులతో యదు వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 9న విడుదలవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు వరుణ్ తేజ్, సాయి దుర్గ తేజ్, అడివి శేష్, దర్శకుడు వెంకీ అట్లూరి అతిథులుగా హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ– ''కమిటీ కుర్రోళ్ళు' టైటిల్ విన్నప్పుడే నాకు చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయి. ట్రైలర్ చాలా నచ్చింది'' అని పేర్కొన్నారు. ''ఈ చిత్రం ట్రైలర్ చూడగానే ఓ జీవితాన్ని చూసినట్టుగా అనిపించింది'' అన్నారు అడివి శేష్.

సస్పెన్స్... థ్రిల్


● రషీద భాను

శివ రామచంద్రవు, చైతన్య పసుపులేటి, రషీద భాను లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సంఘర్షణ'. చిన్న వెంకటేశ్ దర్శకత్వంలో వల్లూరి శ్రీనివాస రావ్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. వల్లూరి శ్రీనివాస రావ్ మాట్లాడుతూ– ''సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'సంఘర్షణ'. ఈ చిత్రంలో ఫ్యామిలీలోని అన్ని రకాల భావోద్వేగాలతో పాటు ప్రేమ కూడా ఉంటాయి. వన్ మీడియా ద్వారా పార్థు రెడ్డి మా సినిమాను విడుదల చేస్తున్నారు'' అన్నారు.

ఫైట్స్ చేయడం సవాల్‌గా అనిపించింది - కావ్యా థాపర్



''నేనిప్పటివరకూ వైవిధ్యమైన పాత్రలు చేశాను. తొలిసారి 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలో యాక్షన్ సీన్స్ చేశాను. మొదటిసారి ఫైట్స్ చేయడం, పాటల్లో ఫుల్ జోష్‌తో డ్యాన్స్ చేసే అవకాశం రావడం సవాల్‌గా అనిపించింది'' అని హీరోయిన్ కావ్యా థాపర్ అన్నారు. రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 15న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా కావ్యా థాపర్ పంచుకున్న విశేషాలు.

- పూరి జగన్నాథ్‌గారి దర్శకత్వంలో నటించాలని ఉండేది. 'ఇస్మార్ట్ శంకర్'కి ఆడిషన్ ఇచ్చాను కానీ కుదరలేదు. 'డబుల్ ఇస్మార్ట్'కి నా ఆడిషన్స్ నచ్చి పూరి సార్, ఛార్మీగారు చాన్స్ ఇచ్చారు. ఇప్పుడు డబుల్ ఫన్, ఎంటర్‌టైన్మెంట్ ఉండే ఈ సినిమాలో అవకాశం రావడం మరింత హ్యాపీగా ఉంది. పూరీగారు గొప్ప డైరెక్టర్. ఆయన్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.
- ఈ మూవీలో నా క్యారెక్టర్ చాలా బోల్డ్ అండ్ స్ట్రాంగ్‌గా ఉంటుంది. అలాగే చిన్న అమాయకత్వం కూడా ఉంటుంది. రామ్‌గారితో సాంగ్ షూట్‌లో ఫస్ట్ డే మార్నింగ్ సిక్ అయ్యాను. చాలా ఎనర్జీ, పవర్ కావాల్సిన సాంగ్ అది. అయినా సెట్‌కి వెళ్లాను. ఛార్మీగారు హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. నన్ను చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. మూడు రోజుల తర్వాత డబుల్ ఎనర్జీతో డిస్‌చార్జ్ అయ్యాను... నా బెస్ట్ డ్యాన్స్ ఇచ్చాను.
- మణిశర్మగారు లెజండరీ కంపోజర్. ఆయన సాంగ్స్‌కి డ్యాన్స్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. 'డబుల్ ఇస్మార్ట్' నేరుగా హిందీలో రిలీజ్ కావడం చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది. నాకు యాక్షన్ రోల్స్, అడ్వంచరస్ మూవీస్ చేయాలని ఉంది. ప్రస్తుతం గోపీచంద్‌గారితో 'విశ్వం' చిత్రంలో నటిస్తున్నాను. మరి కొన్ని ప్రాజెక్ట్స్ చర్చల్లో ఉన్నాయి.

యాక్షన్... రియాక్షన్


● విశ్వక్ సేన్

ఐపీఎస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్ చార్జ్ తీసుకోనున్నారు. విశ్వక్ సేన్ హీరోగా శ్రీధర్ గంటా దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ పొలిటికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. 'ఎవ్రీ యాక్షన్ హైర్స్ ఎ రియాక్షన్' అనేది ఉపశీర్షిక. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా విశ్వక్ సేన్ కెరీర్‌లోని ఈ 13వ చిత్రాన్ని మంగళవారం ప్రకటించి, ఫ్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: కిశోర్ కుమార్.

మార్టిన్ వస్తున్నాడు


● ధ్రువ్ సర్జా

దసరాకు థియేటర్స్‌కు వస్తున్నాడు 'మార్టిన్'. ధ్రువ్ సర్జా హీరోగా నటించిన కన్నడ చిత్రం 'మార్టిన్'. వైభవీ శాండిల్య హీరోయిన్‌గా నటించారు. నటుడు అర్జున్ సర్జా కథ అందించిన ఈ సినిమాకు ఏపీ అర్జున్ దర్శకుడు. ఉదయ్ కె. మెహతా, సూరజ్ ఉదయ్ మెహతా నిర్మించిన ఈ చిత్రం తొలి ట్రైలర్ రిలీజ్ వేడుకను ముంబైలో నిర్వహించి, సినిమాను అక్టోబరు 11న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను పదమూడు భాషల్లో (తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ, ఇంగ్లిష్, అరబిక్, జపనీస్, చైనీస్, కొరియన్, స్పానిష్, రష్యన్) విడుదల చేయనున్నట్లుగా చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ధ్రువ్ సర్జా మాట్లాడుతూ – ''యూనివర్సల్ అప్పీల్ ఉన్న స్టోరీ 'మార్టిన్'. ఈ చిత్రంలో కొత్త తరహా యాక్షన్‌ను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు'' అన్నారు. అర్జున్ మాట్లాడుతూ– ''ధ్రువ్ కోసం 'మార్టిన్' కథ రాశాను. కొన్నిసార్లు అతని అంకితభావం చూసి ప్రేరణ పొందుతుంటాను'' అని తెలిపారు. ''ప్రేక్షకులను తప్పక అలరించే చిత్రం ఇది'' అన్నారు ఏపీ అర్జున్. ''టీజర్ విడుదల చేసిన తర్వాత 'మార్టిన్' సినిమా గురించి నన్ను చాలా మంది అడిగారు. దీంతో ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను ఇతర దేశ భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు.

పాగల్ ప్రేమకథ



● విజయ్ శంకర్, విషిక

విజయ్ శంకర్, విషిక జంటగా రాజేశ్ ముదునూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. బ్రహ్మాజీ, 'షకలక' శంకర్, ప్రశాంత్ కూచిబొట్ల, అనూహ్య సారిపల్లి ఇతర కీలక పాత్రల్లో నటించారు. పద్మాన మన్మథరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో విజయ్ శంకర్ మాట్లాడుతూ– ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. ఇందులో కార్తీక్ అనే అమాయకుడి పాత్రలో నటించాను. ప్రేమలో ఉన్నవారందరూ రిలేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు. ''అనుమానంతో బాయ్‌ఫ్రెండ్‌ని ఇబ్బందులు పెట్టే ప్రియ అనే పాత్ర చేశాను. నేను నటించిన 'కమిటీ కుర్రోళ్ళు, పాగల్ వర్సెస్ కాదల్' సినిమాలు ఒకేరోజు రిలీజ్ కానుండటం నా కెరీర్‌లో మర్చిపోలేని సందర్భం'' అని విషిక తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

నేను నా కథకు బానిసను

– 'మోడ్రన్ మాస్టర్స్'లో ఎస్ఎస్ రాజమౌళి



ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో ప్రముఖ దర్శకుడు రాజమౌళిపై రూపొందిన 'మోడ్రన్ మాస్టర్స్' డాక్యుమెంటరీ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.

నెట్ ఫ్లిక్స్ వేదికగా ఇటీవల విడుదలైన డాక్యుమెంటరీ 'మోడ్రన్ మాస్టర్స్: ఎస్.ఎస్. రాజమౌళి'. నెట్ ఫ్లిక్స్ అనేది అమెరికా దేశపు ప్రముఖ ఓటీటీ సంస్థ. అమెరికా ఎంటర్‌టైన్మెంట్ మార్కెట్‌లో దాదాపు 25 శాతం కలిగి, భారతదేశంలో దాదాపు 12 కోట్లకు పైగా సబ్‌స్క్రైబర్స్ కలిగిన నెట్ ఫ్లిక్స్ ఓ తెలుగు దర్శకుడి మీద డాక్యుమెంటరీ విడుదల చేయడం ఇదే తొలిసారి.

దాదాపు గంటా 54 నిమిషాల నిడివితో ప్రముఖ వ్యాఖ్యాత అనుపమా చోప్రా నిర్మించిన డాక్యుమెంటరీ 'మోడ్రన్ మాస్టర్స్: ఎస్.ఎస్. రాజమౌళి'. రాఘవ్ కన్నా, తన్వి దర్శకులు. 'నేను నా కథకు బానిసను. నా ఆడియన్స్ విషయంలో అత్యాశపరుణ్ణి. నా కథను చూడ్డానికి ఎక్కువమంది ఆడియన్స్ కావాలి'... ఇలా తన అభిలాషను ఈ డాక్యుమెంటరీలో వెలిబుచ్చారు రాజమౌళి. తెలుగు చిత్రపరిశ్రమలో దర్శకుడు రాజమౌళి ఓ సంచలనం. 'స్టూడెంట్ నెం.1' చిత్రం నుండి 'ఆర్ఆర్ఆర్' సినిమా వరకు దర్శకుడిగా రాజమౌళి ప్రయాణంతో పాటు ప్రముఖుల విశ్లేషణలతో ఉంటుందీ డాక్యుమెంటరీ. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా, కీరవాణిలు రాజమౌళితో తమ అనుబంధాన్ని ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. ''రాజమౌళికి కావాలనుకున్నట్టుగా మనం ఇమిడిపోతే ఆయనే మనలను తనకు తగ్గట్టుగా మలుచుకుంటాడు'' అని చెప్పారు ఎన్టీఆర్. ''రాజమౌళికి సినిమా అంటే పిచ్చి. సీన్ ఎవరైనా వివరిస్తారు. కాని ఆ సీన్‌లో ముందు ఆయన నటించి తరువాత మనతో చేయిస్తాడు. అందుకే రాజమౌళితో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని ప్రభాస్ తెలిపారు. వీరితో పాటు రాజమౌళి కుటుంబ సభ్యులు ఆయనతో తమ అనుభవాలు పంచుకున్నారు. తన సినిమాలలో హీరోలు ఆయుధాలని, దర్శకుడు ఆయుధాలను వదిలే సాధనం అని రాజమౌళి చెబుతూ... ''తనకు రాముడు కన్నా రావణుడు ఇష్టమని, అందుకే తన చిత్రాలలో ప్రతినాయకుడు ప్రత్యేకంగా కనిపించేలా చూసుకుంటాను'' అని వివరించారు. చిన్న పిల్లాడు అడుగులు వేసేటప్పుడు తడబడతాడు. అప్పుడు తల్లిదండ్రులు ప్రోత్సహించి మరో రెండు అడుగులు వేయిస్తే కొన్ని రోజులయ్యాక పరిగెడతాడు. ఆ కోవలోనే విజయం కోసం కృషి, పట్టుదల, ప్రోత్సాహంతో ఎంతో సాధన చేయాలి. ఈ విషయాన్ని డాక్యుమెంటరీలో లోతుగా వివరించారు రాజమౌళి. డాక్యుమెంటరీ మొత్తంలో చిన్న లోపం ఏంటంటే తెలుగులో దీనికి డబ్బింగ్ వేరొకరితో చెప్పించడం. అందుకే ఇంగ్లీషులో చూడడం శ్రేయస్కరం.

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	166	78,593
నిఫ్టీ ▽	63	23,993

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	16,562	△	362
డోజోన్స్	39,264	△	594
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,027	△	18
డాక్స్	17,354	△	15
షాంఘై	2,867	△	7
నికాయ్	34,675	△	3,217

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,117	▽	65
బంగారం (99.5 స్వచ్ఛత)	68,840	▽	65
వెండి (కిలో)	78,950	△	208

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.46	84.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.06	108.63
€	యూరో	ఎస్‌బీఐ	90.79	93.17
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.94	58.24
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.76	55.68
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.01	65.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.86	12.68

ఎస్‌బీఐ చైర్మన్‌గా శెట్టి నియామకానికి ఆమోదం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొత్త చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి) నియామకానికి కేంద్రం మంగళవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఆర్థిక సేవల విభాగం పంపిన ప్రతిపాదనకు నియామకాల క్యాబినెట్ కమిటీ (ఏసీసీ) ఆమోదముద్ర వేసినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడైంది. ఆగస్టు 28న ప్రస్తుత చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా పదవీ విరమణ అనంతరం ఆయన స్థానంలో శెట్టి బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం మూడేళ్లు ఉంటుంది. తెలంగాణలోని జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన శెట్టి ప్రస్తుతం ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్లలో అత్యంత సీనియర్‌గా ఉన్నారు. బీఎస్సీ చేసిన ఆయన 1988లో ప్రొబేషనరీ ఆఫీసరుగా ఎస్‌బీఐలో కెరియర్ ప్రారంభించారు. మరోవైపు, ప్రస్తుతం డీఎండీగా ఉన్న రాణా అశుతోష్ కుమార్ సింగ్‌ను ఎస్‌బీఐ ఎండీగా కేంద్రం నియమించింది. ఎస్‌బీఐలో ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉంటారు.

నిఫ్టీ 24,000 దిగువకు

- ఆరంభ లాభాలు ఆవిరి
- సూచీలకు మూడోరోజూ నష్టాలు



ముంబై: ఆసియా మార్కెట్ల రికవరీ, జపాన్ ఇండెక్స్ నికాయ్ బౌన్స్‌బ్యాక్‌తో ఉదయం ఉవ్వెత్తున ఎగసిన దేశీయ స్టాక్ సూచీలు ఆరంభ లాభాలు నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ సమావేశ ప్రారంభం నేపథ్యంలోనూ ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 166 పాయింట్లు కోల్పోయి 78,593 వద్ద స్థిర పడింది. నిఫ్టీ 63 పాయింట్లు పతనమై 24000 స్థాయి దిగువన 23,993 వద్ద నిలిచింది. ప్రథమార్ధంలో కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్ల వద్ద లభించడంతో సూచీలు భారీ ర్యాలీ చేశాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ, మెటల్ షేర్లు రాణించడంతో ఒక దశలో సెన్సెక్స్ 1093 పాయింట్లు పెరిగి 79,852 వద్ద, నిఫ్టీ 327 పాయింట్లు బలపడి 24,383 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి బ్యాంకులు, టెలికం, ఇంధన, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆరంభ లాభాలన్నీ ఆవిరయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సూచీలు 3 రోజుల్లో 4% పతనం కావడంతో ఇన్వెస్టర్లకు రూ.22.01 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.439.59 లక్షల కోట్లకు తగ్గింది.

మార్కెట్ అస్థిరతలోనూ అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.679) పోలిస్తే 7% ప్రీమియంతో రూ.725 వద్ద లిస్టయ్యింది. కొనుగోళ్ల మద్దతుతో 17% పెరిగి ఇంట్రాడే గరిష్టం రూ.797 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.12,534 కోట్లుగా నమోదైంది.



జీవితకాల కనిష్టం నుంచి రూపాయి రివకరీ అయ్యింది. డాలర్ మారకంలో మంగళవారం 17 పైసలు బలపడి 83.92 వద్ద స్థిరపడింది. ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి విలువ కనిష్టాల నుంచి కోలుకున్నట్లు ఫారెక్స్ నిపుణులు భావిస్తున్నారు.

ఇల్లు అమ్మినా.. పన్ను సునామా!



ఇల్లు విక్రయంపై దీర్ఘకాల మూలధన లాభాల పన్నును 12.5 శాతానికి తగ్గిస్తూ 2024–25 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకపోతే ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణ వ్యయం) ప్రయోజనాన్ని తొలగించారు. దీనివల్ల చెల్లించాల్సిన పన్ను భారం పెరిగిపోతుందని ఆందోళన చెందక్కర్లేదు. దీర్ఘకాల మూలధన లాభాలపై గతం నుంచి ఉన్న పన్ను మినహాయింపులను ప్రభుత్వం కొనసాగించింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మూలధన లాభాల పన్నులో మార్పులు

2024 జూలై 23లోపు ఇంటిని కొని మూడేళ్లు నిండిన తర్వాత విక్రయించగా వచ్చిన లాభాన్ని దీర్ఘకాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ)గా, మూడేళ్లలోపు విక్రయిస్తే వచ్చిన లాభాన్ని స్వల్పకాల మూలధన లాభం (ఎస్‌టీసీజీ)గా పరిగణించేవారు. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను నుంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని (ఇండెక్సేషన్) తీసివేసి, మిగిలిన పన్నుపై 20 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది.

2024 జూన్ 23 నుంచి.. రెండేళ్లు నిండిన తర్వాత విక్రయిస్తే ఎల్‌టీసీజీగా పరిగణిస్తున్నారు. ఆలోపు విక్రయిస్తే ఎస్‌టీసీజీ కిందకు వస్తుంది. రెండేళ్ల తర్వాత విక్రయించగా వచ్చిన లాభంపై ఇక మీదట 20 శాతానికి బదులు 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఇండెక్సేషన్ ప్రయోజనం ఉండదు. రెండేళ్లలోపు విక్రయిస్తే వచ్చిన లాభాన్ని తమ ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాలి.

సెక్షన్ 54ఈసీ

దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను మినహాయింపు కోసం ఇల్లు కాకుండా సెక్షన్ 54ఈసీ కింద.. ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ బాండ్లలో గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ బాండ్లలో పెట్టుబడులకు ఐదేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఇల్లు లేదా స్థలాన్ని విక్రయించిన వారు సైతం ఈ సెక్షన్ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు.

సెక్షన్ 54



ఇంటి విక్రయంపై ఎల్‌టీసీజీ వద్దనుకుంటే సెక్షన్ 54లో చెప్పిన విధంగా.. మరో ఇంటిపై ఇన్వెస్ట్ చేయాలి. ఇందుకు మూడు షరతులు ఉన్నాయి. విక్రయించిన తేదీ నుంచి రెండేళ్ల లోపు మరో ఇంటిపై ఇన్వెస్ట్ చేయాలి. లేదా మూడేళ్లలోపు ఇంటి నిర్మాణంపై ఖర్చు చేయాలి. లేదా ఇంటిని విక్రయించడానికి ముందు ఏడాదిలోపు మరో ఇంటిని కొనుగోలు చేసి ఉండాలి. జీవితంలో ఒకరు ఒక్కసారే ఈ ప్రయోజనాన్ని వినియోగించుకోగలరు.

- దీర్ఘకాల మూలధన లాభం రూ.2 కోట్లు మించకపోతే.. ఆ మొత్తంతో రెండు ఇళ్లు కొనుగోలు చేసినా పన్ను మినహాయింపునకు అర్హులే. లాభం రూ.2 కోట్లకు మించి ఉంటే ఆ మొత్తంతో ఒకే ఇంటిని కొనుగోలు చేయాలి.
- ఈ సెక్షన్ కింద గరిష్ఠ పన్ను ప్రయోజనం రూ.10 కోట్లు.
- పన్ను మినహాయింపు కోసం కొనుగోలు చేసిన ఇంటిని మూడేళ్ల తర్వాతే విక్రయించాలి. ఆలోపు విక్రయిస్తే పన్ను మినహాయింపు కోల్పోవాల్సి వస్తుంది.
- నిబంధనల మేరకు మరో ఇంటిని కొనుగోలు చేసే వరకు లేదా ఇంటిని నిర్మించుకునే వరకు ఆ మొత్తాన్ని బ్యాంక్‌లో 'క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్' (సీజీఏఎస్)లో డిపాజిట్ చేయాలి. ఇంటిని విక్రయించిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసే లోపే ఈ డిపాజిట్ చేయాలి.

పన్ను ఊరట

న్యూఢిల్లీ: ఇళ్ల విక్రయంపై బడ్జెట్‌లో చేసిన దీర్ఘకాల మూల ధన పన్ను ప్రతిపాదనలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. 2024 జూన్ 23 (బడ్జెట్)కు ముందు ఇల్లు కొనుగోలు చేసిన వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్).. వాటిని విక్రయించినప్పుడు పాత విధానంలో ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని వినియోగించుకుని 20% పన్ను చెల్లించొచ్చు. లేదా కొత్త విధానంలో ఇండెక్సేషన్ లేకుండా 12.5% పన్ను చెల్లించేలా ఫైనాన్స్ బిల్లు 2024లో సవరణలను ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించింది. సంబంధిత కాపీలను లోక్‌సభ సభ్యులకు అందించింది.



సెక్షన్ 54ఎఫ్

ఇల్లు కాకుండా ఇతర క్యాపిటల్ అసెట్స్ (షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ సహా) విక్రయించినప్పుడు వచ్చిన దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను మినహాయింపు ఎలా అన్నది సెక్షన్ 54 ఎఫ్ వివరిస్తోంది. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ తదితర క్యాపిటల్ అసెట్స్‌ను విక్రయించగా వచ్చిన మూలధన లాభంతో రెండేళ్లలోపు ఇంటిని కొనుగోలు చేయాలి. లేదా మూడేళ్లలో ఇంటి నిర్మాణంపై వ్యయం చేయాలి. లేదా విక్రయించడానికి ముందు ఏడాదిలోపు ఇంటిని కొనుగోలు చేసి ఉండాలి. ఇక్కడ కూడా గరిష్ఠ పన్ను మినహాయింపు రూ.10 కోట్లకే పరిమితం. అలాగే, క్యాపిటల్ అసెట్స్ విక్రయించగా వచ్చిన మొత్తాన్ని ఇంటిపై వెచ్చించేంత వరకు క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేయాలి.

రెండు రకాల ప్రయోజనాలు

ఈ సెక్షన్ల కింద ఒకటికి మించిన ప్రయోజనానికి అర్హులే. ఉదాహరణకు ఇంటిపై దీర్ఘకాల మూలధన లాభం రూ.10.5 కోట్లు వచ్చిందని అనుకుందాం. అప్పుడు రూ.10 కోట్లతో మరో ఇంటిని కొనుగోలు చేసి సెక్షన్ 54 కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకున్న తర్వాత మరో రూ.50 లక్షలు మిగిలి ఉంటాయి. అప్పుడు సెక్షన్ 54ఈసీ కింద ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ క్యాపిటల్ గెయిన్ బాండ్లలో రూ.50 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా పన్ను లేకుండా చూసుకోవచ్చు.

ఐదేళ్లలో రద్దు చేసిన రుణాలు రూ. 9.9 లక్షల కోట్లు

కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి



న్యూఢిల్లీ: గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు రూ. 9.90 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మంగళవారం రాజ్యసభకు తెలిపారు. 2019–20లో అత్యధికంగా రూ. 2.34 లక్షల కోట్లు రైటాఫ్ చేయగా ఆ తర్వాత సంవత్సరంలో ఇది రూ. 2.02 లక్షల కోట్లకు, 2021–22లో రూ. 1.74 లక్షల కోట్లకు తగ్గింది. తర్వాత సంవత్సరంలో ఇది తిరిగి రూ. 2.08 లక్షల కోట్లకు పెరగ్గా, గత ఆర్థిక సంవత్సరం రూ. 1.70 లక్షల కోట్లకు పరిమితమైంది. రైటాఫ్ చేసినంత మాత్రాన బాకీలను పూర్తిగా రద్దు చేసి రుణగ్రహీతలకు మేలు చేసినట్లు కాదని, వారు వాటిని చెల్లించాల్సి ఉంటుందని మంత్రి వివరించారు. బ్యాలెన్స్ షీట్‌ను మెరుగుపర్చుకునేందుకు, పన్ను ప్రయోజనాలు పొందేందుకు, మూలధనాన్ని మెరుగ్గా ఉపయోగించుకునేందుకు నిర్దిష్ట నిబంధనలకు లోబడి బ్యాంకులు మొండి బాకీలను రైటాఫ్ చేస్తుంటాయని పేర్కొన్నారు. ఆ మొత్తాన్ని రాబట్టేందుకు బ్యాంకుల చర్యలు కొనసాగుతాయని తెలిపారు. గత అయిదేళ్లలో రూ. 1.84 లక్షల కోట్లు రికవర్ అయినట్లు మంత్రి చెప్పారు.


వేదాంతా లాభం జూమ్



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37% జంప్‌చేసి రూ. 3,606 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,640 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,279 కోట్ల నుంచి రూ. 36,698 కోట్లకు ఎగసింది. వివిధ బిజినెస్‌లను ఆరు లిస్టెడ్ కంపెనీలుగా విడదీసే ప్రతిపాదనలు అనుకున్న విధంగానే కొనసాగుతున్నట్లు తెలియజేసింది.

వేదాంతా షేరు స్వల్ప లాభంతో రూ. 414 వద్ద ముగిసింది.

బేసిక్ ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ అక్కర్లేదు: సీతారామన్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి జన్ ధన్ ఖాతాలు, బేసిక్ పొదుపు ఖాతాల్లో కనీస బ్యాలెన్స్‌ను పాటించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇతరత్రా ఖాతాల్లో నిబంధనలకు అనుగుణంగా కస్టమర్లు నిర్దిష్ట బ్యాలెన్స్ ఉంచడంలో విఫలమైతేనే బ్యాంకులు పెనాల్టీ విధిస్తాయని పేర్కొన్నారు. ఖాతాదార్లు మినిమం బ్యాలెన్స్ పాటించనందుకు గాను ప్రభుత్వ రంగ బ్యాంకులు గత అయిదేళ్లలో రూ. 8,500 కోట్ల మొత్తాన్ని పెనాల్టీ కింద వసూలు చేయడంపై రాజ్యసభలో జరిగిన చర్చలో మంత్రి ఈ మేరకు వివరణ ఇచ్చారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఆ ఇండెక్స్‌లో చోటుతో షేర్ల పరుగు | టాటా పవర్ రికార్డు లాభం

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎన్‌సీఈఆర్‌టీలో 123 టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 123
- పోస్టుల వివరాలు: ప్రొఫెసర్–33, అసోసియేట్ ప్రొఫెసర్–58, అసిస్టెంట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ లైబ్రేరియన్–32.
- విభాగాలు: హిస్టరీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, జాగ్రఫీ, సైకాలజీ, సివిల్ ఇంజనీరింగ్, హిందీ, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, చైల్డ్ డెవలప్‌మెంట్,ఇంగ్లిష్, ఆర్ట్స్,ఫిజిక్స్, జువాలజీ,అగ్రికల్చర్, మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్ తదితరాలు.
- అర్హత: పోస్టును అనుసరించి పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్/సెట్ స్కోరుతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.
- వేతనం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,44,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400, అసిస్టెంట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు రూ.57,700.
- ఎంపిక విధానం:విద్యార్హతలు,దరఖాస్తుల షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.08.2024.
- వెబ్‌సైట్: https://ncert.nic.in

ఎన్‌సీసీబీఎమ్, బల్లాబ్‌ఘర్‌లో 28 ల్యాబ్ అనలిస్ట్ పోస్టులు

బల్లాబ్‌ఘర్ (హర్యానా)లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్(ఎన్‌సీసీబీఎమ్).. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 28.
- పోస్టుల వివరాలు: ల్యాబ్ అనలిస్ట్–16, సీనియర్ అసిస్టెంట్–1, జూనియర్ అసిస్టెంట్–10, డిజైనర్–1.
- విభాగాలు: కాలిబ్రేషన్ సర్వీసెస్, స్టాండర్డ్ రిఫరెన్స్ మెటీరియల్స్ అండ్ ఇంటర్ ల్యాబొరేటరీ సర్వీసెస్ తదితరాలు.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా (సివిల్/మెకానికల్), డిగ్రీ(బీఎస్సీ/బీకాం), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: ల్యాబ్ అనలిస్ట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు, సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేది: నోటిఫికేషన్ వెలువడిన 21రోజుల్లోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి
- నోటిఫికేషన్ వెలువడిన తేది: 27.07.2024.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.ncbindia.com

ఎన్‌హెచ్‌ఏఐ, న్యూఢిల్లీలో 11 పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 11.
- పోస్టుల వివరాలు:సీనియర్ బ్రిడ్జ్/స్ట్రక్చరల్ ఇంజనీర్–1, బ్రిడ్జ్ డిజైన్ ఇంజనీర్–2, జియోటెక్నికల్ ఇంజనీర్–1,హైడ్రాలజీ అండ్ హై డ్రాలిక్ ఎక్స్‌పర్ట్–1, సీనియర్ టన్నెల్ ఇంజనీర్–1, టన్నెల్ ఇంజనీర్–1, జియాలజిస్ట్– 1, క్వాంటిటీ సర్వేయర్–1, డ్రాఫ్ట్‌మ్యాన్–2.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(సివిల్), డిగ్రీ(సివిల్), పీజీ(జియాలజీ/స్ట్రక్చరల్/టన్నెల్/మైనింగ్),పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: స్ట్రక్చరల్ ఇంజనీర్, సీనియర్ టన్నెల్ ఇంజనీర్ పోస్టులకు 60 ఏళ్లు, క్వాంటిటీ సర్వేయర్, డ్రాఫ్ట్‌మ్యాన్ పోస్టులకు 45 ఏళ్లు, మిగతా పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం:ధ్రువపత్రాల పరిశీలన,స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.08.2024.
- వెబ్‌సైట్: https://nhai.gov.in

టీఐఎఫ్‌ఆర్, ముంబైలో క్లర్క్ ఉద్యోగాలు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్).. క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 06.
- పోస్టుల వివరాలు: సైంటిఫిక్ ఆఫీసర్–01, జూనియర్ ఇంజనీర్–01,క్లర్క్–02,ప్రాజెక్ట్ ల్యాబొరేటరీ అసిస్టెంట్(ఫిట్టర్ ట్రేడ్/రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్ ట్రేడ్)–02.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: క్లర్క్ పోస్టుకు 38 ఏళ్లు, మిగతా పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరితేది: 24.08.2024.
- వెబ్‌సైట్: https://www.tifr.res.in

మెరుగైన స్కోర్‌కు మార్గమిదే!

» ఐఐఎం–క్యాట్ 2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» నవంబర్ 24న జాతీయ స్థాయిలో పరీక్ష
» 21 ఐఐఎంలలో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులు
» దేశ వ్యాప్తంగా ఆరు వేలకుపైగా సీట్లు

మేనేజ్‌మెంట్ విద్య,బోధనలో ప్రసిద్ధ సంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లు! ఇవి అందించే మేనేజ్‌మెంట్ పీజీ, ఎంబీఏ, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ తదితర కోర్సుల్లో చేరాలని కోరుకునే వారి సంఖ్య లక్షల్లోనే!! ఇందుకోసం ఐఐఎంలు ఏటా నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)కు సన్నద్ధమవుతుంటారు. ఇలాంటి వారంతా ఇక తమ ప్రిపరేషన్‌ను మరింత ముమ్మరం చేసుకోవాల్సిన సమయం! కారణం.. క్యాట్–2024 నోటిఫికేషన్ విడుదల కావడమే! ఈ నేపథ్యంలో.. క్యాట్–2024 ప్రత్యేకతలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఐఐఎం–క్యాట్–2024

క్యాట్–2024 షెడ్యూల్‌ను దాదాపు నాలుగు నెలల ముందుగానే ప్రకటించారు. అంతేకాకుండా పరీక్షకు మూడు నెలల ముందుగానే దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యేలా షెడ్యూల్ రూపొందించారు. ఫలితంగా అభ్యర్థులకు అప్లికేషన్ టెన్షన్ నుంచి ఉపశమనం కలిగి.. పరీక్ష సన్నద్ధతపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు వీలుకలుగుతుంది. ఈ ఏడాది నవంబర్ 24న మొత్తం మూడు సెషన్లలో క్యాట్ పరీక్ష సీబీటీ విధానంలో నిర్వహించనున్నారు.

మొత్తం 21 ఐఐఎంలు

క్యాట్‌లో ప్రతిభ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐఎంలలో పీజీ స్థాయి కోర్సుల్లో (ఎంబీఏ/పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్), పీహెచ్‌డీలో చేరే అవకాశం లభిస్తుంది. దీంతోపాటు ఎండీఐ–గుర్గావ్, ఎఫ్ఎంఎస్–ఢిల్లీ, ఐపీఎం తదితర 500కు పైగా పేరున్న మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లోనూ అడ్మిషన్ పొందే వీలుంది.

కార్పొరేట్ కెరీర్‌కు మార్గం

క్యాట్ స్కోర్‌తో ఐఐఎం క్యాంపస్‌ల్లో చేరి కోర్సు పూర్తి చేసుకున్న వారికి కార్పొరేట్ కంపెనీలు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతాయనడంలో సందేహం లేదు. ఎంఎన్‌సీలు మొదలు స్టార్టప్ సంస్థల వరకూ.. ఐఐఎం క్యాంపస్‌లలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తూ లక్షల ప్యాకేజీలతో ఆఫర్లు ఇస్తున్నాయి. సగటున రూ.35 లక్షల వార్షిక వేతనం దక్కే అవకాశముంది. ఇంటర్న్‌షిప్ సమయంలోనే రెండు నెలల వ్యవధికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు స్టయిఫండ్ లభిస్తుంది.

అర్హత

క్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

మూడు విభాగాల్లో పరీక్ష

క్యాట్ పరీక్షను ఈ ఏడాది కూడా మూడు విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా పరీక్ష విధానంలో ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగిస్తున్నారు. ఫలితంగా అభ్యర్థులకు ఆయా విభాగాల్లోని ముఖ్యాంశాలు, ఎక్కువ వెయిటేజీ లభిస్తున్న టాపిక్స్‌పై స్పష్టత వస్తుంది. క్యాట్‌లో మొదటి విభాగంగా వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్; రెండో విభాగంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్; మూడో విభాగంగా క్వాంటిటేటివ్ ఎబిలిటీ ఉన్నాయి.

- వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున మొత్తం 66 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు.
- ఒక్కో విభాగానికి 40 నిమిషాలు చొప్పున మొత్తం 120 నిమిషాల్లో (రెండు గంటలు) పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు పరీక్ష సమయంలో ఒక విభాగం పూర్తయ్యాకే మరో విభాగం సమాధానాలకు ఉపక్రమించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: 2024, ఆగస్టు 1 – సెప్టెంబర్ 13
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024,నవంబర్ 5 నుంచి
- క్యాట్ పరీక్ష తేదీ: 2024, నవంబర్ 24
- ఫలితాల వెల్లడి: 2025, జనవరి రెండో వారంలో.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://iimcat.ac.in

సన్నద్ధతకు.. సమయమిదే

క్యాట్–2024 పరీక్ష నవంబర్ 24న నిర్వహించనున్నారు. అంటే..ఇప్పటి నుంచి దాదాపు నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంది. పూర్తి స్థాయిలో సమయం కేటాయిస్తే సిలబస్ అంశాలపై పట్టు సాధించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్

ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ సబ్జెక్ట్ నాలెడ్జ్‌ను పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పేరాగ్రాఫ్‌లను ప్రాక్టీస్ చేయాలి. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నల కోసం అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్

ఇది అభ్యర్థుల్లోని విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక విశ్లేషణ నైపుణ్యాన్ని పరిశీలించే విభాగం. దీని కోసం టేబుల్స్,గ్రాఫ్స్,చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలను అధ్యయనం చేయాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలంటే..పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్–టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీపై అవగాహన పెంచుకోవాలి.

కటాఫ్ పర్సంటైల్

క్యాట్ పరీక్షలో ప్రతి సెక్షన్‌లోనూ నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందేలా కృషి చేయడం చాలా అవసరం. ఎందుకంటే.. ఐఐఎంలు మలిదశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను పిలిచేందుకు నిర్దిష్టంగా సెక్షనల్ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను పేర్కొంటున్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఓవరాల్ కటాఫ్ కనిష్టంగా 85, గరిష్టంగా 90 పర్సంటైల్ పొందాలి. అదే విధంగా సెక్షనల్ కటాఫ్ 75 నుంచి 80 పర్సంటైల్ వరకూ ఉంటోంది.

కాన్సెప్ట్స్+ ప్రాక్టీస్

క్యాట్‌లో మెరుగైన స్కోర్, పర్సంటైల్ సాధించేందుకు ప్రతి సెక్షన్ కీలకం. కాబట్టి అభ్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. తొలుత సిలబస్‌ను పరిశీలించి.. సంబంధిత కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ప్రామాణిక మెటీరియల్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. ప్రతి టాపిక్ పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ చేయాలి.

మాక్, మోడల్ టెస్ట్

క్యాట్‌లో మెరుగైన స్కోర్ సాధించే క్రమంలో అభ్యర్థులు మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది. మాక్ టెస్ట్‌ల ఫలితాలను విశ్లేషించుకుని.. తాము ఇంకా అవగాహన పెంచుకోవాల్సిన అంశాలను గుర్తించి వాటిపై మరింత ఎక్కువ దృష్టి సారించాలి. ఇలా సబ్జెక్ట్ ప్రిపరేషన్ సాగిస్తూనే నిరంతరం తమ ప్రతిభను పెంచుకునేలా ప్రాక్టీస్‌కు, నమూనా పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

జీడీ/పీఐకు కూడా

క్యాట్ ఫలితాల ఆధారంగా మలి దశలో ఐఐఎంలు నిర్వహించే ప్రత్యేక ఎంపిక ప్రక్రియలోనూ విజయం సాధించే దిశగా కృషి చేయాలి. క్యాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుని ఐఐఎంలు తదుపరి దశ ఎంపిక ప్రక్రియ చేపడతాయి.అర్హులైన అభ్యర్థులకు మలి దశలో గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. వీటికి నిర్దిష్ట వెయిటేజీ కేటాయించే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఆయా ఐఐఎంల గత ప్రవేశ విధానాలను పరిశీలిస్తే.. క్యాట్ స్కోర్‌కు 50 నుంచి 70శాతం,జీడీ/పీఐలకు 30నుంచి 50శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు గ్రూప్ డిస్కషన్,పర్సనల్ ఇంటర్వ్యూ, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లలోనూ రాణించేందుకు కృషి చేయాలి.



సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసిన ట్రెసా బృందం

కొత్త రెవెన్యూ చట్టంతో రైతులకు మేలు

• మంత్రి పొంగులేటిని కలసి అభినందనలు తెలిపిన ట్రెసా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో రైతులకు, రాష్ట్ర ప్రజలకు మరింత మేలు కలుగుతుందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) అభిప్రాయ పడింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసిన ట్రెసా బృందం అభినందనలు తెలిపింది. కొత్త చట్టం ముసాయిదాపై ప్రజాభిప్రాయం కోరడం చరిత్రాత్మకమని వెల్లడించింది. తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించడంపట్ల హర్షం వ్యక్తం చేసింది. అదేవిధంగా ఇతర శాఖలకు బదలాయించిన వీఆర్వో, వీఆర్‌ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ట్రెసా బృందం సభ్యులు మంత్రిని కోరారు. మంత్రి పొంగులేటిని కలసిన వారిలో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, నేతలు కె. నిరంజన్‌రావు, దేశ్యా, రమణ్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు అఖిలభారత జాతీయ ఓబీసీ మహాసభ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఓబీసీ డిమాండ్ల సాధన కోసం బుధవారం పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు దేశంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 10,000 మంది ఓబీసీ ప్రతినిధులు ఈ సభలో పాల్గొంటారని జాజుల పేర్కొన్నారు.

బీసీ కమిషన్‌ను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారు?

• రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల కోసం పూర్తి స్థాయి కమిషన్‌ను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారో ఆగస్టు 27లోగా తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే బీసీల్లో ఏయే వర్గాలు ఎంత వెనుకబడి ఉన్నాయో అధ్యయనం చేపట్టాలని స్పష్టం చేసింది. జీహెచ్‌ఎంసీ, పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో సీట్లు రిజర్వ్ చేసేందుకు బీసీ రిజర్వేషన్లను కేటగిరీల వారీగా అమలు చేయాలని గతంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. స్థానిక సంస్థల్లో బీసీలకు సీట్లు కేటాయించే ముందు బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని చెప్పింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీలకు సీట్లు కేటాయించాలని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దన్న సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు నిర్ణయం తీసుకోవాలని చెబుతూ, విచారణ వాయిదా వేసింది.

తెలంగాణ ఉద్యమానికి ఆయువుపట్టు గద్దర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి

సాక్షి, హైదరాబాద్: పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువు పట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు.





SHOWROOMS: TELANGANA: HYDERABAD: RENAULT GACHIBOWLI Ph: 9289220863, RENAULT HITECH CITY Ph: 9311733970, RENAULT KUKATPALLY Ph: 7067322620, RENAULT LB NAGAR Ph: 9311700671.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.